అనుదినం... జనస్వరం
కరీంనగర్ - రాజన్న సిరిసిల్ల
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక



08 పేజీలు | సోమవారం 01 మే 2023 | www.navatelangana.com

ఎందరో ప్రాణత్యాగాల ఫలితమే మేడే



మేడే పుట్టింది ఇక్కడే...

ఎనిమిది గంటల పని, ఎనిమిది గంటలు వినోదం, ఎనిమిది గంటలు విశ్రాంతి కావాలన్న బ్యానర్ పట్టుకుని 1858లో ఆస్ట్రేలియాలో ఎనిమిది గంటల పని దినోత్సవ మూడో వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న కార్మిక సంఘం అధ్యక్షుడు ఆర్ మిల్లర్, కార్యదర్శి జి. రావెన్‌స్క్రాఫ్ట్, సభ్యులు

మే 1.. అంటే 'మేడే'. దీన్ని అంతర్జాతీయ కార్మిక దినోత్సవం అని కూడా పిలుస్తారు. అమెరికాలో మాత్రం ప్రస్తుతం దీన్ని 'లాయల్టీ డే'గా వ్యవహరిస్తున్నారు. చాలా దేశాల్లో మే డేని సెలవు దినంగా పాటిస్తారు. ఈ కార్మిక దినోత్సవ ఆవిర్భావాన్ని ఏ ఒక్క దేశానికో, సంఘటనకో ముడిపెట్టలేం. కానీ 1886లో షికాగోలోని హే మార్కెట్‌లో జరిగిన కార్మికుల ప్రదర్శనే ఈ మేడే పుట్టుకకు పునాది వేసిందని చెబుతారు. కార్మికులకు ఎనిమిది గంటల పని విధానం గురించి నినదిస్తూ 1886, మే1న చాలామంది కార్మికులు పోరాటం చేపట్టారు. దానికి మద్దతుగా నాలుగు రోజుల తరవాత షికాగోలోని హే మార్కెట్‌లో చాలామంది ప్రదర్శన నిర్వహించారు. కానీ ఆ ప్రదర్శన ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో కొందరు కార్మికులు చనిపోయారు. ఆ సంఘటన అనంతరం 1889 నుంచి 1890 వరకు అనేక దేశాల్లో కార్మికుల ఉద్యమాలూ, నిరసన ప్రదర్శనలూ చోటుచేసుకున్నాయి. 1890, మే 1న బ్రిటన్‌లోని హైడ్ పార్క్‌లో చేపట్టిన ప్రదర్శనకు దాదాపు 3 లక్షల మంది కార్మికులు హాజరయ్యారు. రోజులో కేవలం 8 గంటలు మాత్రమే పనివేళలు ఉండాలన్నదే ఆ ప్రదర్శనలో పాల్గొన్న వారి ప్రధాన డిమాండ్‌గా మారింది. ఆ పైన అనేక యూరోపియన్ దేశాల్లో ఇదే నినాదంతో ప్రదర్శనలు జరిగాయి. క్రమంగా షికాగోలో జరిగిన కార్మిక ప్రదర్శనలో చనిపోయిన వారికి గుర్తుగా మే 1ని కార్మిక దినోత్సవంగా జరుపుకోవాలన్న ఒప్పందం కూడా కుదిరింది. ఆపై ప్రపంచవ్యాప్తంగా మే డే స్వరూపం మారుతూ వచ్చింది. అనేక దేశాల్లో ఆ రోజున కార్మికుల హక్కుల కోసం పోరాటాలూ, నిరసన ప్రదర్శనలూ మాత్రం ఆగలేదు.

- నవతెలంగాణ, కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

కార్మిక పక్షపాతిగా అంబేద్కర్ అడుగులు

- రాజ్యాంగ నిర్మాణంలోనే కార్మికులకు పెద్దపీట
- కార్మికులకు ప్రయోజనం చేకూర్చేలా 17 చట్టాలకు రూపకల్పన
- 'ఇండిపెండెంట్‌లేబర్' పార్టీ పేరుతో కార్మికుల పక్షాన తొలిసారిగా పార్టీ స్థాపన
- మీకు ఉద్యోగం కావాలా? హక్కులుకావాలా? ప్రశ్నించిన గొంతుక
- కార్మికుల హక్కులు, సంక్షేమం, ఐక్యత కోసం సుదీర్ఘకాల కృషి

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్వాతంత్రోద్యమకాలంలోనే కార్మికుల పక్షాన పోరాడారు. స్వాతంత్ర్యం సిద్ధించాక వారికి ప్రయోజనం చేకూరేలా హక్కులకు రూపకల్పన చేశారు. 17 నిర్దిష్టమైన చట్టాలను పొందుపరిచారు. లాభార్జనే ధ్యేయమైన ఆర్థిక వ్యవస్థ పౌరుడి ప్రాథమిక హక్కులను ఎలా దెబ్బతీయగలదో వివరిస్తూ అప్పటి దేశపౌరులకు 'మీకు ఉద్యోగం కావాలా? హక్కులు కావాలా?' అనే ప్రశ్నలు లేవనెత్తి.. ప్రయివేటు విధానాలపై ఉద్యమించారు. కార్మికుల హక్కులు, సంక్షేమం, ఐక్యత కోసం సుదీర్ఘకాలం కృషి చేసిన ఆయన దేశంలోనే తొలిసారి కార్మికవర్గ పక్షాన ఇండిపెండెంట్ లేబర్ పార్టీ పేరుతో ఓ రాజకీయపార్టీని కూడా స్థాపించారు.


కార్మిక ప్రయోజనాల పరిరక్షణకు...

వైస్రాయ్ కార్యనిర్వాహక కౌన్సిల్‌లో 1942 జులై నుంచి 1946 జూన్ వరకు అంబేడ్కర్ సభ్యుడిగా ఉన్నప్పుడు కార్మికుల ప్రయోజనాల పరిరక్షణకు కీలక చర్యలు చేపట్టారు. భారత ప్రభుత్వం ఆయన నాయకత్వంలో, కార్మిక సమస్యలు, పారిశ్రామిక సమస్యల పరిష్కారంపై దష్టి కేంద్రీకరించింది. కార్మికులందరికీ సరైన వేతనాలు, సరైన పరిస్థితులను హక్కుగా కల్పించింది. స్వాతంత్ర్యం అనంతరం ఏర్పడ్డ తొలి కేబినెట్‌లో అంబేడ్కర్ న్యాయశాఖ మంత్రిగా సేవలందించారు. కార్మికుల పరిహార చట్టం, ప్రసూతి ప్రయోజనాల చట్టం, 1943 నాటి కర్మాగారాల చట్టంలలో కార్మికులకు అనుకూలంగా సవరణలు తీసుకొచ్చేందుకు వివిధ స్థాయుల్లో ఆయన చర్యలు చేపట్టారు. పరిశ్రమల్లో రోజుకు 12 గంటల పని విధానాన్ని వ్యతిరేకించారు. బ్రిటన్ తరహాలో వారానికి 48 గంటల పని విధానాన్ని తీసుకొచ్చారు.

ఇండిపెండెంట్‌లేబర్ పార్టీ...

తొలి కార్మిక వర్గ పార్టీని స్థాపించింది రాజ్యాంగ నిర్మాత డాక్టర్.బీఆర్ అంబేద్కరే! 1936 ఆగస్టులో అంబేడ్కర్ 'ఇండిపెండెంట్ లేబర్ పార్టీ(ఐఎల్‌పీ)'ని స్థాపించారు. తమది కార్మికుల పార్టీ అని ఐఎల్‌పీ ప్రకటించుకొంది. కార్మిక వర్గాల సంక్షేమమే పరమావధిగా కలిగిన కార్మిక సంస్థగా ఐఎల్‌పీ 1937లో వెలువరించిన విధానపత్రంలో తనను తాను అభివర్ణించుకొంది. 1937లో జరిగిన

మిగతా 8లో..




పెండ్లికానుక.. ప్రసూతి సాయం!

- ప్రమాదవశాత్తు మరణానికి రూ.6.30లక్షలు
- సాధారణ మరణానికి రూ.1.30లక్షలు బీమా
- సంక్షేమపథకాలపై కార్మికులకు అవగాహన అవసరం
- ఇప్పటికే తమ శాఖతరుపున విస్తృత ప్రచారం
- ఈ శ్రమ్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,63,462 కార్మికుల నమోదు
- పారదర్శకంగా.. క్షేత్రస్థాయి పరిశీలనతోనే క్లెయిమ్‌ల పరిష్కారం
- కరీంనగర్ డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎస్.రమేష్‌బాబు

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

కార్మికుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమపథకాలను ప్రవేశపెట్టింది. ఇంట్లో ఆడపిల్ల పెండ్లి అయినా, అమ్మాయి ప్రసవించినా కార్మికశాఖ ఆధ్వర్యంలో సాయాన్ని అందిస్తోంది. కార్మికునికి గుర్తింపుకార్డు సహా ఏదేనా ప్రమాదశాత్తు మరణం సంభవిస్తే రూ.6.30లక్షలు, సాధారణ మరణమైతే రూ.1.30లక్షలు పరిహారం అందిస్తోంది. ఇవేగాకుండా ప్రమాదంలో పూర్తిఅంగవైకల్యం పొందినా రూ.30వేలు ఇస్తోంది. తాత్కాలిక వైద్య ఖర్చుల కింద కార్మికులకు మూన్నెళ్ల వరకు నెలవారీ సాయం అందిస్తోంది. ఇలాంటి అనేక కార్మిక సంక్షేమాలపై కార్మికులు అవగాహన పెంచుకుని కార్మికశాఖలో పేర్లు నమోదు చేసుకుంటే ప్రయోజనాలు వర్తిస్తాయని కరీంనగర్ డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎస్.రమేష బాబు చెబుతున్నారు. శ్రమ ఏవ జయతే నినాదంతో కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమాలు, ప్రయోజనాల గురించి 'నవతెలంగాణ' తీసుకొచ్చిన మే డే ప్రత్యేక సంచికలో వివరించారు.



నవతెలంగాణ : కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలేమిటి?

డీసీఎల్ : భవన నిర్మాణ రంగాల్లో పని చేసే వారికి ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పిస్తోంది. కార్మిక శాఖ అందిస్తున్న గుర్తింపు కార్డులు పొందాలి. ఐదేళ్ల కోసారి రెన్యూవల్ చేయించుకోవాలి. ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.6.30లక్షలు పరిహారం పొందవచ్చు. సాధారణ మరణం సంభవిస్తే రూ.1.30లక్షలు వస్తాయి. ఇంట్లో ఇద్దరు ఆడపిల్లల వివాహం సమయంలో రూ.30వేల చొప్పున పెండ్లికానుక వస్తుంది. ఆడ పిల్లల రెండు కాన్పుల వరకు ఒక్కొక్కరికీ రూ.30వేల చొప్పున ప్రసూతి సాయం అందుతుంది. ప్రమాదంలో అంగవైకల్యం సంభవిస్తే తీవ్రతను బట్టి రూ.5లక్షల వరకు వైద్య ఖర్చులు పొందే వెసులుబాటు ఉంది. ప్రమాదంలో గాయపడి తాత్కాలిక వైద్య ఖర్చుల కింద కార్మికులకు నెలకు రూ.4500 చొప్పున గరిష్టంగా రూ.13500 వరకు మూన్నెళ్లపాటు అందుతుంది. రోగాల బారిన పడి ఆస్పత్రిలో చేరి ఐదు రోజులపైబడి ఉంటే రోజుకు రూ.300 చొప్పున ఆర్థిక సాయమూ పొందవచ్చు.

నవతెలంగాణ : కొత్తగా గుర్తింపు కార్డులు ఎలా పొందాలి.?

డీసీఎల్ : కార్మికులు తమ ధ్రువీకరణ పత్రాలతో మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్, రేషన్‌కార్డులు, బ్యాంకు ఖాతా ప్రతులతో పాటు పాసుఫొటో ఇవ్వాలి. ఆ దరఖాస్తులు మాకు రాగానే వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి తరువాత గుర్తింపుకార్డులు జారీ చేస్తాం. తిరిగి ఆ కార్డులను మీ సేవ కేంద్రాల్లోనే పొందాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ శ్రమ్ ద్వారా నమోదు చేసుకున్న కార్మికులు 4,63,462 మంది ఉన్నారు. జిల్లాలవారీగా చూస్తే కరీంనగర్‌లో 1,59,951, జగిత్యాలలో 1,25,801, పెద్దపల్లిలో 1,13,376, రాజన్నసిరిసిల్ల జిల్లాలో 64,334 మంది నమోదు చేసుకున్నారు.

నవతెలంగాణ :కార్మికశాఖ ద్వారా ప్రయోజనాలు ఎలా పొందాలి.

డీసీఎల్ : గుర్తింపు పొందిన ఏడాది తరువాత పెండ్లికానుక, ప్రసూతి సాయం అందుతాయి. బీమాకు మాత్రం కార్డు పొందిన రోజు నుంచే అర్హులుగా పరిగణిస్తాము. వీటిని పొందాలంటే మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని, కావాల్సిన పత్రాలు సమర్పించాలి. అధికారులు వాటిని పరిశీలించి ప్రయోజనాలు మంజూరు చేస్తారు.

నవతెలంగాణ : బీమా క్లయిమ్స్‌లో పలు ఆరోపణలపై...

డీసీఎల్ : బీమా పొందడానికి మీసేవ కేంద్రాల్లోనే దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి ఆమోదం తెలుపగానే ప్రభుత్వం అందించే బీమా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయి. ఈ ప్రక్రియ పారదర్శకంగా క్షేత్రస్థాయిలో నిజనిర్ధారణ చేసుకున్నాకే క్లయిమ్‌లు లభిస్తాయి. ఇందులో ఎవరూ దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో పెండ్లికానుక, ప్రసూతిసాయం, ప్రమాద, సాధారణ మరణాలు, అంగవైకల్యం, ఆస్పత్రి ఖర్చుల కింద 3854 మంది లబ్ధిదారులకు రూ.15.40కోట్లు అందించాం.

నవతెలంగాణ: కార్మికశాఖ సంక్షేమాలకు అర్హులెవరు?.. అసంఘటిత రంగం పరిధిలోకి వచ్చేవారెవరు?

డీసీఎల్ : ఈ శ్రమ్‌లో చేరాంటే ప్రధానంగా కార్మికుడు 18 నుంచి 59 ఏండ్లలోపు వయసులో ఉండాలి. ఆదాయపన్ను పరిధిలోకి రాని వారు అయి ఉండాలి. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్), ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఈహెచ్‌ఎస్) సదుపాయం లేనివారై ఉండాలి. అసంఘటితరంగ కార్మిక కేటగిరిల్లో తప్పనిసరిగా పని చేస్తూ ఉండాలి. వ్యవసాయ అనుబంధ చిన్నసన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, ఉద్యానవనాల పనివారు, నర్సరీలు, పాడి పరిశ్రమ, భవన నిర్మాణ రంగం, దాని అనుబంధ రంగాల్లో పని చేసేవారు (తాపీ, తవ్వకం, రాళ్లుకొట్టేపని, సెంట్రింగ్, రాడ్‌బెండింగ్, సానిటరీ, పేయింటర్, టైల్స్, ఎలక్ట్రీషియన్, వెల్డింగ్, ఇటుక, సున్నంబట్టీలు, రిగ్గర్లు, కాంక్రీట్‌మిక్సర్, బావులు తవ్వకం, పూడిక తీయడం, కర్రపని) వంటివారు అసంఘటిత రంగంలోకి వస్తారు. ఇంకా టెయిలరింగ్, ఎంబ్రాయిడరీ, డ్రెస్ మేకర్స్, ఆటోమొబైల్‌రంగంలోని డ్రైవర్లు, హెల్పర్లు, చేతివృత్తులవారిలో చేనేత, కమ్మరి, స్వర్ణకారులు, కమ్మరి, క్షౌరవృత్తి, బ్యూటీపార్లర్లలో పని చేసేవారు, చర్మకారులు, రజకులు కూడా ఈ రంగం కిందకే వస్తారు. ఇంకా సేవారంగంలోని ఇండ్లలోని పనిచేసేవారు, కొరియర్ బాయ్స్, ఇంటి వద్ద రోగులకు సేవలందించేవారూ ఉన్నారు. ఎస్‌ఆర్‌ఈజీ వర్కర్లు, ఆశావర్కర్లు, ఎస్‌హెచ్‌జీ స్వయం సహాక సంఘాలు, అంగన్‌వాడీలు, మిడ్ మే మీల్ వర్కర్లు, విద్యావాలంటీర్లు, గ్రామ, వార్డు వాలంటీర్లు, లోడింగ్, అన్‌లోడింగ్ హమామీలు, బేకరీ, పాల ఉత్పత్తులు, ఫాస్ట్ ఫుడ్ తయారీదారులు, వలస కార్మికులు ఈ అసంఘటిత రంగ కార్మికుల కిందనే ప్రభుత్వం జమ కడుతోంది.

నవతెలంగాణ: ఈ శ్రమ్ ఉద్దేశం, సదుపాయాలు ?

డీసీఎల్ : ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదయ్యే అసంఘటిత కార్మికులకు అందే ప్రధానమైన అంశాలు పరిశీలిస్తే.. ప్రతి కార్మికునికి 12 అంకెలు గల యూనివర్సల్ ఐడెంటిఫికేషన్ నెంబర్ (యూఏఎన్)తో ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇస్తాము. ఈ కార్డు ఉంటేనే ప్రభుత్వం అందించే అన్ని రకాల సామాజిక భద్రత, పథకాలు, వివిధ సంక్షేమాలకు అర్హులుగా పరిగణించబడుతారు. ఈ పోర్డల్‌లో నమోదు చేసుకున్న ప్రతి కార్మికునికి ఒక ఏడాది పాటు ప్రధాన మంత్రి సురక్షబీమా యోజన (పీఎమ్ఎస్‌బీవై) కింద రూ.2లక్షలు బీమా మొత్తాన్ని ఏదైనా ప్రమాదంలో మరణం లేదా అంగవైకల్యం సంభవించినా అందిస్తాం. ఈ -శ్రమ్ డేటా బేస్ ఆధారంగానే ప్రభుత్వం అమలు చేసే పథకాలు, విధానాలను కార్మికులకు వర్తిస్తాయి.

కొత్త లేబర్‌కోడ్‌లతో లేబర్‌ఫ్యామిలీలో చీకటి రోజులు..

- వారంతపు సెలువలకు చెల్లుచీటి.. అదనపు పనికి వేతనం కరువు
- యజమాన్యాలకు ఫిక్స్ టర్మ్ కాంట్రాక్టు కింద నిర్ధాక్షిణంగా తొలగించే హక్కు
- అవసరమైతే 8గంటల నుంచి 12గంటలూ పని చేయించుకునే అవకాశం
- ఎక్కడా అమలుకునోచని మహిళలకు సమానవేతం అంశం
- పాత చట్టాల్లోని హక్కులను కాలరస్తూ కొత్తచట్టాలకు రూపకల్పన

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

భారత ప్రభుత్వం జులై 01, 2022నుంచి కొత్త కార్మిక చట్టాలను అమలు చేస్తోంది. కార్మికుల కోసం కేటాయించిన మొత్తం 29 చట్టాలను కలిపి నాలుగు కోడ్‌లుగా మార్చింది. ఇందులో నాలుగు చట్టాలను వేతన కోడ్, 9 చట్టాలను సోషల్ సెక్యూరిటీ కోడ్, 13 చట్టాలను ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్, వర్కింగ్ కండిషన్స్ కోడ్, మరో 3 చట్టాలను ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్‌లుగా రూపొందించింది. ఈ కోడ్ ప్రయోజనాలు సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులందరికీ అందుతాయని ప్రభుత్వం చెబుతుండగా, వీటి వల్ల కార్మికులకు, ఉద్యోగులకు వాటిల్లే నష్టం ఎక్కువని కార్మిక సంఘాలు చెబుతున్న నేపథ్యంలో అసలు కొత్త చట్టాలు చెబుతున్న అంశాలను పరిశీలిద్దాం...

- కొత్త కార్మిక చట్టాల్లో ఉద్యోగుల పని గంటల్లో కూడా మార్పులు వచ్చాయి. ప్రస్తుతం చాలా సంస్థల్లో 8-9 పని గంటలు ఉండగా అవి 12 గంటల వరకు పెంచేశారు. ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్, వర్కింగ్ కండీషన్స్ కోడ్ లోని సెక్షన్ 25 (1) ఉద్యోగులు రోజుకు 8 గంటలు మించి పని చేయకూడదని పేర్కొంది. కానీ, 25(1) (బి) సంస్థలు ఉద్యోగులతో 12 గంటల వరకు ఉద్యోగులతో పని చేయించుకోవచ్చని చెబుతోంది.

- సంస్థ యజమానులు ఎటువంటి నిబంధనలూ లేకుండా పని గంటలను 12 గంటలకు మించి పెంచే విస్తత అధికారాలను ఇచ్చినట్టయింది. సెక్షన్ 26(1) ప్రకారం ఉద్యోగులు వారంలో ఆరు రోజులను మించి పని చేయకూడదు. కానీ, సెక్షన్ 26(2) ఈ నిబంధనను సడలించే అధికారాన్ని ప్రభుత్వానికి ఇస్తోంది.

- వారాంతపు సెలవులు లభించని పక్షంలో ఆ ఉద్యోగికి రెండు నెలల లోపు అందుకు పరిహారంగా సెలవులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ అది ఎక్కడా అమలు కావడం లేదు.

- గతంలో నెలకు 50 గంటలు ఉండే ఓవర్ టైం (అదనపు పని గంటలు) కొత్త నిబంధనలు అమలులోకి వస్తే 125 గంటల వరకు పెరిగింది. ఇక్కడ ఓవర్ టైం పని





చేసేందుకు ఉద్యోగి అనుమతి కూడా అవసరం లేదు. కొత్త కోడ్‌లో ఓవర్ టైం ఎన్ని గంటలు చేయించుకోవచ్చనే విషయం పై ఎటువంటి నిబంధనలూ లేవు. అదీగాకుండా ఉద్యోగులతో అదనపు గంటలు పని చేయించుకునేందుకు సంస్థల యజమానులకు పూర్తి హక్కులను ఇస్తోంది. కనీసం ఓవర్ టైంకు చెల్లించాల్సిన వేతనాల గురించి కూడా ఈ కోడ్ నిర్వచించలేదు.

- కొత్త చట్టాలు మహిళలకు అన్ని రంగాల్లోనూ పని చేసే హక్కును కల్పిస్తున్నాయి. వారి అంగీకారంతో నైట్ షిఫ్ట్‌లలో కూడా పని చేయించుకోవచ్చు. అయితే, అందుకు తగిన భద్రత, పని ప్రదేశాల్లో సౌకర్యాలను సంస్థల యజమానులు కల్పించాల్సి ఉంటుంది. ఈ మార్పులన్నీ పెట్టుబడిదారీ వర్గాల ప్రయోజనాలు, కార్పొరేట్ల ఆదాయం పెంచుకోవడం కోసమే అని కార్మికసంఘాలు మండిపడుతున్నాయి.

- ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్ సెక్షన్ 2 ఫిక్స్ టర్మ్ (నిర్ణీత కాల పరిమితి) ఉద్యోగాన్ని చట్టబద్ధం చేస్తుంది. సంస్థలు ఫిక్స్ టర్మ్ కాంట్రాక్టు కింద ఉద్యోగులను నియమించుకోవచ్చు. ఈ పరిమితి పూర్తవ్వగానే, ఉద్యోగులకు ఎటువంటి నోటీసూ, పరిహారం ఇవ్వకుండా ఉద్యోగంలోంచి తొలగించవచ్చు. అయితే, వీరికి కూడా పర్మినెంట్‌ఉద్యోగుల మాదిరిగానే, ఒక సంవత్సరం పాటు విధులు నిర్వహిస్తే గ్రాట్యుటీకి అర్హత సంపాదిస్తారు. కాంట్రాక్టును 11 నెలలకే ఇస్తే, గ్రాట్యుటీ పొందేందుకు అర్హత ఉండదు. సంస్థల యజమానులు ఈ విధానాన్ని తమ ప్రయోజనానికి వాడుకుంటున్నాయి.

- సర్వీస్ రంగంలో ఉన్న ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ హూమ్ చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 'ఈ చట్టాల అమలు కోసం ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం ప్రత్యేక లేబర్ చట్టాలను ఏర్పర్చుకోవడం కూడా ప్రధాన అడ్డంకిగా మారొచ్చు. కంపెనీలు రాష్ట్రాల పరిధిలోని షాప్స్ అండ్ కమర్షియల్ ఎస్టాబ్లిష్మెంట్స్ యాక్ట్ కింద రిజిస్టర్ చేసుకుంటే వాళ్లకు ఆ రాష్ట్ర సంబంధ చట్టాలు వర్తిస్తాయి. కంపెనీస్ యాక్ట్ కింద రిజిస్టర్ చేసుకున్న కంపెనీల్లోని ఉద్యోగులు రోజుకు 9 గంటలకు మించి పనిచేయడానికి వీల్లేదు'. అయినప్పటికీ 12గంటలు పని చేయించుకుంటున్న సంస్థలూ ఉన్నాయి.

-ఎనిమిది గంటల పని, ఎనిమిది గంటల నిద్ర, ఎనిమిది గంటల సామాజిక జీవనం' అనే విధానం గందరగోళంలో పడిపోయింది. ఇప్పుడు ఉద్యోగుల్లో అత్యధికులకు పని ప్రదేశానికి వెళ్లి వచ్చేందుకే కనీసం నాలుగు గంటలు పడుతోందని, ఇలా పనిగంటలు 12కు పెరిగాయని చెప్పారు. గహవసతి, ఆరోగ్యం, విద్య విషయాల్లో సామాజిక భద్రత కొరవడటంతో ఉద్యోగమనేది వెట్టిచాకిరీగా మారిపోయింది.

నవతెలంగాణ

ఈపీఎఫ్ ఓ భరోసా



- ఉద్యోగంలో ఉన్నప్పుడూ బీమా సౌకర్యాలు
- ఉద్యోగవిరమణ తరువాత భవిష్యనిధితో ఎన్నో ప్రయోజనాలు
- బ్యాంకులతో పోల్చితే ఈపీఎఫ్‌లోనే అధిక వడ్డీ
- అత్యవసరంపేరుతో అనవసరంగా విత్‌డ్రా చేసుకోవద్దు
- పీఎఫ్‌సభ్యుడు మరణిస్తే గరిష్టంగా రూ.7లక్షలవరకు బీమా
- అతనిపై ఆధారపడ్డ కుటుంబానికి జీవితకాలం పెన్షన్
- పిల్లలతే 25ఏండ్ల వయసువరకు.. అంగవైకల్యం ఉంటే జీవికాలమూ సాయం
- ఈపీఎఫ్ఓ రీజినల్ పీఎఫ్ కమిషనర్-2 ఎస్.తానయ్య

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఆయా సంస్థలు, పరిశ్రమల్లో పని చేసే ఉద్యోగులు, కార్మికులకు ప్రభుత్వం కల్పిస్తున్న ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) ఒక భరోసాగా నిలుస్తోంది. ఉద్యోగి, యజమాని కలిపి జమ చేసే పీఎఫ్‌లో కొంత పెన్షన్ కంట్రిబ్యూషన్ కింద పోగా మిగిలిన మొత్తం పీఎఫ్ ఖాతాలో జమవుతోంది. దీనిపై బ్యాంకుల కంటే అధికంగా వడ్డీ కల్పిస్తుండటంతో ఉద్యోగ విరమణానంతరం ఖాతాలో లభించే పెద్దమొత్తం ఎన్నో అవసరాలకు ఉపయోగపడు తోంది. ఈపీఎఫ్ అందించే పెన్షన్‌నూ భరోసాగా నిలుస్తోంది. ఈపీఎఫ్ ఫెన్షన్‌పరిమితిలో, ఖాతాలో జమ చేసే మొత్తం, జీతం పరిమితులను కొంత సడలించిన సంస్థ ఉద్యోగంలో ఉన్నప్పుడే అత్యవసరాల కోసం విత్‌డ్రా చేసుకునే అవకాశాలూ కల్పిస్తోంది. పీఎఫ్‌సభ్యుడు మరణిస్తే ఆయనపై ఆధారపడ్డ వారికీ బీమా సొమ్ము అందించడంతోపాటు కుటుంబసభ్యులకు జీవితకాల పెన్షన్ అందిస్తోంది. నేడు కార్మికుల దినోత్సవం 'మే డే' సందర్భంగా తీసుకొచ్చిన ప్రత్యేక సంచిక కోసం 'నవతెలంగాణ'కు ఈపీఎఫ్ఓ రీజినల్ పీఎఫ్‌కమిషనర్ ఎస్.తానయ్య ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ విశేషాలివి...

నవతెలంగాణ : ప్రస్తుతం పెన్షన్ విధానం తీరు ఎలా ఉంది.?

రీజినల్ పీఎఫ్ కమిషనర్ : వాస్తవానికి ఈపీఎఫ్ చట్టం 1952 ప్రకారం పెన్షన్ ఇచ్చే స్కీము ఏదీ లేదు. చట్ట సవరణల తర్వాత 1995 నుంచి ఈపీఎఫ్ఓ నేతత్వంలో ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ అమల్లోకి వచ్చింది. దీని కింద ప్రావిడెంట్ ఫండ్ (పిఎఫ్) కోసం యాజమాన్యాలు జమచేసే డిపాజిట్‌లో 8.33 శాతం పెన్షన్ నిధికి మళ్లిస్తున్నారు. ఉద్యోగి వేతనం (బేసిక్‌ం డీఏ)లో 12 శాతం చొప్పున ఉద్యోగులు, యాజమాన్యాలు ఈపీఎఫ్‌కు చెల్లిస్తుండగా, ఉద్యోగి వాటా మొత్తం అంతా పీఎఫ్ ఖాతాలోకి వెళుతుంది. యాజమాని చెల్లించిన 12 శాతంలో 3.67 శాతం ఈపీఎఫ్‌కు, 8.33 శాతం ఈపీఎస్‌కు మళ్లిస్తున్నారు. దీనికి తోడు ఉద్యోగి పెన్షన్ కోసం కేంద్ర ప్రభుత్వం 1.16 శాతం ఇస్తుంది. ఈపీఎస్ ప్రవేశపెట్టినపుడు గరిష్ఠ పెన్షన్‌బుల్ వేతనాన్ని నెలకు రూ. 5వేలుగా నిర్దేశించారు. తర్వాత దానిని రూ.6,500కు పెంచారు. 2014 సెప్టెంబర్ 1 నుంచి దీనిని రూ. 15,000 చేశారు. అంటే ఈ వేతనంపై పెన్షన్ నిధికి వెళ్లేది రూ.1,250 (8.33 శాతం). పెన్షన్‌బుల్ వేతనాన్ని మించి వాస్తవ బేసిక్ వేతనంపై ఈపీఎఫ్‌కు చెల్లించే ఆప్షన్‌ను ఉద్యోగి, యాజమాని కలిపి తీసుకునే సౌలభ్యం ఉంది.

నవతెలంగాణ : ఇప్పుడు పెన్షన్ ఎవరికొస్తున్నది? 2014లో జరిగిన సవరణలేంటి?

రీజినల్ పీఎఫ్ కమిషనర్ : కనీసం పదేండ్ల సర్వీసు ఉండి, 58 ఏండ్ల వయస్సు తర్వాత ఈపీఎస్ ఉద్యోగులకు సంస్థ పెన్షన్ ఇస్తున్నది. 50-57 సంవత్సరాల మధ్య ఉద్యోగాన్ని వదిలిపెట్టినవారు ముందు నుంచే పెన్షన్ కోరవచ్చు. కానీ అది తక్కువ ఉంటుంది. నెలవారీ పెన్షన్ లెక్కించే ఫార్ములా చూస్తే నెలవారీ పెన్షన్‌బుల్ సేలరీ, పెన్షన్‌బుల్ సర్వీసు 2014 సవరణల ప్రకారం ఉద్యోగం నుంచి వైదొలిగేముందు 60 నెలల సగటు వేతనాన్ని పెన్షన్‌బుల్‌గా లెక్కిస్తారు. పెన్షన్‌బుల్ వేతన పరిమితిని రూ.6,500 నుంచి రూ. 15,000కు పెంచడంతో పాటు.. ఈ పరిమితికి మించి కూడా యాజమాన్యాలతో కలిసి ఉద్యోగులు వారి వాస్తవ వేతనాల్లో 8.33 శాతాన్ని ఈపీఎస్‌కు చెల్లించడాన్ని అనుమతించారు. ఈ సవరించిన స్కీమ్‌కు ఆప్ట్ చేసుకునేందుకు 2014 సెప్టెంబర్ 1న ఈపీఎస్ సభ్యులందరికీ ఆరు నెలల గడువు ఇచ్చారు. ప్రాంతీయ ప్రావిడెంట్ కమిషనర్ మరో 6 నెలల గడువును పొడిగించేందుకు అనుమతించారు. వాస్తవ జీతంపై పెన్షన్ కోసం ఆప్ట్ చేసుకునే సభ్యులు పెన్షన్ ఫండ్‌కు అదనంగా వారి జీతం నుంచి 1.16 శాతం చెల్లించాలని నిర్దేశించారు. గడువులోపు వాస్తవ జీతంపై పెన్షన్‌ను ఆప్ట్ చేయనివారికి అప్పటికే పెన్షన్ ఫండ్‌కు అదనంగా చెల్లించిన మొత్తాన్ని ప్రావిడెంట్ ఫండ్ ఖాతాకు బదిలీ చేశారు.

నవతెలంగాణ : అధిక పెన్షన్ కోసం డిపాజిట్ చేయాలా?

రీజినల్ పీఎఫ్ కమిషనర్ : ఉద్యోగి ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలో అధికంగా జమచేసి ఉన్న/బదిలీ చేసిన మొత్తాన్ని పెన్షన్ ఖాతాలోకి మళ్లిస్తారు. ఉద్యోగి ఇంతకు ముందే పీఎఫ్‌ను విత్‌డ్రా చేసుకుని, అధిక పెన్షన్‌కు ఆప్ట్ చేస్తే, నిర్దేశిత మొత్తాన్ని పెన్షన్ ఖాతాలో డిపాజిట్ చేయమంటూ ఉద్యోగిని ఈపీఎఫ్ఓ కోరుతుంది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

నవతెలంగాణ: ఈపీఎఫ్ చట్టంలో పేరా 26(6) అంటే?

రీజినల్ పీఎఫ్ కమిషనర్ : సభ్యుడు చట్టబద్ధ పరిమితికంటే ఈపీఎఫ్‌కు ఎక్కువ చెల్లించే ప్రొవిజన్‌ను ఈ పేరా కల్పిస్తుంది. ఇందుకోసం సభ్యుడు, యజమాన్యం ఉమ్మడిగా రాతపూర్వకంగా దరఖాస్తు సమర్పించాలి. దీనిని ఏపీఎఫ్‌సీ ర్యాంక్‌కు తక్కువకాని అధికారి ఆమోదించాలి. ఇందులో పేరా (26)6 కింద చట్టబద్ధ పరిమితిని మించిన వాస్తవ జీతంపై ఈపీఎఫ్‌కు చెల్లింపులు చేస్తున్న తేదీని ప్రస్తావిస్తూ అధిక పెన్షన్ కోసం ఆప్ట్ చేయవచ్చు.

నవతెలంగాణ : ఇంతకూ ఎవరు ఇప్పుడు అధిక పెన్షన్‌కు ఆప్ట్ చేయవచ్చు?

రీజినల్ పీఎఫ్ కమిషనర్ : 2014 సెప్టెంబర్ 1కి ముందు సర్వీసు నుంచి వైదొలిగి, ఉద్యోగంలో ఉన్నపుడు అధిక పెన్షన్‌కు ఆప్ట్ చేసి, ఈపీఎఫ్‌వో ద్వారా తిరస్కరణకు గురైన వారు అర్హులుగా పరిగణిస్తాం. 2014 సెప్టెంబర్ 1న లేదా ఆ తర్వాత సర్వీసులో ఉండి, వాస్తవ జీతంపై ఈపీఎఫ్‌కు చెల్లింపులు జరుపుతూ, అధిక పెన్షన్‌కు ఆప్ట్ చేయనివారు చేసుకోవచ్చు. ఎటువంటి ఆప్షన్ ఎంపికచేయకుండా 2014 సెప్టెంబర్ 1కి ముందు సర్వీసు నుంచి వైదొలిగినవారు, చట్టబద్ధ వేతన పరిమితిపైనే ఈపీఎఫ్‌కు చెల్లింపులు చేస్తున్న వారు, 2014 సెప్టెంబర్ 1 తర్వాత సర్వీసులో చేరినవారు ఈ అధిక పెన్షన్ ఆప్షన్ ఎంచుకునేందుకు వీలు లేదు.

నవతెలంగాణ: పెన్షన్ ఎంతకాలం వస్తుంది?

రీజినల్ పీఎఫ్ కమిషనర్ : 10సంవత్సరాల సర్వీసు కలిగి 58 ఏండ్లు నిండిన ప్రతి కార్మికుడి నెలవారీ పింఛన్ రూ.వెయ్యికి తగ్గకుండా పొందవచ్చు. ఇలా ఈపీఎఫ్‌వో సభ్యుడి జీవితాంతం పెన్షన్ అందుతుంది. మరణాంతరం ఉద్యోగిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు వస్తుంది. ఇందులో భార్య/భర్త/పిల్లలు/ తల్లిదండ్రులు మాత్రమే అర్హులుగా ఉంటారు. ఇందులో పిల్లలకు 25ఏండ్లు వచ్చే వరకు అర్హులు. అంగవైకల్యం ఉన్న పిల్లలైతే జీవితాంతం పింఛన్ పొందవచ్చు. బీమా విషయానికొస్తే పని చేస్తూ చనిపోయిన వారి కుటుంబసభ్యులకు రూ.2.50లక్షల నుంచి రూ.7లక్షల వరకు బీమా వర్తిస్తుంది. కార్మికుడు ఇందుకు ఎటువంటి రుసుము కట్టాల్సిన పని లేదు.

నవతెలంగాణ : పీఎఫ్ విత్‌డ్రాకు అవకాశలేంటి?

రీజినల్ పీఎఫ్ కమిషనర్ : కార్మికులు తమ అత్యవసరాలైన పెండ్లి, పిల్లల ఉన్నత విద్య, భూమి లేదా ఇంటి కొనుగోలు, గృహనిర్మాణం, ఇంటి పునరుద్ధరణ వంటి అవసరాల కోసం ఐదేండ్లు సర్వీసు కలిగిన వారికి పీఎఫ్ నుంచి కొంత సొమ్మును ఉపసంహరణ చేసుకునే అవకాశం ఉంది. మెడికల్ ఎమర్జెన్సీకి అయితే ఎప్పుడైనా డబ్బులు తీసుకునే అవకాశం ఉంది. కార్మికులు గత కొవిడ్-19 తరువాత తమ ఖాతా నుంచి ఎక్కువగా రుణాలు, అడ్వాన్సులు పీఎఫ్ నుంచి విత్‌డ్రా చేసుకుంటున్నారు. దీని వల్ల తమ ఖాతాలో పీఎఫ్ తగ్గిపోవడం వల్ల ఇన్సూరెన్స్ రూ.7లక్షలు కోల్పోయే అవకాశం ఉంది. అత్యవసరాల కోసం పీఎఫ్ డబ్బులు విత్‌డ్రా చేసుకోకపోవడమే ఉత్తమం.

నవతెలంగాణ: ఈపీఎఫ్ ప్రయోజనాలపై అవగాహన ఎలా కల్పిస్తున్నారు?

రీజినల్ పీఎఫ్ కమిషనర్ : కార్మికుని అవగాహన కోసం భవిష్య నిధి సంస్థ ప్రతి నెలా 10వ తేదీన పింఛన్ అధాలత్ నిర్వహిస్తోంది. ప్రతి నెలా 27వ తేదీన 'నిధి ఆప్కే నికత్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో ప్రత్యేక విషయాలపై రోజంతా యజమానులకు, కార్మికులకు అవగాహన కల్పిస్తున్నాం. ఆన్‌లైన్ వెబినార్, సెమినార్లు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పీఎఫ్ చట్టం, పథకంలో ప్రయోజనాలను ఆన్‌లైన్ ద్వారా సంస్థ వెబ్‌సైట్‌లో పొందుపరిచాం. ప్రతి కార్మికుడు వాటిని చూడవచ్చు. ప్రింట్ కూడా తీసుకోవచ్చు.

శ్రమ నైజం మారిందా ?

ఎరుపు పేరింటే అదరి పడేటోళ్ళు
కార్మికుడు మారాడంటున్నారు
యూనిఫాం విడిచాడంటున్నారు
తెల్ల చొక్కాలో తడిచాడంటున్నారు
రూపంలో మార్పులు చూపుతూ
తన వర్గమే మారాడంటున్నారు
మార్క్సిజం మాసిందంటున్నారు

కష్టజీవులు సంపద పెంచడం తగ్గిందా?
జీతభత్యాల జమలో వాటా ధనం దక్కిందా?
ఉన్నా లేని జనాల అసమానతలు మాసాయా?
పెట్టుబడి ఫిరంగులు కురంగులయ్యాయా?

ఏది మారింది కనుక ఎరుపు మెరుపు మాసింది?
పిల్లి ఢీలా పడితే ఎలుక ఎకసెక్కాలాడినట్టు
చట్ట సభల సీట్లతో కొలిచి ఎరుపు ఘాటేదంటూ
కష్టజీవుల వాటాకు కొర్రీలు పెడితే పెట్టచ్చు
అలా పడినప్పుడు ఉబికే కంటి తడి తుడిచేదెవరు?
ఎకసెక్కాలకేం ఎన్నైనా ఆడొచ్చు
ఎర్ర జెండా అయి నిలిస్తే నిజం లోతు కనిపిస్తుంది
జనానికి దాని అవసరం తెలుస్తుంది ... ఏదీ లేని..
గాలి పడవలు వాటం తప్ప గమ్యం ఎరుగవుగా?

జీతాల కోతలతో శ్రమ వాటా గుంజేయడం
పనిలేని జీవులు ఆకలి, ఆత్మహత్యల
కాష్టంలో కమిలి కాలి బూడిదవడం
వాళ్ళ వాటా సంపదతో 'కార్పొ'ల ఆస్తులు పెంచుకోవడం
దాన్ని 'సొంత ఆస్తి' లెక్కలతో చుక్కల్లో నిలవడం
ఉన్న లేని జనాల వర్గ స్వరూపమేగా
కడుపు కాలిన నాడు వాటాల సమ పంపకానికి
వీధుల్లో కలబడటం వర్గ పోరాటమేగా
కళ్ళ ముందు కణిక నిప్పులు మండుతుండగా
నిర్వచనాలు మార్చి కళ్ళకు గంతలు తగిలించుకునే
గాంధారి పాతివ్రత్యపు గొప్పల గప్పాలు అవసరమా?


- ఉన్నం వెంకటేశ్వర్లు



నవతెలంగాణ




































అసంఘటింత కార్మికులకు ఆర్థిక భద్రత 'ఈ శ్రమ్' కార్డు

నవతెలంగాణ-పెద్దపల్లి: ఈ-శ్రమ్ కార్డు పొందిన కూలీలు దేశంలో ఎక్కడైనా ఉపాధి పొందడం సులభం అవుతుంది. డేటాబేస్‌లో వారికి సంబంధించిన డేటా వల్ల వారు పనిని సులభంగా పొందుతారు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదైన కార్మికుడికి రూ.2 లక్షల ప్రమాద బీమా కవరేజీ ఉంటుంది. పోర్టల్‌లో నమోదైన కార్మికుడు ప్రమాదానికి గురైతే, మరణం లేదా పూర్తి అంగవైకల్యం సంభవించినప్పుడు రూ.2 లక్షల మొత్తం ఇస్తారు. అదే సమయంలో కార్మికుడు పాక్షికంగా అంగవైకల్యం కలిగి ఉంటే ఈ బీమా పథకం కింద లక్ష రూపాయలకు అర్హులు.

ఈ కార్డు సహాయంతో అసంఘటిత రంగ కార్మికులకు ప్రధాన మంత్రి శ్రమ యోగి మాన్ ధన్ యోజన, స్వయం ఉపాధి కోసం జాతీయ పెన్షన్ పథకం, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రజా పంపిణీ వ్యవస్థ, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, జాతీయ ప్రభుత్వ పథకాలైన సామాజిక సహాయ పథకం, ఆయుష్మాన్ భారత్, నేత కార్మికులకు ఆరోగ్య పథకం, ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన, ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం వంటి వాటి ద్వారా ప్రయోజనం పొందుతారు.



నమోదు ప్రక్రియ, షరతులు ఏమిటి?


అసంఘటిత రంగంలో పనిచేసే 16 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల ఎవరైనా ఈ కార్డు కోసం నమోదు చేసుకోవచ్చు. వర్కర్ స్వయంగా లేదా ఈ-శ్రమ్ పోర్టల్ https://eshram.gov.in ద్వారా కామన్ సర్వీస్ సెంటర్ (జూజ) ని సందర్శించడం ద్వారా నమోదు చేసుకోవచ్చు. నమోదు పూర్తిగా ఉచితం. కార్మికులు పోర్టల్ లేదా కామన్ సర్వీస్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్ కోసం ఎటువంటి చెల్లింపులు చేయనవసరం లేదు.

కార్మికుడు ఈ-శ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ నంబర్, ఆధార్ లింక్ చేసిన మొబైల్ నంబర్. బ్యాంక్ ఖాతా అవసరం. ఒక కార్మికుడికి ఆధార్‌తో లింక్ చేయబడిన మొబైల్ నంబర్ లేకపోతే, అతను/ ఆమె సమీపంలోని (జూజ) ని సందర్శించి బయోమెట్రిక్ ప్రమాణీకరణ ద్వారా నమోదు చేసుకోవచ్చు.

















కార్మికునిపై కేంద్రం గొడ్డలిపెట్టు..

- కార్పొరేట్ల కోసం కార్మికచట్టాలను సరళించిన బీజేపీ సర్కార్
- ప్రాణత్యాగకోర్చి సాధించుకున్న హక్కులను కాలరాసిన వైనం
- 44 కార్మికచట్టాలకు చెల్లుచీటి ఇచ్చి.. 4కోడ్‌లుగా మార్చిన వైనం
- కార్మికుని బానిసలా మార్చేలా 8గంటల పనిదినాన్ని 12గంటలకు పెంపు
- సమ్మె చేసే హక్కులేదు.. యూనిట్లు పెట్టుకునే అనుమతుల్లేవ్!
- ప్రమాదం జరిగితే కార్మికుడిదే బాధ్యత.. అవసరమైతే జరిమానా, జైలు శిక్షనే!
- బ్రిటీష్‌కాలం నాటి అమానవీయ విధానాలు, బానిసచట్టాలు తెచ్చిన కేంద్రం

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

పెరుగుతున్న కార్పొరేటీకరణ, విదేశీ సంస్థల ఉద్యోగాలు, పెట్టుబడుల నేపథ్యంలో సరళమైన కార్మిక చట్టాలను తీసుకొస్తున్నామని కేంద్రంలోని బీజేపీ సర్కారు 44 లేబర్‌చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చిన తీరు కార్మికుల హక్కులపై గొడ్డలిపెట్టుగా మారింది. బ్రిటీష్‌కాలం నాటి అమానవీయ విధానాలు, బానిసచట్టాలకు రూపం తెచ్చి కార్మికుని శ్రమను దోచుకునేలా కార్పొరేట్లకు రెడ్‌కార్పెట్ వేసింది. 01 జులై 2022నుంచి కొత్త కార్మిక చట్టాలను తీసుకొచ్చి మళ్లీ నేషనల్, కార్పొరేట్ సంస్థకు ఊరట లభించేదిగా చేసి కార్మికుడిని బానిసలా మార్చింది. 8గంటల పనిదినాలను 12గంటలకు పెంచడంతో మూడు షిఫ్టుల్లో నడిచే పరిశ్రమలు రెండు షిఫ్టులకే కుదించాయి. ఒక షిఫ్టు కార్మికు ఉపాధి పోవడమేకాకుండా ఉన్న వారి శ్రమ దోపిడికి గురవుతోంది. ఇదేంటని ప్రశ్నించేందుకు యూనియన్లు పెట్టుకునే హక్కును కాలరాసింది. సమ్మెచేసే హక్కును తొక్కిపెట్టింది. ఇదంతా ఒకెత్తయితే పరిశ్రమలో ప్రమాదం జరిగితే అందుకు కార్మికుడినే బాధ్యుని చేసేలా తీసుకొచ్చిన కొత్త చట్టాలు అవసరమైతే ప్రమాదానికి కారణమైన లేబర్‌కు జైలు శిక్ష, జరిమానా విధించవచ్చని చెబుతుండటం గమనార్హం.

స్వాతంత్య్రానంతరం కార్మిక సంక్షేమమే ధ్యేయంగా రూపొందించుకొన్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తిరగరాసింది. బ్రిటీష్ కాలం నాటి అమానవీయ విధానాలను, బానిస చట్టాలను మళ్లీ తెర మీదకు తెచ్చింది. 44 కార్మిక చట్టాలను ఏకపక్షంగా రద్దుచేసి నాలుగు లేబర్‌కోడ్‌లు రూపొందించింది. వేతనాల కోడ్, సామాజిక భద్రత కోడ్, పారిశ్రామిక సంబంధాల కోడ్, భద్రత-ఆరోగ్యం- పని పరిస్థితులకు సంబంధించిన కోడ్ పేరుతో నాలుగు కోడ్‌లను రూపొందించిన మోదీ ప్రభుత్వం గెజిట్ విడుదలకు సమాయత్తమవుతున్నది. లేబర్ కోడ్‌ల ద్వారా కేంద్రం 44 హక్కులను కాలరాయనున్నదని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి.

కార్మికుల పాలిట శాపం పారిశ్రామిక సంబంధాల కోడ్

పారిశ్రామిక సంబంధాల కోడ్ కార్మిక హక్కులను కాలరాస్తోందని కార్మికసంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కార్మికుల డిమాండ్లపై సమ్మె నోటీసు ఇవ్వడానికి ఇప్పటివరకు ఉన్న 14 రోజుల వ్యవధిని కేంద్రం 60 రోజులకు పెంచింది. సమ్మెకు వ్యతిరేకంగా ట్రిబ్యునల్‌కు వెళ్లే అవకాశాన్ని యాజమాన్యాలకు కల్పించింది. దీంతో కేసు ట్రిబ్యునల్‌లో ఉన్నంత కాలం కార్మికులు సమ్మెకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది. గతంలో 10 కంటే ఎక్కువ మంది పనిచేసే సంస్థలను పరిశ్రమలుగా గుర్తించేవారు. ఇపుడు ఆ సంఖ్యను 20కి పెంచారు. విద్యుత్తు సంస్థల్లో 40కి పెంచారు. ఫలితంగా చిన్న పరిశ్రమల్లోని కార్మికులు చట్టపరంగా ఆరోగ్యం, భద్రత, సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. పాత చట్టం ప్రకారం యూనియన్లను యాజమాన్యం గుర్తించాలన్న నిబంధనలేదు. ఏ సంఘానికైనా కార్మికుల డిమాండ్లపై యాజమాన్యంతో సంప్రదింపులు జరిపే అవకాశం ఉండేది. కొత్త నిబంధనల ప్రకారం పరిశ్రమల్లోని కార్మికుల్లో 51 శాతం లేదా అంతకంటే



ఎక్కువ సభ్యత్వం ఉన్న సంఘాన్నే గుర్తింపు సంఘంగా పరిగణిస్తారు. ఇతర సంఘాలను యాజమాన్యాలు పట్టించుకోవు.

పరిశ్రమల్లో ప్రమాదాలకు కార్మికులదే బాధ్యత

భద్రత-ఆరోగ్యం- పని పరిస్థితులకు సంబంధించిన కోడ్‌లో ఫ్యాక్టరీల చట్టం, గనుల చట్టం, డాక్ వర్కర్, బిల్డింగ్, ఇతర నిర్మాణ కార్మికుల ఉపాధి, పని నియమాల క్రమబద్ధీకరణ, సినీ వర్కర్స్ అండ్ సినిమా థియేటర్స్ వర్కర్స్ యాక్టు తదితర వాటికి సంబంధించి మొత్తం 13 పాత చట్టాలను పొందుపరిచారు. పాతచట్టాల ప్రకారం కార్మికులకు తాము పనిచేస్తున్న పరిశ్రమల్లోని ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని పనిభద్రత, ఆరోగ్యం, సంక్షేమ పథకాలు అమలయ్యేవి. ఇప్పుడు చేస్తున్న పనితో సంబంధం లేకుండా అన్ని రంగాల కార్మికులకు ఒకే గూడు కిందకు తీసుకొచ్చారు. గత చట్టాల ప్రకారం పరిశ్రమలో ఏదైనా ప్రమాదం జరిగితే యాజమాన్యం బాధ్యత వహించాల్సి ఉంటుంది. కొత్త కోడ్ ప్రకారం ప్రమాదాలకు కార్మికులను కూడా బాధ్యులను చేస్తారు. ప్రమాదాలకు కార్మికుడు కారణమని నిర్ధారిస్తే రూ.10 వేల జరిమానా, జైలుశిక్ష విధిస్తారు.

సామాజిక భద్రత హుళక్కే

సామాజిక భద్రత కోడ్-2020లో పీఎఫ్, ఈఎస్ఐ, పరిహారం, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, మెటర్నిటీ బెనిఫిట్, గ్రా ట్యూటీ, వెల్ఫేర్, అసంఘటిత కార్మికులు తదితర అంశాలకు సంబంధించిన తొమ్మిది పాత చట్టాలను చేర్చారు. ఈ కోడ్ నిబంధనలు నిర్మాణరంగ కార్మికుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని కార్మిక సంఘాలు చెబుతున్నాయి.

12 గంటల పని.. ఓటీలు ఉండవు

బీజేపీకి ఉన్న సంఖ్యా బలంతో వేతనాల కోడ్‌కు 2019లో పార్లమెంటు ఆమోదం లభించింది. ఇందులో వేతనాల చెల్లింపు, కనీస వేతనం, బోనస్, సమాన వేతనాల చట్టం వంటి నాలుగు పాత చట్టాలను చేర్చారు. ఎన్నో పోరాటాలు, ప్రాణత్యాగాల ఫలితంగా వచ్చిన 8 గంటల పని విధానానికి మోదీ ప్రభుత్వం చెల్లుచీటి ఇచ్చింది. యాజమాన్యం కోరితే 10 నుంచి 12 గంటల పాటు పనిచేయాలని, అందుకు ఎలాంటి ఓటీ (ఓవర్ టైమ్) వేతనాలనూ చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పింది. దీంతో చాలా పరిశ్రమల్లో మూడు షిఫ్టుల విధానం కనుమరుగై రెండు షిఫ్టులే మిగులుతున్నాయి. ఒక షిఫ్ట్‌లో పనిచేసే కార్మికులకు ఉపాధి పోవడం ఖాయం.

పెట్టుబడుదారుల కోసం కార్మికుల హక్కుల కాలరాత

చికాగో త్యాగాలతో కార్మిక ఉద్యమం కనీస విలువలను చట్టబద్ధం చేసుకోగలిగింది. ఇట్లాంటి అనేక త్యాగాలతో ప్రపంచ కార్మిక ఉద్యమం తన కాళ్లపై తన నిలబడగలిగి మానవాళి విముక్తి కోసం తన శక్తిని ధారపోస్తూ వచ్చింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడ్డ సంక్షోభంతో కార్మిక శక్తి ఒత్తిడి మేరకు ప్రపంచ రాజ్యాలు సంక్షేమాన్ని తమ ప్రాధాన్యతగా ఎంచుకోవాల్సి వచ్చింది. ఫలితంగానే సంక్షేమ రాజ్య భావన బలపడి బలహీనుడికి బతకగలిగే అవకాశం కొద్ది మేరకైనా దక్కగలిగింది. యుఎస్ఎస్ఆర్ పతనం తర్వాత కార్మిక ఉద్యమాన్ని విధ్వంసం చేయగలిగే వాతావరణాన్ని ప్రపంచ పెట్టుబడిదారీ మార్కెట్ శక్తులు రూపొందించుకున్నాయి అంతకుముందే ప్రారంభమైన నూతన ఆర్థిక విధానాలు ఇందుకు దోహదం చేసేవి కూడా.

1977 నుంచి ప్రారంభమైన ఆర్థిక సంస్కరణలు రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ గారాడి పాలనలో పెట్టుబడిదారీ విధానం మరింత బలోపేతమై అంతిమంగా పెట్టుబడిని కూడా మింగే కార్పొరేట్ ఆర్థిక వ్యవస్థ దేశంలో పాదుకొల్పబడింది. ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా దేశంలో ఆటవిక నిర్వహణ రాకుండా ఉండేందుకు ఆర్థిక వ్యవస్థను ప్రజాసంక్షేమాన్ని సమన్వయం చేసుకునే అద్భుతమైన కార్మిక చట్టాల రూపకల్పన 1926 నుంచే(ట్రేడ్ యూనియన్‌లో ఏర్పాటు చట్టం) ప్రారంభమైంది. ఇది క్రమక్రమంగా కార్మిక సంక్షేమం విస్తృతి చెందింది.1200 సెక్షన్లతో 44 కార్మిక చట్టాలతో పెట్టుబడిని ప్రభుత్వాన్ని నియంత్రిస్తూ వచ్చింది. కానీ ఈ చట్టాలు ఆశిత పెట్టుబడి లేదా కార్పొరేట్ ఆర్థిక వ్యవస్థకు ప్రతికూలంగా ఉండడంతో కార్పొరేట్ శక్తులు మతసహచర్యాన్ని ఆశ్రయించాయి. తమకు అనుకూలమైన వ్యక్తిని ప్రధానిగా ప్రతిష్టింప చేసుకున్నాయి.

ఈ చట్టాలే కార్మికులను సంరక్షించుకున్నాయి వీటి రూపకల్పనలో మహనీయుడు అంబేద్కర్ విశేషమైన కృషి చేశారు. నేటి ప్రధాని మోదీ అదే అంబేద్కర్ కార్మిక ఆలోచనలను వక్రీకరించి తన వారికి దోచిపెట్టడానికి 44 కార్మిక చట్టాలను 29 చట్టాలకు కుదించి 12 చట్టాలను పూర్తిగా రద్దుచేసి నాలుగు కోడ్ లుగా విభజించారు. అంబేద్కర్ కలల సాధన కోసం, నూతన భారతదేశం కోసమని "రెడ్ టేపిజాన్ని" ఆపుతానని అనడమే కాక శ్రమ యోగి రాష్ట్ర యోగి అనే నూతన పేర్లతో కార్మికులకు పేరు పెట్టి నయవంచనకు గురి చేశాడు. ఇప్పటికే తన విధానాలతో 8 కోట్ల సంఘటిత కార్మిక శక్తిని 5 కోట్లకు కుదించేసినాడు. దీనితో 50 కోట్లకు అసంఘటిత కార్మికులు పెరిగిపోయినారు. భద్రత లేని కనీస బతుకుదెరువు లేని అసంఘటిత కార్మికులకు ఆరోగ్య భీమా లాంటి ఎరలు వేసి మొత్తం ఆర్థిక వ్యవస్థ ఫలాలను తన ఇద్దరు మిత్రులైన ఆదాని అంబానీలకు కట్టబెడుతున్నాడు. ఈ క్రమంలో మారిన కార్మిక చట్టాల నేపథ్యంలో దేశానికి తీవ్రమైన నష్టాన్ని ఈ పాలకులు కల్పించారు. పనిగంటలను పెంచడంతో కార్మికులకు మరింత ఒత్తిడి పెరిగి పెద్ద ఎత్తున మరణాలు సంభవిస్తున్నాయని కొన్ని దేశాల అనుభవాలు సాటి చెబుతున్నాయి. 2016 ఒక్క సంవత్సరంలోనే 7,60,000 మంది పని గంటల పెంపుదల కారణంతో అసహజంగా మరణించారని 'ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ' రిపోర్టులు చెబుతున్నాయి. అంతే మేరకు ఈ పని గంటలు ఉపయోగించుకున్న పారిశ్రామిక సంస్థలు కార్పొరేట్ సంస్థలు గా మారిపోయినాయి.

సమ్మె హక్కును జీవించే హక్కులో భాగంగా పొందిన కార్మికులు ఈ కొత్త చట్టాలతో కోల్పోతున్నారు.15 రోజుల ముందు ఇచ్చే సమ్మె నోటీసు కాస్త 60 రోజుల ముందుగా మారింది.ఏడుగురితో కూడా యూనియన్ ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని మార్చివేసి దేశ కార్మిక సంఘాల త్యాగాల చరిత్రను 1926 నాటికి తీసుకుపోయారు. యూనియన్ లో 1/3 బయటివారు ఉండడం వల్ల కార్మికులు యజమానులకు భయపడకుండా అన్యాయం జరిగినప్పుడు నిలదీసే అవకాశం ఉండేది. అది నేడు లేబర్ కోడ్‌ల రూపంలో తొలగించారు., యూనియన్‌కు కంపెనీ ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించుకునే అవకాశం గతంలో ఉండేది. ఆ కంపెనీ అక్రమ లాభాలు ఎక్కడ బయటపడతాయోనని ఈ పర్యవేక్షణ అవకాశాన్ని తొలగించారు. సమస్యను లేవదీసే హక్కును కూడా కోల్పోయారు. ఈ కొత్త చట్టాలతో మహిళా కార్మికులకు 12 నుంచి 26 వారాల ప్రసూతి సెలవు లాంటి ఒక చిన్న ఎరను వేసి రాత్రి వేళలో కూడా 12 గంటల నుంచి 16 గంటలుగా శ్రమ దోపిడిని పెంచుకుంటున్నారు. పని పరిస్థితులు, రుతుస్రావాలు మొదలగునవి కూడా కంపెనీ ఆలోచన చేతుల్లోకి వెళ్లిపోయాయి. లంచ్ రూమ్ క్యాంటీన్,రెస్ట్ రూమ్, డ్రింకింగ్ వాటర్, ఫీడింగ్ రూములు, ఇలాంటి కనీస సౌకర్యాలను ఈ చట్టాలు తీవ్రమైన ప్రభావితం చేయబోతున్నాయి. యజమాన్యాలు కనీసం కార్మికులను మనుషులుగా గుర్తించే పరిస్థితి కూడా లేకుండా పోయింది.

కార్మికుల తొలగింపుకు గతంలోని మార్గదర్శకాలు మారిపోయాయి. అతి చిన్న కారణమైనా,అసలు కారణంలేకుండా కూడా కార్మికులను తొలగించే అవకాశాలు నిరంతరంగా యాజమాన్యాలకు కల్పించాయి. తొలగించబడ్డ కార్మికులు న్యాయస్థానాలకు వెళ్లే అవకాశాన్ని కూడా ఈ కొత్త



చట్టాలు అడ్డుకుంటున్నాయి. యజమాని ఆధ్వర్యంలో రూపొందించబడ్డ మధ్య దళారీ వ్యవస్థ చేతుల్లోకి కార్మికుల తొలగింపు నిర్ణయం వెళ్ళబోతుంది. ఇలాంటి అత్యంత దారుణమైన, మానవ పరిణామ క్రమాన్ని వెనక్కి తిప్పిన మోదీ చట్టాలు రాజస్థాన్ లో ప్రయోగాత్మకంగా అమలై అభ్యుదయ పాలనలో ఉన్న తమిళనాడు రాష్ట్రం కూడా ఇటీవల కాలంలో అమలుకు సిద్ధపడ్డది. తెలంగాణ ఇంకా వేగంగా యజమానులకు సహకారం అందించే పద్ధతిలో కార్మికులకు వ్యతిరేకంగా అత్యుత్సాహాన్ని ప్రదర్శించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల ప్రయోజనం దృష్ట్యా కార్మిక చట్టాలను నిలిపివేయాలి. పౌర సమాజం కార్మికులు సంఘటితోద్యమం చేయడం ద్వారా సమ్మె హక్కును కోల్పోతే బానిసగా మారుతామనే అంబేద్కర్ అభిప్రాయంతో చికాగో పోరాటస్ఫూర్తిని ఎత్తు పట్టి ప్రతిఘాద శక్తులను అడ్డుకుందాం.

-పందుల సైదులు
9441661192

నాడు కళకళ.. నేడు వెలవెల

రెడీమేడ్ డపిల్ ప్రభావం..
మరింత ముంచిన కరోన
తిరోగమనంలో చొప్పదండి కర్ర వ్యాపారం
ఉపాధి కోల్పోయిన కార్మికులు



నవతెలంగాణ - చొప్పదండి: చొప్పదండి.. ఒకప్పుడు ప్రధాన రహదారి వెంబడి పక్కన అంతా కలప కుప్పలు కనిపించేవి.. నిరంతరం కట్టె మిషన్లపై కార్మికులు పనిచేసేవారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి ప్రజలు ఇక్కడినుంచి కలప తీసుకెళ్లేవారు. ఇదంతా గతం.. నాడు 21 కట్టెకోత మిషన్లతో కళకళలాడిన చొప్పదండి నేడు ఆదరణ లేక వెలవెలబోతుంది.

20ఏండ్ల క్రితం చొప్పదండిలో 21 కట్టే మిషన్లు ఉండి కర్ర వ్యాపారానికి ప్రసిద్ధి చెందింది. చొప్పదండి ప్రారంభం నుండి రెండు కిలోమీటర్ల మేర ఎక్కడ చూసినా కట్టె మిషన్లు, రోడ్డు వెంబడి కర్ర మొద్దులు ఉండేవి. ప్రజలు రెడీమేడ్ డపిల్ (పిబిసి) ప్లాస్టిక్ వైపు మొగ్గు చూపుతు భవన నిర్మానాలకు వినియోగిస్తున్నారు. వ్యాపారం బాగున్నప్పుడు వ్యాపారులు బల్లార్షా, ఆదిలాబాద్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం తదితర జిల్లాల నుండి టేకు, మద్ది, పెద్దెగి, ఇప్ప, నల్లగొడిసె, నారేప, దుంపిడి, జిట్రేగి, బీలుగా, తుమ్మ పలు రకాల కర్రను తీసుకువచ్చి వ్యాపారం చేసేవారు. జిట్రేగి కర్రకు ఎక్కువగా డిమాండ్ ఉండేది. దీంతో రకరకాల డిజైన్లు చేసేవారు. తరువాత టేకు, మద్ది కర్రకు డిమాండ్ పెరిగింది. ఒకప్పుడు మిషన వద్ద 6 నుండి 8 మంది లేబర్లు పనిచేసేవారు. ఇప్పుడు ఇద్దరి ముగ్గురితో నడిపిస్తున్నారు. ఇప్పుడు కట్టర్‌కు నెలకు రూ.25వేలు, హెల్పర్‌కు 15వేలు, మిగతా లేబర్ 13, 14వేలు వస్తున్నాయి. లీజుకు తీసుకున్న వారు వారే కట్టర్ ఒకరిద్దరితో నడిపించుకుంటున్నారు. మిషన్లలో ప్రస్తుతం టేకు, తుమ్మ, వేప కర్రను వాడుతున్నారు.

నేడు లాభాలు లేక నడవని కట్టే మిషన్లు

ఒకప్పుడు 21 కట్టే మిషన్లు లాభాల బాటలో నడిస్తే ఇప్పుడు చొప్పదండిలో ఆరుగురు ఓనర్లు మాత్రమే నడిపిస్తున్నారు, 13 మిషిన్లు లీజుకు నడుస్తున్నాయి. ప్రజలు ఎక్కువగా రెడీమేడ్ డపిల్ (పిబిసి) ప్లాస్టిక్ వైపు మొగ్గు చూపుతూ బిల్డింగ్ మెటీరియల్‌కు వినియోగిస్తున్నారు. దీనికి తోడు కరోనా ప్రభావం కట్టె మిషన్లపై పడింది. లేబర్లకు జీతాలు ఇవ్వడమే కష్టమవుతుందని వ్యాపారులు అంటున్నారు.

కరోనా నుంచి పూర్తిస్థాయిలో కట్టే మిషన్ల వ్యాపారం డౌన్ అయింది

రాజేంద్రప్రసాద్, గాయత్రి సామిల్ చొప్పదండి



కరోనా నుంచి పూర్తి స్థాయిలో కట్టె మిషన్ల వ్యాపారం డౌన్ అయింది. ప్రజలు కర్రకు బదులు డపిల్ (పిబీసీ) ప్లాస్టిక్‌ను వినియోగించుకుంటున్నారు. గతంలో ఉన్నట్లు లాభాలు లేక ఇబ్బందులు పడుతు న్నాం. నడవని పరిస్థితుల్లో మూడుకు పైగా మిషన్లు అమ్ముకున్నారు. మిషన్లు నడిపేందుకు ఇబ్బంది పడుతున్నాం.

కార్మికుల చట్టాలు అమచేసి హక్కులు కాపాడినప్పుడే నిజమైన మేడే..

పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్



నవతెలంగాణ - సిరిసిల్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పక్షాన నిలబడి కార్మికుల చట్టాలను పకడ్బందీగా అమలు చేసి కార్మికుల హక్కులను కాపాడినప్పుడే నిజమైన మేడే అని సీఐటీయూ అనుబంధ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ అన్నారు. కార్మిక దినోత్సవమైన మే డేను పురస్కరించుకొని నవతెలంగాణ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. కార్మిక హక్కుల పోరాట దినమే ప్రపంచ కార్మిక దినోత్సవం అని ప్రపంచ 137వ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మే డే సందర్భంగా పోరాట అమరవీరులకు ఘన నివాళులర్పిస్తూ మే డే రోజు సాయంత్రం నాలుగు గంటలకు సిరిసిల్ల కొత్త బస్టాండ్ నుండి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కార్మిక మహా ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్ర మంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కార్మిక వర్గం, ప్రజలు, కష్టజీవులు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మేడే అంటే కష్టజీవులు రక్తం ధారబోసిన రోజు అని అందుకే మే డే రోజున సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు బందు పిలుపునిచ్చామన్నారు. సిరిసిల్లలోని వస్త్ర పరిశ్రమలో పనిచేస్తున్న పవర్‌లూమ్ కార్మికులు, అనుబంధ రంగాలైన వార్పిన్, వైఫని, టెక్స్‌టైల్ పార్క్ కార్మికులు, జాఫర్లు, ఆసాములు, అనుబంధ రంగాల కార్మికులందరూ పాల్గొని పోరాటంలో నేల కొరిగిన అమరవీరులకు ఘన నివాళులర్పించాలని కోరారు.


పండుగలా మేడే వేడుకలు

సిరిసిల్ల జిల్లా సహాయ కార్మిక శాఖ అధికారి రఫీ



నవతెలంగాణ-సిరిసిల్ల: కష్టజీవుల రోజైన కార్మికుల దినోత్సవం మేడేను పండుగలా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు సిరిసిల్ల జిల్లా సహాయ కార్మిక శాఖ అధికారి రఫీ తెలిపారు. మేడేను పురస్కరించుకొని నవతెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. జాతీయ కార్మిక దినోత్సవాన్ని ఈసారి మూడు రోజుల ఉత్సవంలా జరపడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మిక శాఖ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర కార్మిక శాఖ ఆదేశాల మేరకు పండగలా జరపడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా మే రెండన కార్మిక జాతీయ సమ్మేళనం నిర్వహించబోతున్నాం. సిరిసిల్ల అనగానే చేనేత కార్మికులు, మరమగ్గాల కార్మికులు ముందుగా గుర్తొస్తారు. వారితో పాటు మిగతా రంగాల్లో ఉన్న సంఘటిత, అసంఘటిత, భవన నిర్మాణ, వివిధ రంగాలలో ఉండే అన్ని రంగాల కార్మికులందరు ఈ సమ్మేళనంలో పాల్గొంటారు. అన్ని రంగాలలో పనిచేసే కార్మికులందరూ ఈ కార్మిక జాతీయ సమ్మేళనంలో పాల్గొనాలి. కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ఫలాలను లబ్దిదారులకు అందజేస్తాం. అలాగే కార్మిక చట్టాలపై ప్రజలకు, కార్మికులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. తద్వారా కార్మికులకు భవిష్యత్తులో కార్మిక రంగంపై పూర్తి విషయాలు తెలుస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక రంగాలలో పనిచేస్తున్న అందరిని దృష్టిలో పెట్టుకొని తంగళ్ళపల్లి మండలం మండపల్లి శివారులో గల డ్రైవింగ్ స్కూల్ పక్కన స్థలం కేటాయించింది. అక్కడే కార్మిక భవన్ ఏర్పాటుకు సన్నహాలు జరుగుతున్నాయి. ఈ మేడే ఉత్సవాల్లో రాష్ట్ర మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే తారకరామారావు పాల్గొనే అవకాశాలు ఉన్నాయి. అందులో భాగంగా కార్మిక భవన్ కు కూడా శంకుస్థాపన చేసే అవకాశం ఉంది. కార్మిక జాతీయ సమ్మేళనం కార్మిక దినోత్సవం సందర్భంగా రెండు రోజులుగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి, జిల్లాలోని చేనేత, జౌళి శాఖ అధికారి సాగర్, రవాణా శాఖ అధికారి కొండల్‌రావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పంచాక్షరి, పౌర సరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, పౌర సరఫరాల మేనేజర్ జితేంద్ర ప్రసాద్, అడిషనల్ డీఆర్డీఓ రవి కుమార్, తదితరులు పాల్గొని సమ్మేళనం విజయవంతం చేయడానికి అన్ని ప్రభుత్వ శాఖలు సహకరిస్తున్నాయి. కార్మిక లోకం పాల్గొని మేడే ఉత్సవాలను, కార్మిక జాతీయ సమ్మేళనం కార్యక్రమాలను విజయవంతం చేయాలి.

కార్మిక వర్గంపై దాడిని ఎదుర్కోవాలి



నవతెలంగాణ - జమ్మికుంట: గుంటి సామ్రాజ్యం, తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు తెలంగాణలో 10 లక్షల మంది హమాలీలు పనిచేస్తుండగా అందులో రెండు లక్షల మంది బీహార్ రాష్ట్రానికి చెందిన వారే ఉన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఒక చట్టం తీసుకురావాలి. కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్ పకడ్బందీగా అమలు చేయాలి. కార్మిక వర్గంపై దాడిని ఐక్యంగా ఎదుర్కొనేందుకు పోరాటాలకు సిద్ధం కావాలి.

కార్మికుల ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం

కొప్పల శంకర్, సీఐటీయూ కరీంనగర్ జిల్లా సహాయ కార్యదర్శి




నవతెలంగాణ - జమ్మికుంట: మే డే స్ఫూర్తితో కార్మిక వర్గం ఐక్య పోరాటం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయి. కనీస వేతన చట్టాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలి. ఉద్యోగ, సామాజిక భద్రతను కల్పించాలి. బిజెపి మోడీ ప్రభుత్వం 29 చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను హరించింది. ఈ చర్యలను ప్రతిఘటించాలి.

హక్కులను సాధించుకున్న రోజే మేడే..

సీఐటీయూ సిరిసిల్ల జిల్లా కార్యదర్శి కోడం రమణ



నవతెలంగాణ - సిరిసిల్ల: కార్మిక వర్గం ఎనలేని పోరాటం చేసి రక్తం చిందించి కొన్ని హక్కులను సాధించుకున్న రోజే మే డే అని సీఐటీయూ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి కోడం రమణ అన్నారు. కార్మిక దినోత్సవం మేడే పండుగను పురస్కరించుకొని నవ తెలంగాణ దినపత్రికతో మాట్లాడారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను పెట్టుబడిదారులకు కట్టుబానిసలు చేసే విధానాలను అవలంబిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో కార్మిక చట్టాల హక్కుల పరిరక్షణకు కార్మిక వర్గం, కష్టజీవులు అందరూ ఐక్యంగా ఉండి పోరాడాల్సిన అవసరం ఉంది. "మేడే" అమరవీరుల పోరాటస్ఫూర్తితో కార్మిక చట్టాల హక్కుల పరిరక్షణ కోసం, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌ల రద్దుకు ఉద్యమించాలి. 1986లో కార్మికుల హక్కుల పోరాటంతో మొదలై కార్మిక రాజ్యాల్ని సాధించుకున్న దేశాలలో తిరిగి సామ్రాజ్యవాదం పాగా వేసింది, వీరికి పాదసేవ చేసే ప్రపంచీకరణ విధానాలనే పాశుపదాస్త్రంగా చేసుకొని మోడీ ప్రభుత్వం ప్రజలపై ఉక్కుపాదం మోపుతోంది. దేశ, విదేశీ కార్పొరేట్ శక్తులతో కుమ్మక్కై పెరుగుతున్న ధరలు తగ్గుతున్న జీవన ప్రమాణాలతో నూటికి 90 శాతంగా ఉన్న అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు లభించడమే గగనం అయిపోతుంది. పని గంటల భారం మోస్తున్న వాళ్లలో వలస కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు చివరికి ఐటి ఉద్యోగులు సైతం ఉన్నారు. 100 మేడేల స్ఫూర్తితో పోరాడాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా హిందుత్వ ఫాసిస్టు పోకడలను ఓడించడంలో కూడా కార్మిక వర్గం కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది.



కార్మిక పక్షపాతిగా అంబేద్కర్ అడుగులు


▸ మొదటిపేజీ తరువాయి


ప్రావిన్సియల్ ఎన్నికల్లో ఐఎల్‌పీ 17 స్థానాల్లో పోటీచేసి, 14 చోట్ల విజయం సాధించింది. పోటీచేసిన 13 రిజర్వుడు స్థానాల్లో 11 చోట్ల, పోటీచేసిన నాలుగు జనరల్ సీట్లలో మూడు చోట్ల గెలిచింది. ఐఎల్‌పీ కార్మికులు, చిన్నరైతుల కోసం పెద్దయెత్తున అనేక పోరాటాలు చేసింది.


దేశంలో పనిగంటల తగ్గింపునకు అంబేద్కర్ కృషి


పనిగంటలను 12 నుంచి ఎనిమిదికి తగ్గించాలని 1942 నవంబరు 27న ఢిల్లీలో తన అధ్యక్షతన నిర్వహించిన నాలుగో భారత కార్మిక సదస్సులో అంబేద్కర్ తొలిసారిగా ప్రతిపాదించారు. 1945 నవంబరు 27, 28 తేదీల్లో జరిగిన ఏడో సదస్సు కర్మారాగాల్లో వారానికి 48 గంటల పని విధానానికి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సదస్సులో కేంద్ర, ప్రావిన్షియల్ ప్రభుత్వాలు, యాజమాన్య సంఘాలు, కార్మిక సంఘాలు పాల్గొన్నాయి. అధిక పనిగంటలతో కార్మికుడికి తగినంత వ్యక్తిగత సమయం లేకుండా చేయడం సరికాదని కార్మిక శాఖ తన మెమోరాండంలో చెప్పింది. వ్యక్తిగత ఎదుగుదలకు, శారీరక సామర్థ్యం పెంపునకు కార్మికులకు వ్యక్తిగత సమయం అవసరమని తెలిపింది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో కార్మికులు తీవ్రమైన పని ఒత్తిడికి లోనయ్యారని, వారికి ఉపశమనం కలిగించాల్సిన అవసరం ఉందని, పనిగంటల తగ్గింపునకు ఇది సరైన సమయమని ఆ సందర్భంగా వివరించింది. తక్కువ పనిగంటలతో ఉపాధి పెరుగుతుందని కూడా చెప్పింది. పనిగంటల తగ్గింపునకు అనుగుణంగా వేతనాల తగ్గింపునకు, డీఏ తగ్గింపునకు(ధరలు పడిపోతే తప్ప) వీల్లేదని మెమోరాండం స్పష్టం చేసింది.











అనుదినం... జనస్వరం

పెద్దపల్లి

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక



08 పేజీలు | సోమవారం 01 మే 2023 | www.navatelangana.com

ఎందరో ప్రాణత్యాగాల ఫలితమే మేడే

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

మే 1.. అంటే 'మేడే'. దీన్ని అంతర్జాతీయ కార్మిక దినోత్సవం అని కూడా పిలుస్తారు. అమెరికాలో మాత్రం ప్రస్తుతం దీన్ని 'లాయల్టీ డే'గా వ్యవహరిస్తున్నారు. చాలా దేశాల్లో మే డేని సెలవు దినంగా పాటిస్తారు. ఈ కార్మిక దినోత్సవ ఆవిర్భావాన్ని ఏ ఒక్క దేశానికో, సంఘటనకో ముడిపెట్టలేం. కానీ 1886లో షికాగోలోని హే మార్కెట్‌లో జరిగిన కార్మికుల ప్రదర్శనే ఈ మేడే పుట్టుకకు పునాది వేసిందని చెబుతారు. కార్మికులకు ఎనిమిది గంటల పని విధానం గురించి నినదిస్తూ 1886, మే1న చాలామంది కార్మికులు పోరాటం చేపట్టారు. దానికి మద్దతుగా నాలుగు రోజుల తరవాత షికాగోలోని హే మార్కెట్‌లో చాలామంది ప్రదర్శన నిర్వహించారు. కానీ ఆ ప్రదర్శన ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో కొందరు కార్మికులు చనిపోయారు. ఆ సంఘటన అనంతరం 1889 నుంచి 1890 వరకు అనేక దేశాల్లో కార్మికుల ఉద్యమాలూ, నిరసన ప్రదర్శనలూ చోటుచేసుకున్నాయి. 1890, మే 1న బ్రిటన్‌లోని హైడ్ పార్క్‌లో చేపట్టిన ప్రదర్శనకు దాదాపు 3 లక్షల మంది కార్మికులు హాజరయ్యారు. రోజులో కేవలం 8 గంటలు మాత్రమే పనివేళలు ఉండాలన్నదే ఆ ప్రదర్శనలో పాల్గొన్న వారి ప్రధాన డిమాండ్‌గా మారింది. ఆ పైన అనేక యూరోపియన్ దేశాల్లో ఇదే నినాదంతో ప్రదర్శనలు జరిగాయి. క్రమంగా షికాగోలో జరిగిన కార్మిక ప్రదర్శనలో చనిపోయిన వారికి గుర్తుగా మే 1ని కార్మిక దినోత్సవంగా జరుపుకోవాలన్న ఒప్పందం కూడా కుదిరింది. ఆపై ప్రపంచవ్యాప్తంగా మే డే స్వరూపం మారుతూ వచ్చింది. అనేక దేశాల్లో ఆ రోజున కార్మికుల హక్కుల కోసం పోరాటాలూ, నిరసన ప్రదర్శనలూ మాత్రం ఆగలేదు.



మేడే పుట్టింది ఇక్కడే...

ఎనిమిది గంటల పని, ఎనిమిది గంటలు వినోదం, ఎనిమిది గంటలు విశ్రాంతి కావాలన్న బ్యానర్ పట్టుకుని 1858లో ఆస్ట్రేలియాలో ఎనిమిది గంటల పని దినోత్సవ మూడో వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న కార్మిక సంఘం అధ్యక్షుడు ఆర్ మిల్లర్, కార్యదర్శి జి. రావెన్‌స్ర్కాఫ్ట్, సభ్యులు







అసంఘటింత కార్మికులకు ఆర్థిక భద్రత 'ఈ శ్రమ్' కార్డు

- సంఘటిత కార్మికులకు సమానంగా ప్రయోజనాలు
- ప్రభుత్వ పథకాల నుండి సులభంగా ప్రయోజనాలు పొందే అవకాశం
- మేడే సందర్భంగా ఈ శ్రమ్ కార్డు ప్రయోజనాలపై 'నవ తెలంగాణ' ప్రత్యేక కథనం





నవతెలంగాణ-పెద్దపల్లి:

ఈ-శ్రమ్ కార్డ్ అసంఘటిత రంగంలోని కార్మికులకు ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు సంఘటిత రంగ కార్మికులతో సమానంగా ప్రయోజనాలు కల్పించేందుకు ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టులో ఈ-శ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించింది. ఈ పోర్టల్ ద్వారా దేశంలోని అసంఘటిత రంగ కార్మికులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి అన్ని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వారికి అందజేయడమే ప్రభుత్వ ఉద్దేశం. ఇందుకోసం కూలీలకు ఈ-శ్రమ్ కార్డులు అందజేస్తున్నారు. ప్రభుత్వ పథకాల నుంచి సులభంగా ఉపాధి పొందే అవకాశాలను చూపుతున్నారు.

ఈ-శ్రమ్ కార్డ్ అంటే ఏమిటి?

ఈ-శ్రమ్ కార్డ్ అనేది కార్మికులకు ప్రభుత్వం జారీ చేసిన ప్రత్యేక కార్డు. ఇది కార్మికుడు అసంఘటిత రంగంలోని వాడని రుజువు చేస్తుంది. ఇప్పుడు కార్మికులు తమ ప్రయోజనాలను పొందేందుకు పెద్దగా పరుగులు తీయాల్సిన అవసరం ఉండదు. దీన్ని చూపించడం లేదా సమర్పించడం ద్వారా అసంఘటిత రంగ కార్మికులకు అందుబాటులో ఉన్న అన్ని ప్రయోజనాలు అందుతాయి.

ఈ-శ్రమ్ కార్డ్ ప్రయోజనాలు ఏమిటి?

ఈ-శ్రమ్ కార్డు పొందిన కూలీలు దేశంలో ఎక్కడైనా ఉపాధి పొందడం సులభం అవుతుంది. డేటాబేస్‌లో వారికి సంబంధించిన డేటా వల్ల వారు పనిని సులభంగా పొందుతారు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదైన కార్మికుడికి రూ.2 లక్షల ప్రమాద బీమా కవరేజీ ఉంటుంది. పోర్టల్‌లో నమోదైన కార్మికుడు ప్రమాదానికి గురైతే, మరణం లేదా పూర్తి అంగవైకల్యం సంభవించినప్పుడు రూ.2 లక్షల మొత్తం ఇస్తారు. అదే సమయంలో కార్మికుడు పాక్షికంగా అంగవైకల్యం కలిగి ఉంటే ఈ బీమా పథకం కింద లక్ష రూపాయలకు అర్హులు.

ఈ కార్డు సహాయంతో అసంఘటిత రంగ కార్మికులకు ప్రధాన మంత్రి శ్రమ యోగి మాన్ ధన్ యోజన, స్వయం ఉపాధి కోసం జాతీయ పెన్షన్ పథకం, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రజా పంపిణీ వ్యవస్థ, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, జాతీయ ప్రభుత్వ పథకాలైన సామాజిక సహాయ పథకం, ఆయుష్మాన్ భారత్, నేత కార్మికులకు ఆరోగ్య పథకం, ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన, ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం వంటి వాటి ద్వారా ప్రయోజనం పొందుతారు.

నమోదు ప్రక్రియ, షరతులు ఏమిటి?

అసంఘటిత రంగంలో పనిచేసే 16 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల ఎవరైనా ఈ కార్డు కోసం నమోదు చేసుకోవచ్చు. వర్కర్ స్వయంగా లేదా ఈ-శ్రమ్ పోర్టల్ ష్ట్రజూం://వంష్ట్రతీఖఎ.స్త్రశీఙ.ఱఅ ద్వారా కామన్ సర్వీస్ సెంటర్ (జూజ) ని సందర్శించడం ద్వారా నమోదు చేసుకోవచ్చు. నమోదు పూర్తిగా ఉచితం. కార్మికులు పోర్టల్ లేదా కామన్ సర్వీస్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్ కోసం ఎటువంటి చెల్లింపులు చేయనవసరం లేదు.

ఏ పత్రాలు అవసరమవుతాయి?

పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ కోసం, కార్మికులు పేరు, వృత్తి, చిరునామా, విద్యార్హత, నైపుణ్యం వంటి సమాచారాన్ని అందించాలి. మీరు రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ నంబర్‌ను నమోదు చేసిన వెంటనే అక్కడ ఉన్న డేటాబేస్ నుంచి వర్కర్ మొత్తం సమాచారం పోర్టల్‌లో స్వయంచాలకంగా కనిపిస్తుంది. వ్యక్తి మిగిలిన అవసరమైన సమాచారాన్ని పూరించాలి. కార్మికుడు ఈ-శ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ నంబర్, ఆధార్ లింక్ చేసిన మొబైల్ నంబర్. బ్యాంక్ ఖాతా అవసరం. ఒక కార్మికుడికి ఆధార్‌తో లింక్ చేయబడిన మొబైల్ నంబర్ లేకపోతే, అతను/ ఆమె సమీపంలోని (జూజ) ని సందర్శించి బయోమెట్రిక్ ప్రమాణీకరణ ద్వారా నమోదు చేసుకోవచ్చు.

సీఎస్‌సీ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి

కేవీఎస్ రామ్మోహన్
అసిస్టెంట్ లేబర్ అధికారి, పెద్దపల్లి



కేంద్ర ప్రభుత్వం అసంఘటిత కార్మికుల కోసం అమలు చేస్తున్న ఈ శ్రమ్ కార్డుల కోసం జిల్లా కేంద్రాల్లో సీఎస్సీ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. వ్యక్తిగతంగా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ విధంగా కార్డు పొందిన కార్మికులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ఉపయోగిం చుకోవచ్చు. ఈ విధంగా పెద్దపల్లి జిల్లాలో సీఎస్సీ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న వారు 36,939 మంది, సొంతగా చేసుకున్న వారు 76,408 మంది, ఈ విధంగా మొత్తం జిల్లాలో 1.13.376 మంది ఉన్నారు.

శ్రమకు దక్కని ఫలితం

- కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కార్మిక వ్యతిరేక విధానాలు కార్మికులపై పెను భారం..
- హరించుకుపోతున్న కార్మికుల హక్కులు, చట్టాలు
- మేడే స్ఫూర్తితో భవిష్యత్ పోరాటాలకు సన్నద్ధమవుతున్న కార్మిక వర్గం





నవతెలంగాణ-పెద్దపల్లి:

వివిధ ఫ్యాక్టరీలు, కంపెనీలు, పథకాలు, సంస్థల్లో ఏళ్ల తరబడి పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు శ్రమకు తగ్గ కనీస ఫలితం దక్కడం లేదు. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గం పట్ల అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు కార్పొరేట్ విధానాల ఫలితంగా కార్మికుల హక్కులు, చట్టాలు హరించుకుపోతున్నాయి. మరోవైపు కార్మికులపై బారం పెరుగుతుండడంతో కార్మికుల స్థితిగతులు చిన్నాభిన్నమవుతున్న ఈ నేపథ్యంలో నేడు ప్రపంచ వ్యాప్తంగా జరగబోతున్న మేడే స్ఫూర్తితో పెద్దపెల్లి జిల్లాలో కార్మిక వర్గం తమ హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో పోరాటాలకు సన్నద్ధమవుతున్నాయి. నేడు జరగబోయే మేడే సందర్భంగా పెద్దపల్లి జిల్లాలో వివిధ ఫ్యాక్టరీలు, సంస్థలు, కంపెనీల్లో పని చేస్తున్న కార్మికుల స్థితిగతులపై 'నవ తెలంగాణ' ప్రత్యేక కథనం.

మే డే నేపథ్యం...

ఎనిమిది గంటల పని దినం కోసం అమెరికా దేశంలో.. చికాగో నగరంలో ఏ మార్కెట్ వద్ద సమ్మె ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులపై పోలీసులు కాల్పులు జరపడంతో అనేక మంది కార్మికులు, నాయకులు చనిపోయారు. కాల్పుల్లో గాయపడ్డ రక్తంతో తడిసిన అంగిని పైకి ఎగరేయడంతో అప్పటి నుండి ఎర్రజెండాగా మారింది. అమెరికా దేశంలో పుట్టిన ఎర్రజెండా ప్రపంచవ్యాప్తంగా కులం, మతం, ప్రాంతం, లింగం, జాతి అనే తేడా లేకుండా సకల శ్రామికులకు హక్కులకు, రక్షణకు సౌకర్యాల సాధనకు అండగా నిలబడుతోంది. 137 సంవత్సరాల క్రితం జరిగిన ఈ చారిత్రిక పోరాటం నేటికి స్ఫూర్తిదాయకం. నేటి పాలకవర్గాలు చికాగో అమరవీరుల రక్తతర్పణతో సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచాలని, గత వంద సంవత్సరాలుగా దేశంలో కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న, హక్కులు, సౌకర్యాలు, చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చారు. అందుకే మేడే ప్రాధాన్యత మరింత పెరిగింది. మేడే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో ఐక్య పోరాటాలు, సమరశీల ఉద్యమాలతో కార్మిక వర్గం సమర్థమవుతుంది.

జిల్లా వ్యాప్తంగా
1 లక్షా 20 వేలు పైగా మంది కార్మికులు:

పెద్దపల్లి జిల్లాలో సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్సిఎల్, బసంత్ నగర్, తదితర ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమల్లో పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులు సుమారు 30 వేల మంది పని చేస్తున్నారు. అసంఘటిత రంగాలైన హమాలీ, బిల్డింగు, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్, రైస్ మిల్లు, తదితర రంగాల్లో సుమారు 50 వేల మంది పని చేస్తున్నారు, స్థానిక సంస్థలు, స్కీం వర్కర్స్, ప్రభుత్వ ఉద్యోగులు, షాప్ ఎంప్లాయిస్, ప్రైవేటు విద్యాసంస్థలు, హాస్పిటల్స్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్ కలిపి సుమారు పది వేల మంది పని చేస్తున్నారు. ఇటుక బట్టీలు, జన్నింగ్, ఆయిల్ మిల్స్, ఎన్టిపిసి తెలంగాణ ప్రాజెక్టు నిర్మాణం, సింగరేణి ఓసీపీలో, రైస్ మిల్స్ రంగాల్లో సుమారు 25 వేల మంది వలస కార్మికులు పని చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 1 లక్షా 15 వేల మంది కార్మికులు, ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.

కార్మికుల స్థితిగతులు...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభించే కార్పొరేట్ పెద్దపల్లి జిల్లాలో ఫ్యాక్టరీలు సంస్థల్లో పని చేసే కార్మికులపై తీరమైన ప్రభావం చూపిస్తుంది. దీని ఫలితంగా కార్మికులపై పెనుబారం పడుతోంది. కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా పెద్దపల్లి జిల్లాలో సింగరేణి, ఎన్టీపీసీ తదితర పరిశ్రమల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు, గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెరగకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన నిత్యవసర సరుకుల వస్తువుల ధరలతో కుటుంబాల గడపడం దుర్భరంగా మారింది. ప్రతి రంగంలో కార్మికులు, ఉద్యోగులపై తీవ్రమైన పని ఒత్తిడి పెరుగుతుంది. అనేక రంగాల్లో తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు ఉద్యమాలు, సమ్మెలు నిరంతరం జిల్లాలో జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలు జిల్లాలో కార్మిక వర్గంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. నాలుగు లేబర్ కోడ్‌లు అధికారికంగా అమలులోకి రాకుండా దాని ప్రభావం తీవ్రంగానే ఉంది. ఇటుక బట్టీలు, రైస్ మిల్లులు, సింగరేణి ఓబి కాంట్రాక్ట్ కార్మికులు, ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు నిర్మాణ కార్మికులతో 12 గంటలు పని చేయిస్తున్నారు. సింగరేణి, ఎన్టీపీసీ, ఎల్ఐసీ, రైల్వే తదితర రంగాల ప్రైవేటీకరణ మూలంగా కార్మిక వర్గం తీవ్రమైన అభద్రతాభావంలో, తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారు. పని భారం పెరగడం పని భద్రత లేకపోవడం తీవ్రమైన సమస్యలుగా ఉన్నాయి.

సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమాలు:

గత సంవత్సర కాలంగా సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లాలో సమరశీల ఉద్యమాలు జరిగాయి. అనేక ఐక్య పోరాటాలకు నాయకత్వం వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న మతోన్మాద కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని చైతన్య పరచడం కోసం అనేక క్యాంపెయిన్స్ చేశారు. సింగరేణి ఎంప్లాయిస్‌కు నివాస ప్రాంతాల్లో తాగునీరు, సొంత ఇంటి పథకం, రోడ్లు, డ్రైనేజీ లాంటి సమస్యలపై సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సమరశీల పోరాటం చేశారు. మున్సిపల్ కార్మికులు వేధింపులకు, తొలగింపులకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన వేతనాల ఎరియర్స్ చెల్లింపు కోసం సమ్మె చేశారు. ఎన్టిపిసి కాంట్రాక్ట్ కార్మికులు గతంలో జరిగిన వేతన ఒప్పందంలోని అంశాలు అమలు చేయాలని కొత్త వేతన ఒప్పందం చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో సమరశీల సమ్మె పోరాటం చేశారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో చారిత్రాత్మకమైన 18 రోజుల సమ్మె జిల్లాలో జయప్రదం అయింది. రైస్ మిల్లు ఆపరేటర్స్ కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం చేసుకున్నారు. రైస్ మిల్లు గుమస్తాలు మహిళా కార్మికులకు సంఘాలు ఏర్పాటు చేసి వాళ్ళ హక్కుల సౌకర్యాలు సాధన కోసం కృషి చేశారు. సింగరేణి ఎంప్లాయిస్ నివాస ప్రాంతాల్లో జరిగిన పోరాటం మూలంగా సింగరేణి యాజమాన్యం స్పందించి తాగునీటి కోసం ఆరో ప్లాంట్లు ఏర్పాటు చేయడం రోడ్లు, డ్రైనేజీ క్వార్టర్స్, రిపేరు తదితర సమస్యలను పరిష్కరించుకున్నారు. మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన వేతనాల ఏరియర్ ఇప్పించడం, తొలగింపులు, వేధింపులకు వ్యతిరేకంగా పోరాడి కార్మికుల ఉద్యోగాలను దక్కించుకున్నారు. గ్రామ పంచాయతీ రంగంలో పెండింగ్ వేతనాల కోసం వేధింపులు, తొలగింపులకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్త ఉద్యమాన్ని నిర్వహించి పెండింగ్ వేతనాలు సాధించడంతో కార్మికుల తొలగింపు నిలిపివేశారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల్లో వివిధ ప్రమాదాల సందర్భంగా చనిపోయిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం ఇప్పించడం కోసం అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించి.. నష్ట పరిహారం ఇప్పించుకున్నారు. కరోనా విపత్తులో చనిపోయిన అంగన్వాడీలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 50 లక్షల రూపాయలు జిల్లాలో ఇద్దరు అంగన్వాడీ టీచర్లకు ఇప్పించారు. ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికులను మెడికల్ చెకప్ పేరుతో తొలగించాలని యజమాన్యం కుట్ర పన్నితే పోరాడి కార్మికులందరినీ విధుల్లో కొనసాగే విధంగా కృషి చేశారు.

మే డే స్ఫూర్తి తో భవిష్యత్ పోరాటాలకు సన్నద్ధం..

మే డే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో జిల్లాలో నెలకొన్న కార్మికుల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం స్వతంత్ర ఐక్య పోరాటాలు నిర్మించేందుకు సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక వర్గం సన్నద్ధమవుతోంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద కార్పొరేట్ విధానాల మూలంగా కార్మిక వర్గానికి సవాళ్లను అధిగమించడం కోసం, కార్మిక వర్గాన్ని చైతన్య పరచడం కోసం జిల్లా వ్యాప్త క్యాంపెయిన్స్ చేస్తున్నారు. సమస్యలకు కారణమైన విధానాలు, ఆ విధానాల వెనుకున్న రాజకీయాలను కార్మిక వర్గానికి అర్థం చేయించడమే ప్రధాన కర్తవ్యంగా ముందుకు వెళ్తున్నారు. జిల్లాలో ఉన్న ప్రతి కార్మికున్ని, కార్మికురాలిని చేరుకోవడమే లక్ష్యంగా పని చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.





కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న కార్మిక శాఖ

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు కార్మికులకు
- వర్తింపచేసేందుకు కృషి
- కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు
- చేసేందుకు వైద్య శిబిరాలు ఏర్పాటు
- మే డే సందర్భంగా పెద్దపల్లి జిల్లా సహాయ
- కార్మిక శాఖ అధికారి కేవీఎం
- రామ్మోహన్‌తో 'నవ తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూ

నవతెలంగాణ-పెద్దపల్లి:

కార్మికుల సంక్షేమమే ద్యేయంగా కార్మిక శాఖ పని చేస్తుంది. అమలు చేసే సంక్షేమ పథకాలను కార్మికుల కోసం వర్తింప చేసేందుకు కృషి చేస్తున్నామని మే డే సందర్భంగా 'నవ తెలంగాణ' ప్రత్యేక సంచికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పెద్దపెల్లి జిల్లా సహాయ కార్మిక శాఖ అధికారి కేవీఎం రామ్మోహన్ తెలిపారు.

నవతెలంగాణ: కార్మిక శాఖ పెద్దపల్లి జిల్లాలో ఏ పరిధిలో పని చేస్తుంది. ఎన్ని మండలాలలో కార్మిక శాఖ విధులు నిర్వహిస్తోంది?

కార్మిక శాఖ అధికారి: కరీంనగర్ రీజియన్ కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ సహాయ కార్మిక కమిషనర్ నేతృత్వంలో జిల్లాలోని కార్మిక శాఖ ఉంది. పెద్దపల్లి జిల్లాలో 1.సహాయ కార్మిక అధికారి, పెద్దపల్లి పరిధిలో పెద్దపల్లి, ధర్మారం, సుల్తానాబాద్, ఎలిగేడ్, జూలపల్లి. 2. సహాయ కార్మిక అధికారి, గోదావరిఖని. పరిధిలో రామగుండం, పాలకుర్తి, రామగిరి, కామాన్‌పూర్, ఆంథెర్గావ్. 3. సహాయ కార్మిక అధికారి, మంథని పరిధిలో మంథని, ముత్తారం, కాల్వ శ్రీరాంపూర్, ఓదెల మండలాల పరిధిలో పని చేస్తుంది.

నవతెలంగాణ: కార్మిక శాఖ విధులు ఏమిటి?


కార్మిక శాఖ అధికారి: కార్మిక శాఖ ప్రధాన విధులు నాలుగు భాగాలుగా పని చేస్తుంది. 1. పారిశ్రామిక సంబంధాలను నిర్వహించడం, 2. ఖ్వాసి న్యాయ విధులు, 3. కార్మిక చట్టాల అమలు, 4. కార్మిక చట్టాల కింద సంస్థల రిజిస్ట్రేషన్ల పునరుద్ధరణలు, 5. భవన నిర్మాణ కార్మికుల రిజిస్ట్రేషన్లు, భవనం ఇతర నిర్మాణ కార్మికుల చట్టం, 6. కింద స్థాపనలు సెస్ కలెక్షన్, 6.కార్మిక సంక్షేమ కార్యకలాపాలు 1.కార్మిక సంక్షేమ బోర్డు, 2.భవనం ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు 3.అసంఘటిత కార్మికుల కోసం రాష్ట్ర సామాజిక భద్రతా బోర్డు 7. బీడీ, సిగార్ వర్కర్స్ హౌసింగ్ ప్రోగ్రాం 8. బాల కార్మిక నిర్మూలన 9.పరిపాలన 10.ఇంటర్-స్టేట్ మైగ్రెంట్ వర్కర్ వెల్ఫేర్ 11. ఇతర విధులు ఎప్పటికప్పుడు ప్రభుత్వం అప్పగించే ఏ పనులైనా అమలు చేస్తాం.

నవతెలంగాణ: కార్మిక చట్టాల ప్రకారం ఎటువంటి సంస్థలకు రిజిస్ట్రేషన్లు చేస్తారు?

కార్మిక శాఖ అధికారి: కార్మిక చట్టాల ప్రకారం సంస్థల రిజిస్ట్రేషన్లు, పునరుద్ధరణలు చేస్తాం. అధికారులు రిజిస్ట్రేషన్ లైసెన్సింగ్ అధికారులు కింది చట్టాల ప్రకారం వివిధ సంస్థలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు లైసెన్సులను జారీ చేస్తారు. 1) టిఎస్ షాప్స్, ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2) కాంట్ కాంట్రాక్ట్ లేబర్ ఆర్ అండ్ ఎ చట్టం. 3) బిల్డింగ్, ఇతర నిర్మాణ కార్మికుల చట్టం. 4) ఇంటర్ స్టేట్ మైగ్రెంట్ వర్కర్స్ యాక్ట్ 5) బీడీ, సిగార్ వర్కర్స్ యాక్ట్ 6) మోటర్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్లు చేస్తాం. తెలంగాణ ప్రభుత్వ 'ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్' తాజా విధానం ప్రకారం, అన్ని రిజిస్ట్రేషన్లు, పునరుద్ధరణలు, వెబ్ పోర్టల్ ద్వారా చేస్తున్నాం. శ్రీఖఎశీబత్.వశ్రీఖఅస్త్రుఅఖ.స్త్రశీజ.ఱఅ అనేది ఒక డీమోనిటరైజ్డ్ పరిష్కారం, ఇక్కడ ఒక దరఖాస్తుదారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చెల్లించవచ్చు.

నవ తెలంగాణ: కార్మికుల ఆరోగ్యం, పరిస్థితులపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

కార్మిక శాఖ అధికారి: కార్మిక శాఖ ఆధ్వర్యంలో కార్మికుల ఆరోగ్యానికి సంబంధించి చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లాలో ఉన్న వివిధ ఫ్యాక్టరీలు, కంపెనీలు, సంస్థలు, పథకాలు దుకాణాలలో భవన నిర్మాణ రంగలో పనిచేసే లేబర్ కార్డు ఉన్న కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. అందుకు గాను ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. అందులో భాగంగా పెద్దపల్లి జిల్లాలో రెండు రోజుల క్రితం గోదావరినీలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నాం. అదేవిధంగా పెద్దపల్లి జిల్లా కేంద్రం, సుల్తానాబాద్, మంథని కేంద్రాల్లో కూడా వైద్య శిబిరాలు నిర్వహిస్తాం.


































మేడే స్ఫూర్తితో భవిష్యత్ పోరాటాలు

- భవిష్యత్తులో స్వతంత్ర ఐక్య పోరాటాల నిర్మాణం
- ఒకటి నుండి ఆరు వరకు మేడే వారోత్సవాలు
- గ్రామస్థాయి నుండి జిల్లా కేంద్రం స్థాయి వరకు మేడే జెండా ఆవిష్కరణలు
- మేడే సందర్భంగా 'నవ తెలంగాణ' ప్రత్యేక సంచికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు



నవతెలంగాణ-పెద్దపల్లి:

మేడే స్ఫూర్తితో కార్మిక వర్గ సమస్యలను పరిష్కరించడం కోసం భవిష్యత్తులో స్వతంత్ర ఐక్య పోరాటాల నిర్మాణం చేపడతామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు అన్నారు. ఈ మేడే సందర్భంగా పెద్దపల్లి జిల్లాలో ప్రతి గ్రామస్థాయి నుండి పట్టణం, మండలం, జిల్లా కేంద్రం స్థాయి వరకు సంస్థలు, కంపెనీలు, ఫ్యాక్టరీలలో, అడ్డాల వద్ద మేడే జెండాలను ఆవిష్కరిస్తామని తెలిపారు. ఇదే సందర్భంగా ఒకటి నుండి ఆరు వరకు వారం రోజుల పాటు మేడే వారోత్సవాలను నిర్వహించనున్నామని 'నవ తెలంగాణ' మే డే ప్రత్యేక సంచికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

నవ తెలంగాణ: మేడే సందర్భంగా పెద్దపల్లి జిల్లాలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఎటువంటి కార్యక్రమాలు చేపడుతున్నారు?

ముత్యంరావు: ప్రపంచ కార్మికుల దినోత్సవమయినా మేడేను పెద్దపల్లి జిల్లాలో మే 1న ప్రతి గ్రామంలో, పట్టణంలో, పరిశ్రమలు, సంస్థలు, కంపెనీలు, అడ్డాల వద్ద మేడే పతాకావిష్కరణ చేస్తున్నాం. మే 1 నుండి మే 6 వరకు వారం రోజుల పాటు జిల్లాలో మేడే వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. పెద్దపల్లి, ఎన్టీపీసీ, గోదావరిఖని మూడు కేంద్రాల్లో సమ్మె శిబిరాలు ఏర్పాటు చేసి ప్రతిరోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నాం. ఈ సందర్భంగా కార్మికుల కుటుంబాలు పాల్గొనే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నాం.. మిగతా ప్రాంతాల్లో, వివిధ రూపాల్లో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. మే 6న మే డే వారోత్సవాల ముగింపు సందర్భంగా పెద్ద ఎత్తున ప్రదర్శనలు, సభలు నిర్వహిస్తాం. నేటి మతోన్మాద కార్పొరేట్ కల్చర్‌కు భిన్నంగా ప్రత్యామ్నాయ సంస్కృతిని శ్రామిక వర్గంలోకి తీసుకెళ్లడం ఈ వారోత్సవాల ప్రధాన లక్ష్యం.

నవ తెలంగాణ: మేడే నేపథ్యం ఏ విధంగా వచ్చింది? దాని ప్రాధాన్యత ఏమిటి?

ముత్యంరావు: ఎనిమిది గంటల పని దినం కోసం అమెరికా దేశంలో చికాగో నగరంలో ఏ మార్కెట్ వద్ద సమ్మె ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులపై పోలీసులు కాల్పులు జరపడంతో అనేక మంది కార్మికులు, నాయకులు చనిపోయారు. కాల్పుల్లో గాయపడ్డ రక్తంతో తడిసిన అంగిని పైకి ఎగరేయడంతో అప్పటి నుండి ఎర్రజెండాగా మారింది. అమెరికా దేశంలో పుట్టిన ఎర్రజెండా ప్రపంచవ్యాప్తంగా కులం, మతం, ప్రాంతం, లింగం, జాతి అనే తేడా లేకుండా సకల శ్రామికులకు హక్కులకు, రక్షణకు, సౌకర్యాల సాధనకు అండగా నిలబడుతుంది. 137 సంవత్సరాల క్రితం జరిగిన ఈ చారిత్రిక పోరాటం నేటికి స్ఫూర్తిదాయకం. నేటి పాలక వర్గాలు చికాగో అమరవీరుల రక్తతర్పణతో సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచాలని, గత వంద సంవత్సరాలుగా దేశంలో కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న, హక్కులు, సౌకర్యాలు, చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చారు. అందుకే మేడే ప్రాధాన్యత మరింత పెరిగింది, మేడే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో ఐక్య పోరాటాలు, సమరశీల ఉద్యమాలు పెరగాల్సిన అవసరం ఉంది.

నవతెలంగాణ: పెద్దపల్లి జిల్లాలో సంఘటిత, అసంఘటిత కార్మికులు ఎంతమంది పని చేస్తున్నారు? వివిధ సంస్థలు, ఫ్యాక్టరీలు, కంపెనీలలో ఎంత మంది కార్మికులు ఉన్నారు?

ముత్యంరావు: పెద్దపల్లి జిల్లాలో సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్సిఎల్, బసంత్ నగర్, తదితర ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమల్లో పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులు సుమారు 30 వేల మంది పని చేస్తున్నారు. అసంఘటిత రంగాలైన హమాలీ, బిల్డింగు, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్, రైస్ మిల్లు, తదితర రంగాల్లో సుమారు 50 వేల మంది పని చేస్తున్నారు. స్థానిక సంస్థలు, స్కీం వర్కర్స్, ప్రభుత్వ ఉద్యోగులు, షాప్ ఎంప్లాయిస్, ప్రైవేటు విద్యాసంస్థలు, హాస్పిటల్స్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్ కలిపి సుమారు పదివేల మంది పని చేస్తున్నారు. ఇటుక బట్టీలు, జన్నింగ్, ఆయిల్ మిల్స్, ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు నిర్మాణం, సింగరేణి ఓసీపీలో, రైస్ మిల్స్ రంగాల్లో సుమారు 25 వేల మంది వలస కార్మికులు పని చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 1 లక్షా 15 వేల మంది కార్మికులు, ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.

నవ తెలంగాణ: జిల్లాలో వివిధ సంస్థలు, కంపెనీలు, ఫ్యాక్టరీలు, వివిధ రంగాల్లో పనిచేసే కార్మికుల స్థితిగతులు ఏమిటి? ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు?

ముత్యంరావు: సింగరేణి, ఎన్టీపీసీ తదితర పరిశ్రమల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల, గ్రామ పంచాయతీ కార్మికుల, వేతనాలు పెరగకపోవడంతో తీవ్రమైన అసంతృప్తి ఉంది. పెరిగిన నిత్యావసర సరుకుల వస్తువుల ధరలతో కుటుంబాలు గడపడం దుర్భరంగా మారింది. ప్రతి రంగంలో కార్మికులు, ఉద్యోగులపై తీవ్రమైన పని ఒత్తిడి పెరుగుతోంది. అనేక రంగాల్లో తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు, ఉద్యమాలు, సమ్మెలు నిరంతరం జిల్లాలో జరుగుతున్నాయి.

నవ తెలంగాణ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కార్మికులపై ఎటువంటి ప్రభావం చూపుతుంది?

ముత్యంరావు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలు జిల్లాలో కార్మిక వర్గంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. నాలుగు లేబర్ కోడ్‌లు అధికారికంగా అమలులోకి రాకుండా దాని ప్రభావం తీవ్రంగానే ఉంది. ఇటుక బట్టీలు, రైస్ మిల్లు, సింగరేణి, ఓబి కాంట్రాక్ట్ కార్మికులు, ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు నిర్మాణ కార్మికులతో 12 గంటలు పని చేయిస్తున్నారు. సింగరేణి, ఎన్టీపీసీ, ఎల్ఐసీ, రైల్వే తదితర రంగాల ప్రైవేటీకరణ మూలంగా కార్మిక వర్గం తీవ్రమైన అభద్రతాభావంలో జీవిస్తున్నారు. రామగుండం కార్పొరేషన్‌ను కేంద్ర ప్రభుత్వం బి కేటగిరిలోకి తేవాలని అనేక సంవత్సరాలుగా పోరాడుతున్నా అమలు చేయడం లేదు. బి కేటగిరి లోకి మారితే కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు ఘననీయంగా పెరుగుతాయి. పెర్మనెంట్ ఉద్యోగులకు హెచ్ఆర్ఏ పెరుగుతుంది. జిల్లాలో వేలాది మంది కాంటాక్ట్ కార్మికులు ఈఎస్ఐ ట్రస్టులో సభ్యులుగా ఉన్నారు. ప్రతినెలా కోట్లాది రూపాయలు ఈఎస్ఐ ట్రస్ట్‌కు జమ అవుతుంది. కానీ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఈఎస్ఐ హాస్పిటల్ నెలకొల్పడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దీని మూలంగా కార్మికులు వైద్య కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెద్దపల్లి జిల్లా ఏర్పడి ఐదు సంవత్సరాలు పూర్తయినా నేటికీ కార్మికుల సమస్యలు చెప్పుకోవడానికి డీసీఎల్ అధికారిని నియమించకపోవడం, ప్రతి విషయానికి కరీంనగర్ డీసీఎల్ వద్దకు వెళ్లాల్సి రావడం పెద్ద సమస్యగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం వివిధ రంగాల కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో షెడ్యూల్లో, పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుల కనీస వేతనాల జీవోలను గత తొమ్మిది సంవత్సరాలుగా సాధించకపోవడంతో కార్మికులు ఆర్థికంగా చితికిపోతున్నారు. తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారు. పని భారం పెరగడం, పని భద్రత లేకపోవడం తీవ్రమైన సమస్యలుగా ఉన్నాయి.

నవ తెలంగాణ: పెద్దపల్లి జిల్లాలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక సమస్యలపై ఎటువంటి పోరాటాలు నిర్వహించారు. పరిష్కరించిన సమస్యలు, విజయాలు ?

ముత్యంరావు: గత సంవత్సర కాలంగా సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లాలో సమరశీల ఉద్యమాలు జరిగాయి. అనేక ఐక్య పోరాటాలకు నాయకత్వం వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న మతోన్మాద కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని చైతన్య పరచడం కోసం అనేక క్యాంపెయిన్స్ చేశాం. సింగరేణి ఎంప్లాయిస్ కు నివాస ప్రాంతాల్లో తాగునీరు, సొంత ఇంటి పథకం, రోడ్లు, డ్రైనేజీ లాంటి సమస్యలపై సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో సమరశీల పోరాటం జరిగింది. మున్సిపల్ కార్మికులకు వేధింపులకు తొలగింపులకు వ్యతిరేకంగా ఉద్యమించాం. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన వేతనాల ఏరియర్స్ చెల్లింపు కోసం సమ్మె జరిగింది. ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికులకు గతంలో జరిగిన వేతన ఒప్పందంలోని అంశాలు అమలు చేయాలని, కొత్త వేతన ఒప్పందం చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో సమరశీల సమ్మె పోరాటం జరిగింది. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో చారిత్రాత్మకమైన 18 రోజుల సమ్మె జిల్లాలో జయప్రదంగా జరిగింది. రైస్ మిల్లు ఆపరేటర్స్ కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం చేశాం. రైస్ మిల్లు గుమస్తాలు, మహిళా కార్మికులకు సంఘాలు ఏర్పాటు చేసి వాళ్ల హక్కుల సౌకర్యాలు, సాధన కోసం కృషి చేస్తున్నాం. సింగరేణి ఎంప్లాయిస్ నివాస ప్రాంతాల్లో జరిగిన పోరాటం మూలంగా సింగరేణి యాజమాన్యం స్పందించి తాగునీటి కోసం ఆరో ప్లాంట్లు ఏర్పాటు చేయడం, రోడ్లు, డ్రైనేజీ, క్వార్టర్స్ రిపేరు తదితర సమస్యలను పరిష్కరించాం. మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన వేతనాల ఏరియర్ ఇప్పించడం, తొలగింపులు, వేధింపులకు వ్యతిరేకంగా పోరాడి కార్మికుల ఉద్యోగాలను కాపాడాడాం. గ్రామ పంచాయతీ రంగంలో పెండింగ్ వేతనాల కోసం వేధింపులు తొలగింపులకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్త ఉద్యమాన్ని నిర్వహించి పెండింగ్ వేతనాలు సాధించడం, కార్మికుల తొలగింపును నిలిపివేశాం. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల్లో వివిధ ప్రమాదాల సందర్భంగా చనిపోయిన కార్మికుల కుటుంబాలకు నష్ట పరిహారం ఇప్పించడం కోసం అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి నష్టపరిహారం ఇప్పించాం. కరోనా విపత్తులో చనిపోయిన అంగన్వాడీలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 50 లక్షల రూపాయలు జిల్లాలో ఇద్దరు అంగన్వాడీ టీచర్లకు ఇప్పించాం. ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికులను మెడికల్ చెకప్ పేరుతో తొలగించాలని యజమాన్యం కుట్ర పన్నితే పోరాడి కార్మికులందరినీ వీధుల్లో కొనసాగే విధంగా కృషి చేశాం.

నవ తెలంగాణ: మే స్ఫూర్తితో జిల్లాలో భవిష్యత్తులో సమస్యలపై చేపట్టబోయే పోరాటాలు ఏమిటి?

ముత్యంరావు:

మే డే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో జిల్లాలో నెలకొన్న కార్మికుల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం స్వతంత్ర ఐక్య పోరాటాలు నిర్మిస్తాం. కేంద్రంలోని బీజే పీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద కార్పొరేట్ విధానాల మూలంగా కార్మిక వర్గానికి సవాళ్లను అధిగమించడం కోసం కార్మిక వర్గాన్ని చైతన్య పరచడం కోసం జిల్లా వ్యాప్త క్యాంపెయిన్స్ చేస్తాం. సమస్యలకు కారణమైన విధానాలు, ఆ విధానాల వెనుకున్న రాజకీయాలను కార్మిక వర్గానికి అర్థం చేయించడమే ప్రధాన కర్తవ్యంగా ముందుకు వెళ్తాం. అందుకు జిల్లాలో ఉన్న ప్రతి కార్మికున్ని, కార్మికురాలిని చేరుకోవడమే మా లక్ష్యంగా పని చేస్తాం.

ప్రభుత్వాలు శ్రామిక మహిళల సమస్యలు పరిష్కరించడంలో విఫలం




జి.జ్యోతి : శ్రామిక మహిళా పెద్దపల్లి జిల్లా కన్వీనర్

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్:

శ్రామిక మహిళ సమన్వయ కమిటీ సీఐటీయూ తరపున ప్రపంచ కార్మిక దినోత్సవ మే డే శుభాకాంక్షలు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రామిక మహిళల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయి. జిల్లాలో అంగన్వాడీ, ఆశ , ఐకెపి, వివోఏ, మున్సిపల్, గ్రామ పంచాయతీ, భవన నిర్మాణ రంగంలో, ఆర్టీసీ, సింగరేణి సంస్థలు, పని చేస్తున్న మహిళలు, షాపింగ్ మాల్స్, ప్రైవేట్ రంగంలో వేలాది మంది పని చేస్తున్న శ్రామిక మహిళలకు కనీస వేతనాలు, చట్టబద్ధ సౌకర్యాలు ఇప్పటికీ అందడం లేదు. పాలక వర్గాలు, మహిళలను ఒక ఓటు బ్యాంకుగా చూస్తోంది. హామీలు తప్ప వారికి న్యాయం జరగడం లేదు. పని స్థలాల్లో శ్రామిక మహిళల మీద లైంగిక దాడులు జరుగుతున్నాయి. కఠినమైన చట్టాలు చేయడం లేదు. రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. మే డే స్ఫూర్తితో శ్రామిక మహిళలు ఉద్యమాలను ఉధృతం చేయాలి.

నవతెలంగాణ

పిడికిలెత్తిన ధైర్య'మే' డే



నవతెలంగాణ-గోదావరిఖని:
శ్రమ దోపిడీని వ్యతిరేకిస్తూ.. యావత్ ప్రపంచ కార్మిక వర్గానికి స్ఫూర్తినిస్తూ.. వేసిన ముందడుగే మే డే. కొన్ని పురాణగాథలు కొన్ని రోజులను పండుగలుగా మార్చాయి. కొన్ని జాతీయ సంఘటనలు ఆ సమాజానికి పర్వదినాలు అవుతాయి. కొందరు మహనీయులు తమ రక్తాన్ని చిందించి కొన్ని రోజులను చారిత్రాత్మక రోజులుగా మారుస్తారు. అలా వచ్చిందే మే డే. మే డే ఒక చారిత్రాత్మక చైతన్య దినం. చికాగోలో ఉన్న కొంతమంది రక్తతర్పణం చేసి కేవలం తమ దేశంలో ఉండే కార్మిక వర్గానికే కాకుండా ప్రపంచానికంతటికీ కొత్త వెలుగును అందించారు. మే డే ప్రతి సంవత్సరం మే 1వ తేదీన జరుపుకునే చికాగో అమరవీరుల స్మారక దినం. ప్రజా సెలవు దినం. చాలా దేశాలలో మే దినం, అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా, కొన్ని దేశాలు కార్మిక దినోత్సవంతో ఏకీభవిస్తాయి. ఇవి అన్నీ కూడా కార్మికుల పోరాటం, కార్మికుల ఐక్యతను గుర్తిస్తాయి.

మే డే ఎలా మొదలైంది ?

19వ శతాబ్దంలో పారిశ్రామిక విప్లవం కారణంగా అమెరికా, యూరప్ దేశాలలో అనేక భారీ పరిశ్రమలు స్థాపించారు. ఈ పరిశ్రమల్లో పని చేసేందుకు అసంఖ్యాకంగా కార్మికుల అవసరం ఏర్పడింది. దీంతో ఉత్పత్తి రంగంలో పెట్టుబడిదారులు, కార్మికులు అని రెండు వర్గాలు ఏర్పడ్డాయి. పెట్టుబడిదారులు అధిక లాభాల కోసం కార్మికుల శ్రమను విచక్షణా రహితంగా దోచుకోవడం ప్రారంభించారు. కార్మికులతో కనీసం రోజుకు 16 గంటల నుండి 20 గంటలు పని చేయించేవారు. పైగా పనిచేసే కర్మాగారాలలో సరియైన గాలి, వెలుతురు ఉండేవి కావు. దాంతో కొందరు కార్మికులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయేవారు. కార్మికులు వారి శ్రమను మరచిపోవడానికి పాటలు పాడినా, విశ్రాంతి తీసుకున్నా యాజమానులు కోపోద్రిక్తులై ధిక్కార నేరం కింద జరిమానా విధించేవారు. ఈ దారుణ చర్యల నేపథ్యంలో కార్మికులలో క్రమక్రమంగా తిరుగుబాటు ధోరణి మొదలైంది. కార్మిక సంఘాల నిర్మాణం ప్రారంభించారు. 1764-1800 మధ్య బ్రిటన్‌లోనూ, ఆ తరువాత యూరప్‌లోనూ, ట్రేడ్ యూనియన్ల నిర్మాణం జరిగింది. అమెరికాలోని ఫిలడెల్ఫియా నగరంలో చైతన్యవంతులైన కార్మికులు 1806లో మెకానిక్స్ యూనియన్ పేరిట తొలి కార్మిక సంఘాన్ని స్థాపించుకొన్నారు. శ్రమను రోజుల తరబడి దోచుకున్న సమయంలో మేమూ మనుషులమే, మా శక్తికి కూడా పరిమితులుంటాయి. ఈ చాకిరీ మేం చేయలేమని, పని ముట్లు కింద పడేసి పనిగంటలు తగ్గించాలని, న్యాయబద్ధంగా వేతనాలు చెల్లించాలని (ట్రేడ్ యూనియన్లను గుర్తించాలని) కర్మాగారాలలో కనీస వసతులు కల్పించాలని, తగినంత విశ్రాంతినివ్వాలని కోరుతూ కార్మికవర్గం విప్లవ శంఖం పూరించింది. ఎనిమిది గంటల పని దినం కోసం పోరాడటం, చివరకు ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యజించడం కార్మిక వర్గ పోరాట పటిమకు నిదర్శనంగా నిలిచింది. ఆ పోరాట జ్వాలలు బ్రిటన్, ఫ్రాన్సు, జర్మనీ దేశాలకు, అమెరికాలోని మిగతా ప్రాంతాలకు వ్యాపించాయి. 1818లో ఇంగ్లాండులోని స్టాల్‌పోర్టు పట్టణంలో బట్టల ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులు సమ్మె ప్రారంభించారు. ప్రపంచ పరిశ్రమలకు ప్రసిద్ధిచెందిన లయాన్స్ పట్టణంలో 1831-1834లలో కార్మికులు తిరుగుబాటు చేశారు. ఆపై 1848లో ఫ్యాన్స్‌లో కూడా పోరాటాలు జరిగాయి. అదే సమయంలో జర్మనీ, ఆస్ట్రేలియాలోనూ కార్మికుల తిరుగుబాటు చేశారు. ఆపై 1848లో ప్యారిస్‌లో కూడా సమ్మెలు జరిగాయి. జర్మనీ, ఆస్ట్రేలియాలోనూ కార్మికుల తిరుగుబాట్లు జరిగాయి. 1886 మే1 అమెరికాలోని చికాగోలో 18 గంటల పని విధానం వ్యతిరేకిస్తూ 8 గంటల పని విధానం ప్రవేశపెట్టాలని కోరుతూ పోరాటానికి దిగారు. 24 గంటల్లో ఎనిమిది గంటలు పని, ఎనిమిది గంటలు విశ్రాంతి, ఇంకా ఎనిమిది గంటలు రిక్రియేషన్ అన్నవి ఈ పోరాటం ద్వారానే సాధించుకున్నారు.

ఆ ఉద్యమంలో అనేకమంది కార్మికులు అమరులై తమ హక్కును సాధించుకున్నారు. ఇది పారిశ్రామిక యుగం ఏర్పడిన తర్వాత కలిగిన మార్పు. వారి స్ఫూర్తికి గుర్తుగా జరుపుకొనేదే అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే. మన దేశంలో మొట్టమొదటి సారి మద్రాసు కేంద్రంగా 1923వ సంవత్సరం మే1వ తేదిన లేబర్ కిసాన్ పార్టీ ఆఫ్ హిందుస్థాన్ అధ్వర్యంలో మే డే ఉత్సవాలను నిర్వహించారు. అలా మొదలై నేడు ప్రపంచ వ్యాప్తంగా దాదాపు అన్ని దేశాల్లో మేడే ఉత్సవాలను ఘనంగా జరుపుతున్నారు.

స్ఫూర్తిని దెబ్బ తీస్తున్న పాలక ప్రభుత్వాలు...

137 ఏళ్ల క్రితం కార్మికులు సాగించిన చికాగో అమరవీరుల విరోచిత పోరాట స్ఫూర్తిని ప్రస్తుత పాలక ప్రభుత్వం దెబ్బతీస్తుంది. కేంద్రంలోని పాలనలో గత 9 ఏళ్ళుగా స్వదేశీ, విదేశీ పారిశ్రామికవేత్తల ఆర్థిక ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్లను తెచ్చారు. 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పొడిగించేందుకు, పని భారం పెంచేందుకు శ్రీకారం చుట్టారు. యూనియన్లు పెట్టుకునే హక్కును నిరాకరిస్తున్నారు. కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనాలివ్వాలన్న చట్టబద్ధ ఆదేశాలను, న్యాయస్థానాల తీర్పులను బుట్టదాఖలు చేస్తున్నారు. కార్మిక సంక్షేమం, సాంఘిక భద్రత, ఉపాధి, ఉద్యోగ రక్షణ లేకుండా పోతున్నాయి.

చికాగో అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలి

తుమ్మల రాజారెడ్డి, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షుడు



భారతదేశంలోని కోల్ ఇండియా సింగరేణి గని కార్మికులు, ప్రభుత్వ రంగ సంస్థలు సహజ సంపద బొగ్గు గనుల కార్మికుల హక్కుల రక్షణ కోసం చికాగో అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలి. మేడే పోరాటంలో సాధించుకున్న 8 గంటల పని దినం రక్షణ కోసం, బొగ్గు గని సింగరేణి కార్మికులు పోరాటలకు సిద్ధం కావాలి. సింగరేణి సంస్థ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు కొంగు బంగారంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలలో పాలుపంచుకుంటుంది. తెలంగాణ అభివృద్దిలో ప్రధాన భూమిక పోషిస్తున్న సింగరేణి గని కార్మికులు సింగరేణి ప్రభుత్వంగా సంస్థగా ఉండాలని సహజ సంపద అయిన బొగ్గు గనుల రక్షణ కోసం నిరంతరం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుతున్న పరిస్థితి ఉంది. తెలంగాణలోని సింగరేణి బొగ్గు బ్లాకులను ఈ వేలం వేయరాదని అవి సింగరేణి సంస్థగా కేటాయించాలని ఎంత పోరాటం చేసినప్పటికీ బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం పకతి సహజ సంపద అయిన బొగ్గు బ్లాకులను గుత్త పెట్టుబడిదారులకి కేటాయించాలని చూస్తుంది తప్ప ప్రభుత్వ రంగ సంస్థలైన సింగరేణి నిర్వీర్యం చేయాలనే ఆలోచనలో ఉంది. ఇలాంటి ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలతో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వంపై పోరాటం తప్ప మరో మార్గం లేదని సిఐటియు భావిస్తున్నది. అందుకోసం దేశంలోని బొగ్గు పరిశ్రమ సింగరేణి కార్మికుల కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాటానికి పిలుపునిస్తున్నది. సిఐటియు రానున్న 2024 పార్లమెంటు ఎన్నికలలో ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కార్మిక వ్యతిరేక చట్టాలను ప్రభుత్వ రంగ సంస్థలు బొగ్గు పరిశ్రమలు రక్షించుకోవాలని సింగరేణి గని కార్మికులకు పిలుపునిచ్చారు.

దేశాన్ని బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెడుతున్న మోడీ ప్రభుత్వం



వేల్పుల కుమారస్వామి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెండవ సారి అధికారంలోకి వచ్చిన మోడీ సర్కారు దేశం మొత్తాన్ని బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెడుతుంది. లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలకు నష్టాలను చూపుతూ, వాటిని పెట్టుబడి దారి శక్తుల వశం చేస్తుంది. ఇటు కార్మిక వర్గాన్ని అణిచివేసేందుకు పూర్తి కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకువస్తుంది. రైతాంగాన్ని కూడా కట్టుబానిసలుగా మార్చేందుకు నల్ల వ్యవసాయ చట్టాలను తీసుకు వచ్చింది. కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ప్రతి ఏటా లక్షల కోట్ల రాయితీలు కట్టబెడుతూ, ప్రజలపై భారాలు వేస్తున్నది. దేశం అంటే అంబానీ - ఆదానీల సొత్తుగా మార్చుతున్నది. గ్యాస్, పెట్రోల్, డీజిల్తో సహా అన్ని రకాల వస్తువుల ధరలు అడ్డగోలుగా పెంచింది. సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగాలు, రూ.15 లక్షలు పేదల బ్యాంకు ఖాతాల్లో జనం చేస్తామని, ధరలు తగ్గిస్తామని తదితర హామీలు అమలు చేయకుండా ప్రజల్ని మోసం చేసింది. తినే తిండిపైనా, కట్టే బట్టపైనా, ప్రతి వస్తువుపైన జిఎస్టీ విధించింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచింది. బడ్జెట్లో కోతలు పెట్టింది. కేంద్ర స్కీంలకు నిధులను తగ్గించింది. అత్యంత ప్రమాదకరమైన విద్యుత్ చట్టాన్ని అమలు చేయాలని మోడీ ప్రభుత్వం రాష్ట్రాలపై ఒత్తిడి చేస్తున్నది. ఈ పరిస్థితుల్లో కార్మికవర్గం తమ ఉద్యోగాలు, వేతనాలు, పని పరిస్థితులు, హక్కుల సాధనకు ప్రపంచ వ్యాప్తంగా పోరాడుతున్నది. ఈ నేపథ్యంలో సకల శ్రామిక పోరాటాలు, మేడే అమరవీరుల స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర కార్మిక వర్గం పోరాటాలకు మరింత పదును పెట్టాలి. గ్రామీణ ప్రాంతంలో రైతు, వ్యవసాయ కూలీలు, సామాన్య ప్రజలను కలుపుకుని ఐక్య పోరాటాలు నిర్వహించాలి. మే 1 నుండి 7 వరకు జరిగే వారోత్సవాలను విజయవంతం చేయాలని, మేడే స్ఫూర్తితో ఐక్య పోరాటాలకు అంకితం కావాలి.

బిజెపిని గద్దె దింపితేనే హక్కులను కాపాడుకోగలం...

జనక్ ప్రసాద్, ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్



కేంద్రంలో రెండవ సారి అధికారంలోకి వచ్చిన బిజెపిని గద్దె దింపితేనే హక్కులను కాపాడుకోగలం. ప్రధాని మోడీ ఎన్నికల ముందు ఒక విధంగా, గద్దెనెక్కాక మరో విధంగా వ్యవహరిస్తున్నారు. కార్మిక వర్గాన్ని పూర్తి అణిచి వేసి కట్టుబానిసలుగా మార్చేందుకు ప్రయత్నాలు జరుపుతున్నారు. ఇందులో భాగంగానే కార్మిక చట్టాలను కుదించి నాలుగు కార్మిక వ్యతిరేక కోడ్‌లను తీసుకు వచ్చారు. దీని వల్ల కార్మిక వర్గం పారిశ్రామిక వేత్తల ముందు కట్టుబానిసలుగా మారే ప్రమాదం ఉంది. అంతేకుండా పర్మినెంట్ కార్మిక వ్యవస్థ పూర్తిగా కనుమరుగు అయ్యే అవకాశం ఉంది. కార్మిక వ్యతిరేక, యాజమాన్య అనుకూల చట్టాలను కాంగ్రెస్, ఐఎన్‌టియుసి తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. పర్మినెంట్, కాంట్రాక్ట్, అసంఘటిత, వలస కార్మికుల ప్రయోజనాల కోసం, వారి హక్కుల పరిరక్షణ కోసం ఐఎన్టీయుసీ ఎల్లప్పుడు కట్టుబడి ఉంటుంది. కార్మిక వర్గం ఐఎన్‌టియుసి ఇచ్చే పోరాటాల పిలుపునకు సమాయత్తం అయ్యి ఉండాలి. చికాగో అమరుల స్ఫూర్తితో కార్మిక వర్గం పోరాడాలి.

కార్మిక వర్గాన్ని అణిచివేసే ప్రయత్నంలో మోడీ సర్కారు

పాతపల్లి ఎల్లయ్య, సంఘటిత, అసంఘటిత కార్మిక సంఘాల నాయకుడు



మోడీ సర్కారు కార్మిక వర్గాన్ని అణిచి వేసే ప్రయత్నంలో యాజమాన్యం అనుకూలంగా ఉండేలా కార్మిక చట్టాలను తీసుకువచ్చింది. దీని వల్ల కార్మిక వర్గం ప్రమాదంలో పడనుంది. మోడీ పాలన సంఘటిత, అసంఘటిత కార్మిక వర్గాలకు ఒరిగిందేమీ లేకపోగా, నష్టం చేకూరే పరిస్థితులు ఏర్పడ్డాయి. కార్మిక వర్గాలు అలాగే చూసుకుంటూ ఉంటే మోడీ ప్రభుత్వం కార్మిక వర్గాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తుంది. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు మినిమం వేజెస్ కష్టంతో కూడుకున్నటువంటి వేతనాలను చెల్లించాలి. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను రాబోయే కాలంలో వారిని పర్మినెంట్ చేయాలి. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు అనేక రోజులుగా కనీస వేతనాలు ఇవ్వకుండా అనేక ఇబ్బందులు చేస్తున్నారు. కాబట్టి వారికి వెంటనే కనీస వేతనాలు చెల్లించి, వారిని వెంటనే పర్మినెంట్ చేయాలి వీరికి పర్మినెంట్ కార్మికులకు ఉన్నటువంటి వేతనాలు ఇవ్వాలి. సంఘటిత అసంఘటిత కార్మికులు హమాలి కార్మికులు, రిక్షా కార్మికులు, గుమస్తాలకు పిఎఫ్, ఎస్ఐ కార్డుల సౌకర్యాలు కల్పించాలి .వారికి కూడా చట్టంలో కూడుకున్నటువంటి గౌరవ మినిమం వేజెస్ కల్పించాలి. హక్కుల సాధన కోసం చికాగో అమరుల స్ఫూర్తితో కార్మిక వర్గం సమర శంఖం పూరించాలి. హక్కులను కాపాడుకునేందుకు, అమలు చేసేందుకు వీరోచితంగా పోరాడేందుకు సిద్ధమవ్వాలి. కార్మిక వ్యతిరేక బిజెపి సర్కారు గద్దె దింపి హక్కులను కాపాడుకోవాలి.

సింగరేణి కార్మికుల సమస్యలపై పోరాటాలు...

మెండే శ్రీనివాస్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి



సింగరేణిలోని కార్మికుల సమస్యలపై సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ పోరాడుతుంది. సింగరేణిలో గోలేటి నుండి కొత్తగూడెం వరకు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన పోరుయాత్రలో కార్మిక సమస్యలతో పాటు కార్మిక కాలనీలలో పలు సమస్యలను నాయకుల దష్టికి తీసుకురాగా వాటిపై గత సంవత్సర కాలంగా దశలవారీగా ఆందోళనలు పోరాటాలు చేస్తూ రావడం జరిగింది. వాటికి యాజమాన్యం ఆలస్యంగా నైనా స్పందిస్తూ ఇటీవల నిధులు విడుదల చేయడం వలన కార్మిక కాలనీలకు లబ్ది చేకూరే అవకాశం ఉన్నది. అదేవిధంగా సింగరేణి వ్యాప్తంగా 30 నుండి 50 సంవత్సరాల క్రితం కట్టిన క్వార్టర్లన్నింటిని కూల్చివేసి కార్మికులకు డబుల్ బెడ్ రూమ్ కోటర్లు కట్టించి ఇవ్వాలి. సంస్థ ఆస్తులను పరీక్షించాలని చెబుతున్న ఉన్నత అధికారులు వేల క్వార్టర్లు, సింగరేణి స్థలాలు అన్యాక్రాంతమవుతున్న పట్టించుకోవడంలేదు. చివరకు కార్మికులకే క్వార్టర్లు దొరకని పరిస్థితి ఎదురవుతున్నందున సంస్థ ఆస్తులను యాజమాన్యమే పరిరక్షించాలి. 30 నుండి 40 సంవత్సరాలు సంస్థకు రక్తాన్ని ధారపోసిన కార్మికులకు రిటైర్డ్ నాటికి ఉండామంటే వచ్చిన డబ్బులతో ఇల్లు కూడా కట్టుకోలేని పరిస్థితి ఉన్నందున, మరియు క్వార్టర్లలో ఉంటున్నందుకు కరెంటు నీరు అద్దెకు ఆదాయపన్ను ఎక్కువగా కడుతున్నందున కార్మికులు ఉంటున్న క్వార్టర్లను కార్మికులకే ఇవ్వాలని, క్వార్టర్ లేని కార్మికులకు 250 గజాల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. ఖాళీ క్వార్టర్లు ఉంటే రిటైర్డ్ కార్మికులకు మరియు కాంట్రాక్టు కార్మికులకు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాం. ఇప్పటికైనా పై సమస్యలను యాజమాన్యం అర్థం చేసుకుని రానున్న బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో ఆమోదించి కార్మికుల సంక్షేమానికై యాజమాన్యం ఉన్నదని రుజువు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.



శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా వేలాది గొంతుకలు ఒకటైన కాలానికి నిలువెత్తు సాక్ష్యం మేడే. 8 గంటల పని విధానం, కార్మికుల హక్కుల సాధన కోసం ఎంతోమంది ప్రాణత్యాగం చేసిన మహోజ్వాల ఘట్టం. ఇంతటి మహత్తర పోరాటల ద్వారా సాధించుకున్న హక్కులను ఈరోజు ప్రభుత్వాలు కాలరాస్తున్నాయి. మేడే స్ఫూర్తితో కార్మికుల్లో చైతన్యాన్ని రగిలించి హక్కులను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉంది. కార్మిక లోకం ఒక్కటై ముందుకు నడవాలి.హక్కులు కాపాడుకోవాలి.

- తాండ్ర అంజయ్య, అధ్యక్షుడు- పెద్దపల్లి జిల్లా రైస్ మిల్ ఆపరేటర్ల యూనియన్ (సిఐటీయు)



చికాగో అమరులు గర్జించిన "ప్రపంచ కార్మికులారా ఏకంకండి" నినాదం అనే నినాదం విశ్వవ్యాప్తంగా మారుమోగి శ్రామికుల్లో చైతన్యాన్ని రగిలించింది. ఈ శ్రామిక వర్గ విజయానికి చిహ్నంగా 8 గంటల పని విధానం చట్టబద్ధం చేయబడింది. కానీ ఈరోజు యాజమాన్యాలు ఎనిమిది గంటలకంటే ఎక్కువ పని చేయిస్తున్నారు. కార్మిక హక్కులు హరించబడుతున్నాయి. కార్మిక లోకం ఒక్కటై ముందుకు నడవాలి. హక్కులు కాపాడుకోవాలి.

-పాక మహేష్, జిల్లా అధ్యక్షుడు- మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటీయు)

అనుదినం... జనస్వరం

జగిత్యాల

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక



08 పేజీలు | సోమవారం 01 మే 2023 | www.navatelangana.com

ఎందరో ప్రాణత్యాగాల ఫలితమే మేడే

మే 1.. అంటే 'మేడే'. దీన్ని అంతర్జాతీయ కార్మిక దినోత్సవం అని కూడా పిలుస్తారు. అమెరికాలో మాత్రం ప్రస్తుతం దీన్ని 'లాయల్టీ డే'గా వ్యవహరిస్తున్నారు. చాలా దేశాల్లో మే డేని సెలవు దినంగా పాటిస్తారు. ఈ కార్మిక దినోత్సవ ఆవిర్భావాన్ని ఏ ఒక్క దేశానికో, సంఘటనకో ముడిపెట్టలేం. కానీ 1886లో షికాగోలోని హే మార్కెట్‌లో జరిగిన కార్మికుల ప్రదర్శనే ఈ మేడే పుట్టుకకు పునాది వేసిందని చెబుతారు. కార్మికులకు ఎనిమిది గంటల పని విధానం గురించి నినదిస్తూ 1886, మే1న చాలామంది కార్మికులు పోరాటం చేపట్టారు. దానికి మద్దతుగా నాలుగు రోజుల తరవాత షికాగోలోని హే మార్కెట్‌లో చాలామంది ప్రదర్శన నిర్వహించారు. కానీ ఆ ప్రదర్శన ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో కొందరు కార్మికులు చనిపోయారు. ఆ సంఘటన అనంతరం 1889 నుంచి 1890 వరకు అనేక దేశాల్లో కార్మికుల ఉద్యమాలూ, నిరసన ప్రదర్శనలూ చోటుచేసుకున్నాయి. 1890, మే 1న బ్రిటన్‌లోని హైడ్ పార్క్‌లో చేపట్టిన ప్రదర్శనకు దాదాపు 3 లక్షల మంది కార్మికులు హాజరయ్యారు. రోజులో కేవలం 8 గంటలు మాత్రమే పనివేళలు ఉండాలన్నదే ఆ ప్రదర్శనలో పాల్గొన్న వారి ప్రధాన డిమాండ్‌గా మారింది. ఆ పైన అనేక యూరోపియన్ దేశాల్లో ఇదే నినాదంతో ప్రదర్శనలు జరిగాయి. క్రమంగా షికాగోలో జరిగిన కార్మిక ప్రదర్శనలో చనిపోయిన వారికి గుర్తుగా మే 1ని కార్మిక దినోత్సవంగా జరుపుకోవాలన్న ఒప్పందం కూడా కుదిరింది. ఆపై ప్రపంచవ్యాప్తంగా మే డే స్వరూపం మారుతూ వచ్చింది. అనేక దేశాల్లో ఆ రోజున కార్మికుల హక్కుల కోసం పోరాటాలూ, నిరసన ప్రదర్శనలూ మాత్రం ఆగలేదు.

- నవతెలంగాణ, కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి



మేడే పుట్టింది ఇక్కడే...

ఎనిమిది గంటల పని, ఎనిమిది గంటలు వినోదం, ఎనిమిది గంటలు విశ్రాంతి కావాలన్న బ్యానర్ పట్టుకుని 1858లో ఆస్ట్రేలియాలో ఎనిమిది గంటల పని దినోత్సవ మూడో వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న కార్మిక సంఘం అధ్యక్షుడు ఆర్ మిల్లర్, కార్యదర్శి జి. రావెన్‌స్క్రాఫ్ట్, సభ్యులు




పెండ్లికానుక.. ప్రసూతి సాయం!

- ప్రమాదవశాత్తు మరణానికి రూ.6.30లక్షలు
- సాధారణ మరణానికి రూ.1.30లక్షలు బీమా
- సంక్షేమపథకాలపై కార్మికులకు అవగాహన అవసరం
- ఇప్పటికే తమ శాఖతరుపున విస్తృత ప్రచారం
- ఈ శ్రమ్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,63,462 కార్మికుల నమోదు
- పారదర్శకంగా.. క్షేత్రస్థాయి పరిశీలనతోనే క్లెయిమ్‌ల పరిష్కారం
- కరీంనగర్ డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎస్.రమేష్‌బాబు

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

కార్మికుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమపథకాలను ప్రవేశపెట్టింది. ఇంట్లో ఆడపిల్ల పెండ్లి అయినా, అమ్మాయి ప్రసవించినా కార్మికశాఖ ఆధ్వర్యంలో సాయాన్ని అందిస్తోంది. కార్మికునికి గుర్తింపుకార్డు సహా ఏదేనా ప్రమాదశాత్తు మరణం సంభవిస్తే రూ.6.30లక్షలు, సాధారణ మరణమైతే రూ.1.30లక్షలు పరిహారం అందిస్తోంది. ఇవేగాకుండా ప్రమాదంలో పూర్తిఅంగవైకల్యం పొందినా రూ.30వేలు ఇస్తోంది. తాత్కాలిక వైద్య ఖర్చుల కింద కార్మికులకు మూన్నెళ్ల వరకు నెలవారీ సాయం అందిస్తోంది. ఇలాంటి అనేక కార్మిక సంక్షేమాలపై కార్మికులు అవగాహన పెంచుకుని కార్మికశాఖలో పేర్లు నమోదు చేసుకుంటే ప్రయోజనాలు వర్తిస్తాయని కరీంనగర్ డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎస్.రమేష బాబు చెబుతున్నారు. శ్రమ ఏవ జయతే నినాదంతో కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమాలు, ప్రయోజనాల గురించి 'నవతెలంగాణ' తీసుకొచ్చిన మే డే ప్రత్యేక సంచికలో వివరించారు.



నవతెలంగాణ : కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలేమిటి?

డీసీఎల్ : భవన నిర్మాణ రంగాల్లో పని చేసే వారికి ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పిస్తోంది. కార్మిక శాఖ అందిస్తున్న గుర్తింపు కార్డులు పొందాలి. ఐదేళ్ల కోసారి రెన్యూవల్ చేయించుకోవాలి. ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.6.30లక్షలు పరిహారం పొందవచ్చు. సాధారణ మరణం సంభవిస్తే రూ.1.30లక్షలు వస్తాయి. ఇంట్లో ఇద్దరు ఆడపిల్లల వివాహం సమయంలో రూ.30వేల చొప్పున పెండ్లికానుక వస్తుంది. ఆడ పిల్లల రెండు కాన్పుల వరకు ఒక్కొక్కరికీ రూ.30వేల చొప్పున ప్రసూతి సాయం అందు తుంది. ప్రమాదంలో అంగవైకల్యం సంభవిస్తే తీవ్రతను బట్టి రూ.5లక్షల వరకు వైద్య ఖర్చులు పొందే వెసులుబాటు ఉంది. ప్రమాదంలో గాయపడి తాత్కాలిక వైద్య ఖర్చుల కింద కార్మికులకు నెలకు రూ.4500 చొప్పున గరిష్టంగా రూ.13500 వరకు మూన్నెళ్లపాటు అందుతుంది. రోగాల బారిన పడి ఆస్పత్రిలో చేరి ఐదు రోజులపైబడి ఉంటే రోజుకు రూ.300 చొప్పున ఆర్థిక సాయమూ పొందవచ్చు.

నవతెలంగాణ : కొత్తగా గుర్తింపు కార్డులు ఎలా పొందాలి.?

డీసీఎల్ : కార్మికులు తమ ధ్రువీకరణ పత్రాలతో మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్, రేషన్‌కార్డులు, బ్యాంకు ఖాతా ప్రతులతో పాటు పాసుఫొటో ఇవ్వాలి. ఆ దరఖాస్తులు మాకు రాగానే వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి తరువాత గుర్తింపుకార్డులు జారీ చేస్తాం. తిరిగి ఆ కార్డులను మీ సేవ కేంద్రాల్లోనే పొందాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ శ్రమ్ ద్వారా నమోదు చేసుకున్న కార్మికులు 4,63,462 మంది ఉన్నారు. జిల్లాలవారీగా చూస్తే కరీంనగర్‌లో 1,59,951, జగిత్యాలలో 1,25,801, పెద్దపల్లిలో 1,13,376, రాజన్నసిరిసిల్ల జిల్లాలో 64,334 మంది నమోదు చేసుకున్నారు.

నవతెలంగాణ :కార్మికశాఖ ద్వారా ప్రయోజనాలు ఎలా పొందాలి.

డీసీఎల్ : గుర్తింపు పొందిన ఏడాది తరువాత పెండ్లికానుక, ప్రసూతి సాయం అందుతాయి. బీమాకు మాత్రం కార్డు పొందిన రోజు నుంచే అర్హులుగా పరిగణిస్తాము. వీటిని పొందాలంటే మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని, కావాల్సిన పత్రాలు సమర్పించాలి. అధికారులు వాటిని పరిశీలించి ప్రయోజనాలు మంజూరు చేస్తారు.

నవతెలంగాణ : బీమా క్లయిమ్స్‌లో పలు ఆరోపణలపై...

డీసీఎల్ : బీమా పొందడానికి మీసేవ కేంద్రాల్లోనే దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి ఆమోదం తెలుపగానే ప్రభుత్వం అందించే బీమా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయి. ఈ ప్రక్రియ పారదర్శకంగా క్షేత్రస్థాయిలో నిజనిర్ధారణ చేసుకున్నాకే క్లయిమ్‌లు లభిస్తాయి. ఇందులో ఎవరూ దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో పెండ్లికానుక, ప్రసూతిసాయం, ప్రమాద, సాధారణ మరణాలు, అంగవైకల్యం, ఆస్పత్రి ఖర్చుల కింద 3854 మంది లబ్ధిదారులకు రూ.15.40కోట్లు అందించాం.

నవతెలంగాణ: కార్మికశాఖ సంక్షేమాలకు అర్హులెవరు?.. అసంఘటిత రంగం పరిధిలోకి వచ్చేవారెవరు?

డీసీఎల్ : ఈ శ్రమ్‌లో చేరాంటే ప్రధానంగా కార్మికుడు 18 నుంచి 59 ఏండ్లలోపు వయసులో ఉండాలి. ఆదాయపన్ను పరిధిలోకి రాని వారు అయి ఉండాలి. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్), ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఈహెచ్ఎస్) సదుపాయం లేనివారై ఉండాలి. అసంఘటి తరంగ కార్మిక కేటగిరిల్లో తప్పనిసరిగా పని చేస్తూ ఉండాలి. వ్యవసాయ అనుబంధ చిన్నసన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, ఉద్యానవనాల పనివారు, నర్సరీలు, పాడి పరిశ్రమ, భవన నిర్మాణ రంగం, దాని అనుబంధ రంగాల్లో పని చేసేవారు (తాపీ, తవ్వకం, రాళ్లుకొట్టేపని, సెంట్రింగ్, రాడ్‌బెండింగ్, సానిటరీ, పేయింటర్, టైల్స్, ఎలక్ట్రీషియన్, వెల్డింగ్, ఇటుక, సున్నంబట్టీలు, రిగ్గర్లు, కాంక్రీట్‌మిక్సర్, బావులు తవ్వకం, పూడిక తీయడం, కర్రపని) వంటివారు అసంఘటిత రంగంలోకి వస్తారు. ఇంకా టెయిలరింగ్, ఎంబ్రాయిడరీ, డ్రెస్ మేకర్స్, ఆటోమొబైల్‌రంగంలోని డ్రైవర్లు, హెల్పర్లు, చేతివృత్తులవారిలో చేనేత, కమ్మరి, స్వర్ణకారులు, కమ్మరి, క్షౌరవృత్తి, బ్యూటీపార్లర్లలో పని చేసేవారు, చర్మకారులు, రజకులు కూడా ఈ రంగం కిందకే వస్తారు. ఇంకా సేవారంగంలోని ఇండ్లలోని పనిచేసేవారు, కొరియర్ బాయ్స్, ఇంటి వద్ద రోగులకు సేవలందించేవారూ ఉన్నారు. ఎస్ఆర్ఈజీ వర్కర్లు, ఆశావర్కర్లు, ఎన్‌హెచ్‌జీ స్వయం సహాక సంఘాలు, అంగన్‌వాడీలు, మిడ్ మే మీల్ వర్కర్లు, విద్యావాలంటీర్లు, గ్రామ, వార్డు వాలంటీర్లు, లోడింగ్, అన్‌లోడింగ్ హమామీలు, బేకరీ, పాల ఉత్పత్తులు, ఫాస్ట్ ఫుడ్ తయారీదారులు, వలస కార్మికులు ఈ అసంఘటిత రంగ కార్మికుల కిందనే ప్రభుత్వం జమ కడుతోంది.

నవతెలంగాణ: ఈ శ్రమ్ ఉద్దేశం, సదుపాయాలు ?

డీసీఎల్ : ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదయ్యే అసంఘటిత కార్మికులకు అందే ప్రధానమైన అంశాలు పరిశీలిస్తే.. ప్రతి కార్మికునికి 12 అంకెలు గల యూనివర్సిల్ ఐడెంటిఫికేషన్ నెంబర్ (యూఏఎన్)తో ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇస్తాము. ఈ కార్డు ఉంటేనే ప్రభుత్వం అందించే అన్ని రకాల సామాజిక భద్రత, పథకాలు, వివిధ సంక్షేమాలకు అర్హులుగా పరిగణించబడుతారు. ఈ పోర్డల్‌లో నమోదు చేసుకున్న ప్రతి కార్మికునికి ఒక ఏడాది పాటు ప్రధాన మంత్రి సురక్షబీమా యోజన (పీఎమ్ఎస్‌బీవై) కింద రూ.2లక్షలు బీమా మొత్తాన్ని ఏదైనా ప్రమాదంలో మరణం లేదా అంగవైకల్యం సంభవించినా అందిస్తాం. ఈ -శ్రమ్ డేటా బేస్ ఆధారంగానే ప్రభుత్వం అమలు చేసే పథకాలు, విధానాలను కార్మికులకు వర్తిస్తాయి.

కొత్త లేబర్‌కోడ్‌లతో లేబర్‌ఫ్యామిలీలో చీకటి రోజులు..

- వారంతపు సెలువలకు చెల్లుచీటి.. అదనపు పనికి వేతనం కరువు
- యజమాన్యాలకు ఫిక్స్డ్ టర్మ్ కాంట్రాక్టు కింద నిర్ధాక్షిణంగా తొలగించే హక్కు
- అవసరమైతే 8గంటల నుంచి 12గంటలూ పని చేయించుకునే అవకాశం
- ఎక్కడా అమలుకునోచని మహిళలకు సమానవేతం అంశం
- పాత చట్టాల్లోని హక్కులను కాలరస్తూ కొత్తచట్టాలకు రూపకల్పన

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

భారత ప్రభుత్వం జులై 01, 2022నుంచి కొత్త కార్మిక చట్టాలను అమలు చేస్తోంది. కార్మికుల కోసం కేటాయించిన మొత్తం 29 చట్టాలను కలిపి నాలుగు కోడ్‌లుగా మార్చింది. ఇందులో నాలుగు చట్టాలను వేతన కోడ్, 9 చట్టాలను సోషల్ సెక్యూరిటీ కోడ్, 13 చట్టాలను ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్, వర్కింగ్ కండిషన్స్ కోడ్, మరో 3 చట్టాలను ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్‌లుగా రూపొందించింది. ఈ కోడ్ ప్రయోజనాలు సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులందరికీ అందుతాయని ప్రభుత్వం చెబుతుండగా, వీటి వల్ల కార్మికులకు, ఉద్యోగులకు వాటిల్లే నష్టం ఎక్కువని కార్మిక సంఘాలు చెబుతున్న నేపథ్యంలో అసలు కొత్త చట్టాలు చెబుతున్న అంశాలను పరిశీలిద్దాం...

– కొత్త కార్మిక చట్టాల్లో ఉద్యోగుల పని గంటల్లో కూడా మార్పులు వచ్చాయి. ప్రస్తుతం చాలా సంస్థల్లో 8-9 పని గంటలు ఉండగా అవి 12 గంటల వరకు పెంచేశారు. ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్, వర్కింగ్ కండీషన్స్ కోడ్ లోని సెక్షన్ 25 (1) ఉద్యోగులు రోజుకు 8 గంటలు మించి పని చేయకూడదని పేర్కొంది. కానీ, 25(1) (బి) సంస్థలు ఉద్యోగులతో 12 గంటల వరకు ఉద్యోగులతో పని చేయించుకోవచ్చని చెబుతోంది.

– సంస్థ యజమానులు ఎటువంటి నిబంధనలూ లేకుండా పని గంటలను 12 గంటలకు మించి పెంచే విస్తత అధికారాలను ఇచ్చినట్టయింది. సెక్షన్ 26(1) ప్రకారం ఉద్యోగులు వారంలో ఆరు రోజులను మించి పని చేయ కూడదు. కానీ, సెక్షన్ 26(2) ఈ నిబంధనను సడలించే అధికారాన్ని ప్రభుత్వానికి ఇస్తోంది.

– వారాంతపు సెలవులు లభించని పక్షంలో ఆ ఉద్యోగికి రెండు నెలల లోపు అందుకు పరిహారంగా సెలవులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ అది ఎక్కడా అమలు కావడం లేదు.

– గతంలో నెలకు 50 గంటలు ఉండే ఓవర్ టైం (అదనపు పని గంటలు) కొత్త నిబంధనలు అమలులోకి వస్తే 125 గంటల వరకు పెరిగింది. ఇక్కడ ఓవర్ టైం పని





చేసేందుకు ఉద్యోగి అనుమతి కూడా అవసరం లేదు. కొత్త కోడ్‌లో ఓవర్ టైం ఎన్ని గంటలు చేయించుకోవచ్చనే విషయం పై ఎటువంటి నిబంధనలూ లేవు. అదీగాకుండా ఉద్యోగులతో అదనపు గంటలు పని చేయించుకునేందుకు సంస్థల యజమానులకు పూర్తి హక్కులను ఇస్తోంది. కనీసం ఓవర్ టైంకు చెల్లించాల్సిన వేతనాల గురించి కూడా ఈ కోడ్ నిర్వచించలేదు.

– కొత్త చట్టాలు మహిళలకు అన్ని రంగాల్లోనూ పని చేసే హక్కును కల్పిస్తున్నాయి. వారి అంగీకారంతో నైట్ షిఫ్టలలో కూడా పని చేయించుకోవచ్చు. అయితే, అందుకు తగిన భద్రత, పని ప్రదేశాల్లో సౌకర్యాలను సంస్థల యజమానులు కల్పించాల్సి ఉంటుంది. ఈ మార్పులన్నీ పెట్టుబడిదారీ వర్గాల ప్రయోజనాలు, కార్పొరేట్ల ఆదాయం పెంచుకోవడం కోసమే అని కార్మికసంఘాలు మండిపడు తున్నాయి.

– ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్ సెక్షన్ 2 ఫిక్స్డ్ టర్మ్ (నిర్ణీత కాల పరిమితి) ఉద్యోగాన్ని చట్టబద్ధం చేస్తుంది. సంస్థలు ఫిక్స్డ్ టర్మ్ కాంట్రాక్టు కింద ఉద్యోగులను నియమిం చుకోవచ్చు. ఈ పరిమితి పూర్తవ్వగానే, ఉద్యోగులకు ఎటువంటి నోటీసూ, పరిహారం ఇవ్వకుండా ఉద్యోగంలోంచి తొలగించవచ్చు. అయితే, వీరికి కూడా పర్మినెంట్‌ఉద్యోగుల మాదిరిగానే, ఒక సంవత్సరం పాటు విధులు నిర్వహిస్తే గ్రాట్యుటీకి అర్హత సంపాదిస్తారు. కాంట్రాక్టును 11 నెలలకే ఇస్తే, గ్రాట్యుటీ పొందేందుకు అర్హత ఉండదు. సంస్థల యజమానులు ఈ విధానాన్ని తమ ప్రయోజనానికి వాడుకుంటున్నాయి.

– సర్వీస్ రంగంలో ఉన్న ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ హెూమ్ చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 'ఈ చట్టాల అమలు కోసం ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం ప్రత్యేక లేబర్ చట్టాలను ఏర్పర్చుకోవడం కూడా ప్రధాన అడ్డంకిగా మారొచ్చు. కంపెనీలు రాష్ట్రాల పరిధిలోని షాప్స్ అండ్ కమర్షియల్ ఎస్టాబ్లిష్మెంట్స్ యాక్ట్ కింద రిజిస్టర్ చేసుకుంటే వాళ్లకు ఆ రాష్ట్ర సంబంధ చట్టాలు వర్తిస్తాయి. కంపెనీస్ యాక్ట్ కింద రిజిస్టర్ చేసుకున్న కంపెనీల్లోని ఉద్యోగులు రోజుకు 9 గంటలకు మించి పనిచేయడానికి వీల్లేదు'. అయినప్పటికీ 12గంటలు పని చేయించుకుంటున్న సంస్థలూ ఉన్నాయి.

–ఎనిమిది గంటల పని, ఎనిమిది గంటల నిద్ర, ఎనిమిది గంటల సామాజిక జీవనం' అనే విధానం గందరగోళంలో పడిపోయింది. ఇప్పుడు ఉద్యోగుల్లో అత్యధి కులకు పని ప్రదేశానికి వెళ్లి వచ్చేందుకే కనీసం నాలుగు గంటలు పడుతోందని, ఇలా పనిగంటలు 12కు పెరిగాయని చెప్పారు. గహవసతి, ఆరోగ్యం, విద్య విషయాల్లో సామాజిక భద్రత కొరవడటంతో ఉద్యోగమనేది వెట్టిచాకిరీగా మారిపోయింది.

ఈపీఎఫ్ ఓ భరోసా



- ఉద్యోగంలో ఉన్నప్పుడూ బీమా సౌకర్యాలు
- ఉద్యోగవిమరణ తరువాత భవిష్యనిధితో ఎన్నో ప్రయోజనాలు
- బ్యాంకులతో పోల్చితే ఈపీఎఫ్‌లోనే అధిక వడ్డీ
- అత్యవసరంపేరుతో అనవసరంగా విత్‌డ్రా చేసుకోవద్దు
- పీఎఫ్‌సభ్యుడు మరణిస్తే గరిష్టంగా రూ.7లక్షలవరకు బీమా
- అతనిపై ఆధారపడ్డ కుటుంబానికి జీవితకాలం పెన్షన్
- పిల్లలతే 25ఏండ్ల వయసువరకు.. అంగవైకల్యం ఉంటే జీవికాలమూ సాయం
- ఈపీఎఫ్‌ఓ రీజినల్ పీఎఫ్ కమిషనర్-2 ఎస్.తానయ్య

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఆయా సంస్థలు, పరిశ్రమల్లో పని చేసే ఉద్యోగులు, కార్మికులకు ప్రభుత్వం కల్పిస్తున్న ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) ఒక భరోసాగా నిలుస్తోంది. ఉద్యోగి, యజమాని కలిపి జమ చేసే పీఎఫ్‌లో కొంత పెన్షన్ కంట్రిబ్యూషన్ కింద పోగా మిగిలిన మొత్తం పీఎఫ్ ఖాతాలో జమవుతోంది. దీనిపై బ్యాంకుల కంటే అధికంగా వడ్డీ కల్పిస్తుండటంతో ఉద్యోగ విరమణానంతరం ఖాతాలో లభించే పెద్దమొత్తం ఎన్నో అవసరాలకు ఉపయోగపడుతోంది. ఈపీఎఫ్ అందించే పెన్షన్‌నూ భరోసాగా నిలుస్తోంది. ఈపీఎఫ్ ఫెన్షన్‌పరిమితిలో, ఖాతాలో జమ చేసే మొత్తం, జీతం పరిమితులను కొంత సడలించిన సంస్థ ఉద్యోగంలో ఉన్నప్పుడే అత్యవసరాల కోసం విత్‌డ్రా చేసుకునే అవకాశాలూ కల్పిస్తోంది. పీఎఫ్‌సభ్యుడు మరణిస్తే ఆయనపై ఆధారపడ్డ వారికీ బీమా సొమ్ము అందించడంతోపాటు కుటుంబసభ్యులకు జీవితకాల పెన్షన్ అందిస్తోంది. నేడు కార్మికుల దినోత్సవం 'మే డే' సందర్భంగా తీసుకొచ్చిన ప్రత్యేక సంచిక కోసం 'నవతెలంగాణ'కు ఈపీఎఫ్‌ఓ రీజినల్ పీఎఫ్‌కమిషనర్ ఎస్.తానయ్య ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ విశేషాలివి...

నవతెలంగాణ : ప్రస్తుతం పెన్షన్ విధానం తీరు ఎలా ఉంది.?

రీజినల్ పీఎఫ్ కమిషనర్ : వాస్తవానికి ఈపీఎఫ్ చట్టం 1952 ప్రకారం పెన్షన్ ఇచ్చే స్కీము ఏదీ లేదు. చట్ట సవరణల తర్వాత 1995 నుంచి ఈపీఎఫ్‌ఓ నేతత్వంలో ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ అమల్లోకి వచ్చింది. దీని కింద ప్రావిడెంట్ ఫండ్ (పిఎఫ్) కోసం యాజమాన్యాలు జమచేసే డిపాజిట్‌లో 8.33 శాతం పెన్షన్ నిధికి మళ్లిస్తున్నారు. ఉద్యోగి వేతనం (బేసిక్‌ం డీఏ)లో 12 శాతం చొప్పున ఉద్యోగులు, యాజమాన్యాలు ఈపీఎఫ్‌కు చెల్లిస్తుండగా, ఉద్యోగి వాటా మొత్తం అంతా పీఎఫ్ ఖాతాలోకి వెళుతుంది. యాజమాని చెల్లించిన 12 శాతంలో 3.67 శాతం ఈపీఎఫ్‌కు, 8.33 శాతం ఈపీఎస్‌కు మళ్లిస్తున్నారు. దీనికి తోడు ఉద్యోగి పెన్షన్ కోసం కేంద్ర ప్రభుత్వం 1.16 శాతం ఇస్తుంది. ఈపీఎస్ ప్రవేశపెట్టినపుడు గరిష్ఠ పెన్షన్‌బుల్ వేతనాన్ని నెలకు రూ. 5వేలుగా నిర్దేశించారు. తర్వాత దానిని రూ.6,500కు పెంచారు. 2014 సెప్టెంబర్ 1 నుంచి దీనిని రూ. 15,000 చేశారు. అంటే ఈ వేతనంపై పెన్షన్ నిధికి వెళ్లేది రూ.1,250 (8.33 శాతం). పెన్షన్‌బుల్ వేతనాన్ని మించి వాస్తవ బేసిక్ వేతనంపై ఈపీఎఫ్‌కు చెల్లించే ఆప్షన్‌ను ఉద్యోగి, యాజమాని కలిపి తీసుకునే సౌలభ్యం ఉంది.

నవతెలంగాణ : ఇప్పుడు పెన్షన్ ఎవరికొస్తున్నది? 2014లో జరిగిన సవరణలేంటి?

రీజినల్ పీఎఫ్ కమిషనర్ :కనీసం పదేండ్ల సర్వీసు ఉండి, 58 ఏండ్ల వయస్సు తర్వాత ఈపీఎస్ ఉద్యోగులకు సంస్థ పెన్షన్ ఇస్తున్నది. 50-57 సంవత్సరాల మధ్య ఉద్యోగాన్ని వదిలిపెట్టినవారు ముందు నుంచే పెన్షన్ కోరవచ్చు. కానీ అది తక్కువ ఉంటుంది. నెలవారీ పెన్షన్ లెక్కించే ఫార్ములా చూస్తే నెలవారీ పెన్షన్‌బుల్ సేలరీ, పెన్షన్‌బుల్ సర్వీసు 2014 సవరణల ప్రకారం ఉద్యోగం నుంచి వైదొలిగేముందు 60 నెలల సగటు వేతనాన్ని పెన్షన్‌బుల్‌గా లెక్కిస్తారు. పెన్షన్‌బుల్ వేతన పరిమితిని రూ.6,500 నుంచి రూ. 15,000కు పెంచడంతో పాటు.. ఈ పరిమితికి మించి కూడా యాజమాన్యాలతో కలిసి ఉద్యోగులు వారి వాస్తవ వేతనాల్లో 8.33 శాతాన్ని ఈపీఎస్‌కు చెల్లించడాన్ని అనుమతించారు. ఈ సవరించిన స్కీమ్‌కు ఆప్ట్ చేసుకునేందుకు 2014 సెప్టెంబర్ 1న ఈపీఎస్ సభ్యులందరికీ ఆరు నెలల గడువు ఇచ్చారు. ప్రాంతీయ ప్రావిడెంట్ కమిషనర్ మరో 6 నెలల గడువును పొడిగించేందుకు అనుమతించారు. వాస్తవ జీతంపై పెన్షన్ కోసం ఆప్ట్ చేసుకునే సభ్యులు పెన్షన్ ఫండ్‌కు అదనంగా వారి జీతం నుంచి 1.16 శాతం చెల్లించాలని నిర్దేశించారు. గడువులోపు వాస్తవ జీతంపై పెన్షన్‌ను ఆప్ట్ చేయనివారికి అప్పటికే పెన్షన్ ఫండ్‌కు అదనంగా చెల్లించిన మొత్తాన్ని ప్రావిడెంట్ ఫండ్ ఖాతాకు బదిలీ చేశారు.

నవతెలంగాణ : అధిక పెన్షన్ కోసం డిపాజిట్ చేయాలా?

రీజినల్ పీఎఫ్ కమిషనర్ : ఉద్యోగి ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలో అధికంగా జమచేసి ఉన్న/బదిలీ చేసిన మొత్తాన్ని పెన్షన్ ఖాతాలోకి మళ్లిస్తారు. ఉద్యోగి ఇంతకు ముందే పీఎఫ్‌ను విత్‌డ్రా చేసుకుని, అధిక పెన్షన్‌కు ఆప్ట్ చేస్తే, నిర్దేశిత మొత్తాన్ని పెన్షన్ ఖాతాలో డిపాజిట్ చేయమంటూ ఉద్యోగిని ఈపీఎఫ్‌ఓ కోరుతుంది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

నవతెలంగాణ: ఈపీఎఫ్ చట్టంలో పేరా 26(6) అంటే?

రీజినల్ పీఎఫ్ కమిషనర్ : సభ్యుడు చట్టబద్ద పరిమితికంటే ఈపీఎఫ్‌కు ఎక్కువ చెల్లించే ప్రొవిజన్‌ను ఈ పేరా కల్పిస్తుంది. ఇందుకోసం సభ్యుడు, యజమాన్యం ఉమ్మడిగా రాతపూర్వకంగా దరఖాస్తు సమర్పించాలి. దీనిని ఏపీఎఫ్‌సీ ర్యాంక్‌కు తక్కువకాని అధికారి ఆమోదించాలి.ఇందులో పేరా (26)6 కింద చట్టబద్ద పరిమితిని మించిన వాస్తవ జీతంపై ఈపీఎఫ్‌కు చెల్లింపులు చేస్తున్న తేదీని ప్రస్తావిస్తూ అధిక పెన్షన్ కోసం ఆప్ట్ చేయవచ్చు.

నవతెలంగాణ : ఇంతకూ ఎవరు ఇప్పుడు అధిక పెన్షన్‌కు ఆప్ట్ చేయవచ్చు?

రీజినల్ పీఎఫ్ కమిషనర్ : 2014 సెప్టెంబర్ 1కి ముందు సర్వీసు నుంచి వైదొలిగి, ఉద్యోగంలో ఉన్నపుడు అధిక పెన్షన్‌కు ఆప్ట్ చేసి, ఈపీఎఫ్‌వో ద్వారా తిరస్కరణకు గురైన వారు అర్హులుగా పరిగణిస్తాం. 2014 సెప్టెంబర్ 1న లేదా ఆ తర్వాత సర్వీసులో ఉండి, వాస్తవ జీతంపై ఈపీఎఫ్‌కు చెల్లింపులు జరుపుతూ, అధిక పెన్షన్‌కు ఆప్ట్ చేయనివారు చేసుకోవచ్చు. ఎటువంటి ఆప్షన్ ఎంపికచేయకుండా 2014 సెప్టెంబర్ 1కి ముందు సర్వీసు నుంచి వైదొలిగినవారు, చట్టబద్ధ వేతన పరిమితిపైనే ఈపీఎఫ్‌కు చెల్లింపులు చేస్తున్న వారు, 2014 సెప్టెంబర్ 1 తర్వాత సర్వీసులో చేరినవారు ఈ అధిక పెన్షన్ ఆప్షన్ ఎంచుకునేందుకు వీలు లేదు.

నవతెలంగాణ: పెన్షన్ ఎంతకాలం వస్తుంది?

రీజినల్ పీఎఫ్ కమిషనర్ : 10సంవత్సరాల సర్వీసు కలిగి 58 ఏండ్లు నిండిన ప్రతి కార్మికుడి నెలవారీ పింఛన్ రూ.వెయ్యికి తగ్గకుండా పొందవచ్చు. ఇలా ఈపీఎఫ్‌వో సభ్యుడి జీవితాంతం పెన్షన్ అందుతుంది. మరణాంతరం ఉద్యోగిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు వస్తుంది. ఇందులో భార్య/భర్త/పిల్లలు/ తల్లిదండ్రులు మాత్రమే అర్హులుగా ఉంటారు. ఇందులో పిల్లలకు 25ఏండ్లు వచ్చే వరకు అర్హులు. అంగవైకల్యం ఉన్న పిల్లలైతే జీవితాంతం పింఛన్ పొందవచ్చు. బీమా విషయానికొస్తే పని చేస్తూ చనిపోయిన వారి కుటుంబసభ్యులకు రూ.2.50లక్షల నుంచి రూ.7లక్షల వరకు బీమా వర్తిస్తుంది. కార్మికుడు ఇందుకు ఎటువంటి రుసుము కట్టాల్సిన పని లేదు.

నవతెలంగాణ : పీఎఫ్ విత్‌డ్రాకు అవకాశలేంటి?

రీజినల్ పీఎఫ్ కమిషనర్ : కార్మికులు తమ అత్యవసరాలైన పెండ్లి, పిల్లల ఉన్నత విద్య, భూమి లేదా ఇంటి కొనుగోలు, గృహనిర్మాణం, ఇంటి పునరుద్ధరణ వంటి అవసరాల కోసం ఐదేండ్లు సర్వీసు కలిగిన వారికి పీఎఫ్ నుంచి కొంత సొమ్మును ఉపసంహరణ చేసుకునే అవకాశం ఉంది. మెడికల్ ఎమర్జెన్సీకి అయితే ఎప్పుడైనా డబ్బులు తీసుకునే అవకాశం ఉంది. కార్మికులు గత కొవిడ్-19 తరువాత తమ ఖాతా నుంచి ఎక్కువగా రుణాలు, అడ్వాన్సులు పీఎఫ్ నుంచి విత్‌డ్రా చేసుకుంటున్నారు. దీని వల్ల తమ ఖాతాలో పీఎఫ్ తగ్గిపోవడం వల్ల ఇన్సూరెన్స్ రూ.7లక్షలు కోల్పోయే అవకాశం ఉంది. అత్యవసరాల కోసం పీఎఫ్ డబ్బులు విత్‌డ్రా చేసుకోకపోవడమే ఉత్తమం.

నవతెలంగాణ: ఈపీఎఫ్ ప్రయోజనాలపై అవగాహన ఎలా కల్పిస్తున్నారు?

రీజినల్ పీఎఫ్ కమిషనర్ : కార్మికుని అవగాహన కోసం భవిష్య నిధి సంస్థ ప్రతి నెలా 10వ తేదీన పింఛన్ అధాలత్ నిర్వహిస్తోంది. ప్రతి నెలా 27వ తేదీన 'నిధి ఆప్కే నికత్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో ప్రత్యేక విషయాలపై రోజంతా యజమానులకు, కార్మికులకు అవగాహన కల్పిస్తున్నాం. ఆన్‌లైన్ వెబినార్, సెమినార్లు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పీఎఫ్ చట్టం, పథకంలో ప్రయోజనాలను ఆన్‌లైన్ ద్వారా సంస్థ వెబ్‌సైట్‌లో పొందుపరిచాం. ప్రతి కార్మికుడు వాటిని చూడవచ్చు. ప్రింట్ కూడా తీసుకోవచ్చు.

శ్రమ నైజం మారిందా ?

ఎరుపు పేరింటే అదరి పడేటోళ్ళు
కార్మికుడు మారాడంటున్నారు
యూనిఫాం విడిచాడంటున్నారు
తెల్ల చొక్కాలో తడిచాడంటున్నారు
రూపంలో మార్పులు చూపుతూ
తన వర్గమే మారాడంటున్నారు
మార్క్సిజం మాసిందంటున్నారు

కష్టజీవులు సంపద పెంచడం తగ్గిందా?
జీతభత్యాల జమలో వాటా ధనం దక్కిందా?
ఉన్నా లేని జనాల అసమానతలు మాసాయా?
పెట్టుబడి ఫిరంగులు కురంగులయ్యాయా?

ఏది మారింది కనుక ఎరుపు మెరుపు మాసింది?
పిల్లి ఢీలా పడితే ఎలుక ఎకసెక్కాలాడినట్టు
చట్ట సభల సీట్లతో కొలిచి ఎరుపు ఘాటేదంటూ
కష్టజీవుల వాటాకు కొర్రీలు పెడితే పెట్టచ్చు
అలా పడినప్పుడు ఉబికే కంటి తడి తుడిచేదెవరు?
ఎకసెక్కాలకేం ఎన్నైనా ఆడొచ్చు
ఎర్ర జెండా అయి నిలిస్తే నిజం లోతు కనిపిస్తుంది
జనానికి దాని అవసరం తెలుస్తుంది ... ఏదీ లేని..
గాలి పడవలు వాటం తప్ప గమ్యం ఎరుగవుగా?

జీతాల కోతలతో శ్రమ వాటా గుంజేయడం
పనిలేని జీవులు ఆకలి, ఆత్మహత్యల
కాష్టంలో కమిలి కాలి బూడిదవడం
వాళ్ళ వాటా సంపదతో 'కార్పొ'ల ఆస్తులు పెంచుకోవడం
దాన్ని 'సొంత ఆస్తి' లెక్కలతో చుక్కల్లో నిలవడం
ఉన్న లేని జనాల వర్గ స్వరూపమేగా
కడుపు కాలిన నాడు వాటాల సమ పంపకానికి
వీధుల్లో కలబడటం వర్గ పోరాటమేగా
కళ్ళ ముందు కణిక నిప్పులు మండుతుండగా
నిర్వచనాలు మార్చి కళ్ళకు గంతలు తగిలించంకునే
గాంధారి పాతివ్రత్యపు గొప్పల గప్పాలు అవసరమా?

- ఉన్నం వెంకటేశ్వర్లు


























కార్మికుల సహకారంతో సంస్థ అభివృద్ధి

జగిత్యాల డిపో మేనేజర్ వెంకట నరసప్ప

కార్మికుల శ్రమ, ప్రయాణికుల ఆదరాభిమానలతో సంస్థ అభివృద్ధి చెందుతుంది. సంస్థలో కార్మికులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని చెబుతున్న జగిత్యాల డిపో మేనేజర్ వెంకట నరసప్పతో నవతెలంగాణ ముఖాముఖీ..



కార్మికుల సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషి?

ముందుగా ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మికులకు శుభాకాంక్షలు. జగిత్యాల డిపో పరిధిలో వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయడం జరిగింది. అందులో పురుషుల నుంచి ఒకరు, మహిళల నుంచి ఒకరిని తీసుకోవడం జరుగింది. నెలకు 2 సార్లు సమావేశం నిర్వహిస్తాం. అందులో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

కార్మికుల, సిబ్బంది నుంచి ఫిర్యాదులను ఏ విధంగా స్వీకరిస్తారు.?

డిపో పరిధిలో సమస్యల స్వీకరణ కోసం బాక్స్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి 15 రోజులకు ఒకసారి వాటిని పరిశీలించి పరిష్కరిస్తాం.

సిబ్బందికి విధులను ఏ విధంగా కేటాయిస్తారు.?

ప్రోటెన్షన్ చార్ట్ ప్రకారం విధులను కేటాయిస్తాం.

మీ స్థాయిలో పరిష్కరించలేని **సమస్యలను ఏ విధంగా పరిష్కరిస్తారు. ?**

రాష్ట్ర స్థాయిలో వెల్ఫేర్ బోర్డు మెంబర్ సమావేశం ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తారు. ఇక్కడ పరిష్కారం కాని సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

జగిత్యాల డిపో పరిధిలో ఎన్ని బస్సులు నడుపుతున్నారు..?

జగిత్యాల డిపో పరిధిలో 56 ప్రయివేట్ బస్సులు ఉన్నాయి. అందులో 21 ఎక్స్‌ప్రెస్, 35 పల్లె వెలుగు బస్సులు వివిధ మార్గాలలో నడుస్తున్నాయి. 70 ప్రభుత్వ బస్సులలో 4 ఏసీ, 20 సూపర్ లగ్జరీ, 19 ఎక్స్ ప్రెస్, 27 పల్లె వెలుగు బస్సులు నడుస్తున్నాయి.

గతంలో కొన్ని రూట్లలో రాత్రి బస్సులు (నైట్ హాల్ట్) నడిపేవారు, ప్రస్తుతం ఆ బస్సులు నడవడం లేదు?

సిబ్బంది కొరతతో, బస్సుల సమస్యలతో నైట్ హాల్ట్ సర్వీసులను రద్దు చేయడం జరిగింది. ఆదాయం గల రూట్లలో బస్సులు నడిపేందుకు ప్రణాళికలను సిద్ధం చేసినాం, త్వరలోనే నడుపుతాం.

ఆదాయం, ప్రయాణికుల పెంపుదలకు మీరు తీసుకుంటున్న చర్యలు.

ప్రయాణికులు చేయెత్తిన చోట బస్సు ఆపేందుకు, వారు కోరిన ప్రదేశంలో దింపేందుకు, వారితో మర్యాదగా ప్రవర్తించాలని సిబ్బందికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఇప్పటికే సిబ్బందికి పలు మార్లు ట్రైనింగ్, సమావేశాలు కూడా నిర్వహించాం. దీని వల్ల సంబంధిత బస్సుకు ఆదాయం కూడా పెరుగుతుంది. బస్సులు సమయానుకూలంగా ప్రయాణించేలా తగు చర్యలు తీసుకోవడం జరిగింది. ప్రయాణికులకు ఏవేని ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తేవాలని కోరారు.



వలస కార్మికులకు అమలు కాని చట్టాలు

నవతెలంగాణ-వెల్గటూర్

ఉన్నచోట ఉపాధి లేక పొట్ట కూటి కోసం కడుపు చేత పట్టుకుని పని కోసం వేల కిలోమీటర్లు వచ్చిన వలస కార్మికులు కష్టాల జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వాల నుంచి ఎలాంటి సాయం అందక, కార్మిక చట్టాలు అమలుకు నోచుకోక తీవ్ర దుర్భిక్షంలో ఉన్నారు. రెక్కడితే గాని డొక్కాడని కార్మికులు కష్టాల నడుమ కన్నీళ్ల జీవనం సాగిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసిన నూతన జిల్లాలోనైనా కార్మికశాఖ మేల్కోని, వలస కార్మికులకు చట్టాన్ని (మైగ్రేషన్ యాక్టు) అమలు చేసి న్యాయం చేస్తారా అన్న ఆశతో కార్మికులు ఎదురుచూస్తున్నారు. మండలం వివిధ పరిశ్రమల్లో వేలాది మంది వలస కార్మికులు పని చేస్తున్నారు. పాలకులు, ప్రభుత్వాల నిర్లక్ష్యంతో వీరందరూ కార్మిక సంక్షేమానికి దూరంగా జీవనం సాగిస్తున్న వలస కార్మికులు పడుతున్న ఇబ్బందులపై నవతెలంగాణ ప్రత్యేక కథనం...

జగిత్యాల జిల్లాలోని ఉమ్మడి వెల్గటూర్ మండలంలోని అంబరిపేట, సంకెనపల్లి, కిషన్‌రావుపేట, ఎండపల్లి గుళ్లకోట, చర్లపల్లి జగదేవుపేట తదితర ప్రాంతలలో ఇండస్ట్రీస్‌తో పాటు వివిధ రకాల కర్మాగారలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో సుమారు 200కి పైగా వివిధ పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో ముఖ్యంగా క్రషర్‌లు, ఇండస్ట్రీస్, డంబర్ ప్లాంట్, కరెంట్ పోల్స్ కర్మాగారం లాంటి పరిశ్రమలతో పాటు ఇటుక బట్టీలలో ఎక్కువశాతం ఒరిస్సా, కలకత్తా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్ వివిధ రాష్ట్రాలకు చెందిన వందలాది మంది వలస కార్మికులు పొట్టకూటి కోసం పరిశ్రమల్లో కార్మికులుగా పని చేస్తున్నారు. కార్మిక చట్టం ప్రకారం కార్మికశాఖ అధికారులు వలస కార్మిక చట్టాన్ని అనుసరించి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికుల వివరాలన్నింటినీ సేకరించాల్సి ఉంది. అయితే ఈ ప్రాంతంలో వలస కార్మిక చట్టం అమలు జరగలేదు. వలస కార్మికులు ఎంతమంది, ఏ పరిశ్రమలో పని చేస్తున్నారు.? ఎక్కడ నివాసముంటున్నారు.? వారికి జీతం ఎంత ఇస్తున్నారు..? తదితర వివరాలు సైతం కార్మిక శాఖ వద్ద లేకపోవడం గమనార్హం. కార్మిక గుత్తేదారు నుంచి కార్మికులను దిగుమతి చేసుకుని ఆ కార్మికులకు కనీస మౌలిక సౌకర్యాలు సైతం కల్పించకుండా ఒకే గదిలో 5 నుంచి 10 మందిని ఉంచి వారి శ్రమను గుత్తేదారులు, పారిశ్రామికవేత్తలు దోచుకుంటున్నారు. నిబంధనల మేరకు 8 గంటల పని విధానం ఉంటే ఇక్కడ 12 గంటలు పనిచేయించుకుంటున్నారు. వేతనాలు సైతం తక్కువగానే ఇస్తున్నారు. ఒక్క రోజు విధులకు హాజరు కాకపోయినా ఆ రోజు వేతనంలో కోత విధిస్తున్నారు. కనీసం వారు నివాసం ఉండడానికి అయినా మంచి గదులు కేటాయిస్తారా అంటే అదీ లేదు. ఆయా పరిశ్రమల యాజమాన్యాలు కేటాయించిన చిన్న గదుల్లో పదుల సంఖ్యలో వలస కార్మికులు బిక్కుబిక్కుమంటూ జీవనం చేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ ప్రాంతంలో వలస కార్మికులు ఇంత దుర్భరంగా జీవిస్తున్నప్పటికీ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన కార్మిక శాఖ మాత్రం నిద్రమత్తులో నుంచి బయటకు రావడం లేదు. కనీసం నూతన జిల్లా కార్మిక శాఖ అధికారులైన ఈ పరిశ్రమలపై తనిఖీలు నిర్వంహించి, వలస కార్మిక చట్టాన్ని అమలు చేసి, వలస కార్మికుల వివరాలను సేకరించి, వారికి కార్మిక చట్టం ప్రకారం అందాల్సిన సౌకర్యాలు అందిస్తారన్న ఆశతో కార్మికులు ఎదురుచూస్తున్నారు.


వలస కార్మిక చట్టాన్ని అమలు చేయాలి

మండలంలో వివిధ రంగాలలో కార్మిక చట్టాన్ని అమలు చేయాలి. వలస కార్మికుల నివాస ప్రాంతాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఆయా పరిశ్రమల యాజమాన్యాలు వారి నివాస స్థలాలలో పారిశుధ్యాన్ని మెరుగు పరచాల్సిన అవసరం ఉంది. ప్రతి నెలా ప్రత్యేక వైద్యులతో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి వారికి మెరుగైన వైద్య సేవలుఅందించేలా చేయాలి. కార్మికుల వివరాలను వెంటనే సేకరించాలి. విధులు నిర్వహిస్తున్న వలస కార్మికులకు ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉంది. లేని పక్షంలో వలస కార్మిక సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.


-ముడుగం, సిఐటియు జిల్లా నాయకులు













కార్మికునిపై కేంద్రం గొడ్డలిపెట్టు..

- కార్పొరేట్ల కోసం కార్మికచట్టాలను సరళించిన బీజేపీ సర్కార్
- ప్రాణత్యాగకోర్చి సాధించుకున్న హక్కులను కాలరాసిన వైనం
- 44 కార్మికచట్టాలకు చెల్లుచీటి ఇచ్చి.. 4కోడ్‌లుగా మార్చిన వైనం
- కార్మికుని బానిసలా మార్చేలా 8గంటల పనిదినాన్ని 12గంటలకు పెంపు
- సమ్మె చేసే హక్కులేదు.. యూనిట్లు పెట్టుకునే అనుమతుల్లేవ్!
- ప్రమాదం జరిగితే కార్మికుడిదే బాధ్యత.. అవసరమైతే జరిమానా, జైలు శిక్షనే!
- బ్రిటిష్‌కాలం నాటి అమానవీయ విధానాలు, బానిసచట్టాలు తెచ్చిన కేంద్రం

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

పెరుగుతున్న కార్పొరేటీకరణ, విదేశీ సంస్థల ఉద్యోగాలు, పెట్టుబడుల నేపథ్యంలో సరళమైన కార్మిక చట్టాలను తీసుకొస్తున్నామని కేంద్రంలోని బీజేపీ సర్కారు 44 లేబర్‌చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చిన తీరు కార్మికుల హక్కులపై గొడ్డలిపెట్టుగా మారింది. బ్రిటిష్‌కాలం నాటి అమానవీయ విధానాలు, బానిసచట్టాలకు రూపం తెచ్చి కార్మికుని శ్రమను దోచుకునేలా కార్పొరేట్లకు రెడ్‌కార్పెట్ వేసింది. 01 జులై 2022నుంచి కొత్త కార్మిక చట్టాలను తీసుకొచ్చి మల్టీ నేషనల్, కార్పొరేట్ సంస్థకు ఊరట లభించేదిగా చేసి కార్మికుడిని బానిసలా మార్చింది. 8గంటల పనిదినాలను 12గంటలకు పెంచడంతో మూడు షిఫ్టుల్లో నడిచే పరిశ్రమలు రెండు షిఫ్టులకే కుదించాయి. ఒక షిఫ్టు కార్మికు ఉపాధి పోవడమేకాకుండా ఉన్న వారి శ్రమ దోపిడికి గురవుతోంది. ఇదేంటని ప్రశ్నించేందుకు యూనియన్లు పెట్టుకునే హక్కును కాలరాసింది. సమ్మెచేసే హక్కును తొక్కిపెట్టింది. ఇదంతా ఒకెత్తయితే పరిశ్రమలో ప్రమాదం జరిగితే అందుకు కార్మికుడినే బాధ్యుని చేసేలా తీసుకొచ్చిన కొత్త చట్టాలు అవసరమైతే ప్రమాదానికి కారణమైన లేబర్‌కు జైలు శిక్ష, జరిమానా విధించవచ్చని చెబుతుండటం గమనార్హం.

స్వాతంత్ర్యానంతరం కార్మిక సంక్షేమమే ధ్యేయంగా రూపొందించుకొన్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తిరగరాసింది. బ్రిటిష్ కాలం నాటి అమానవీయ విధానాలను, బానిస చట్టాలను మళ్లీ తెర మీదకు తెచ్చింది. 44 కార్మిక చట్టాలను ఏకపక్షంగా రద్దుచేసి నాలుగు లేబర్‌కోడ్‌లు రూపొందించింది. వేతనాల కోడ్, సామాజిక భద్రత కోడ్, పారిశ్రామిక సంబంధాల కోడ్, భద్రత-ఆరోగ్యం- పని పరిస్థితులకు సంబంధించిన కోడ్ పేరుతో నాలుగు కోడ్‌లను రూపొందించిన మోదీ ప్రభుత్వం గెజిట్ విడుదలకు సమాయత్తమవుతున్నది. లేబర్ కోడ్‌ల ద్వారా కేంద్రం 44 హక్కులను కాలరాయనున్నదని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి.

కార్మికుల పాలిట శాపం పారిశ్రామిక సంబంధాల కోడ్

పారిశ్రామిక సంబంధాల కోడ్ కార్మిక హక్కులను కాలరాస్తోందని కార్మికసంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కార్మికుల డిమాండ్లపై సమ్మె నోటీసు ఇవ్వడానికి ఇప్పటివరకు ఉన్న 14 రోజుల వ్యవధిని కేంద్రం 60 రోజులకు పెంచింది. సమ్మెకు వ్యతిరేకంగా ట్రిబ్యునల్‌కు వెళ్లే అవకాశాన్ని యాజమాన్యాలకు కల్పించింది. దీంతో కేసు ట్రిబ్యునల్‌లో ఉన్నంత కాలం కార్మికులు సమ్మెకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది. గతంలో 10 కంటే ఎక్కువ మంది పనిచేసే సంస్థలను పరిశ్రమలుగా గుర్తించేవారు. ఇప్పుడు ఆ సంఖ్యను 20కి పెంచారు. విద్యుత్తు సంస్థల్లో 40కి పెంచారు. ఫలితంగా చిన్న పరిశ్రమల్లోని కార్మికులు చట్టపరంగా ఆరోగ్యం, భద్రత, సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. పాత చట్టం ప్రకారం యూనియన్లను యాజమాన్యం గుర్తించాలన్న నిబంధనలేదు. ఏ సంఘానికైనా కార్మికుల డిమాండ్లపై యాజమాన్యంతో సంప్రదింపులు జరిపే అవకాశం ఉండేది. కొత్త నిబంధనల ప్రకారం పరిశ్రమల్లోని కార్మికుల్లో 51 శాతం లేదా అంతకంటే ఎక్కువ సభ్యత్వం ఉన్న సంఘాన్నే గుర్తింపు సంఘంగా పరిగణిస్తారు. ఇతర సంఘాలను యాజమాన్యాలు పట్టించుకోవు.



పరిశ్రమల్లో ప్రమాదాలకు కార్మికులదే బాధ్యత

భద్రత-ఆరోగ్యం- పని పరిస్థితులకు సంబంధించిన కోడ్‌లో ఫ్యాక్టరీల చట్టం, గనుల చట్టం, డాక్ వర్కర్, బిల్డింగ్, ఇతర నిర్మాణ కార్మికుల ఉపాధి, పని నియమాల క్రమబద్ధీకరణ, సినీ వర్కర్స్ అండ్ సినిమా థియేటర్స్ వర్కర్స్ యాక్టు తదితర వాటికి సంబంధించి మొత్తం 13 పాత చట్టాలను పొందుపరిచారు. పాతచట్టాల ప్రకారం కార్మికులకు తాము పనిచేస్తున్న పరిశ్రమల్లోని ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని పనిభద్రత, ఆరోగ్యం, సంక్షేమ పథకాలు అమలయ్యేవి. ఇప్పుడు చేస్తున్న పనితో సంబంధం లేకుండా అన్ని రంగాల కార్మికులకు ఒకే గూడు కిందకు తీసుకొచ్చారు. గత చట్టాల ప్రకారం పరిశ్రమలో ఏదైనా ప్రమాదం జరిగితే యాజమాన్యం బాధ్యత వహించాల్సి ఉంటుంది. కొత్త కోడ్ ప్రకారం ప్రమాదాలకు కార్మికులను కూడా బాధ్యులను చేస్తారు. ప్రమాదాలకు కార్మికుడు కారణమని నిర్ధారిస్తే రూ.10 వేల జరిమానా, జైలుశిక్ష విధిస్తారు.

సామాజిక భద్రత హుళక్కే

సామాజిక భద్రత కోడ్-2020లో పీఎఫ్, ఈఎస్ఐ, పరిహారం, ఎంప్లాయ్‌మెంట్ ఎక్సేంజ్, మెటర్నిటీ బెనిఫిట్, గ్రా ట్యూటీ, వెల్ఫేర్, అసంఘటిత కార్మికులు తదితర అంశాలకు సంబంధించిన తొమ్మిది పాత చట్టాలను చేర్చారు. ఈ కోడ్ నిబంధనలు నిర్మాణరంగ కార్మికుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని కార్మిక సంఘాలు చెబుతున్నాయి.

12 గంటల పని.. ఓటీలు ఉండవు

బీజేపీకి ఉన్న సంఖ్యా బలంతో వేతనాల కోడ్‌కు 2019లో పార్లమెంటు ఆమోదం లభించింది. ఇందులో వేతనాల చెల్లింపు, కనీస వేతనం, బోనస్, సమాన వేతనాల చట్టం వంటి నాలుగు పాత చట్టాలను చేర్చారు. ఎన్నో పోరాటాలు, ప్రాణత్యాగాల ఫలితంగా వచ్చిన 8 గంటల పని విధానానికి మోదీ ప్రభుత్వం చెల్లుచీటి ఇచ్చింది. యాజమాన్యం కోరితే 10 నుంచి 12 గంటల పాటు పనిచేయాలని, అందుకు ఎలాంటి ఓటీ (ఓవర్ టైమ్) వేతనాలనూ చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పింది. దీంతో చాలా పరిశ్రమల్లో మూడు షిఫ్టుల విధానం కనుమరుగై రెండు షిఫ్టులే మిగులుతున్నాయి. ఒక షిఫ్ట్‌లో పనిచేసే కార్మికులకు ఉపాధి పోవడం ఖాయం.

పెట్టుబడుదారుల కోసం కార్మికుల హక్కుల కాలరాత

చికాగో త్యాగాలతో కార్మిక ఉద్యమం కనీస విలువలను చట్టబద్ధం చేసుకోగలిగింది. ఇట్లాంటి అనేక త్యాగాలతో ప్రపంచ కార్మిక ఉద్యమం తన కాళ్లపై తన నిలబడగలిగి మానవాళి విముక్తి కోసం తన శక్తిని ధారపోస్తు వచ్చింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడ్డ సంక్షోభంతో కార్మిక శక్తి ఒత్తిడి మేరకు ప్రపంచ రాజ్యాలు సంక్షేమాన్ని తమ ప్రాధాన్యతగా ఎంచుకోవాల్సి వచ్చింది. ఫలితంగానే సంక్షేమ రాజ్య భావన బలపడి బలహీనుడికి బతకగలిగే అవకాశం కొద్ది మేరకైనా దక్కగలిగింది. యుఎస్ఎస్ఆర్ పతనం తర్వాత కార్మిక ఉద్యమాన్ని విధ్వంసం చేయగలిగే వాతావరణాన్ని ప్రపంచ పెట్టుబడిదారీ మార్కెట్ శక్తులు రూపొందించుకున్నాయి అంతకుముందే ప్రారంభమైన నూతన ఆర్థిక విధానాలు ఇందుకు దోహదం చేశాయి కూడా.

1977 నుంచి ప్రారంభమైన ఆర్థిక సంస్కరణలు రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ గారడి పాలనలో పెట్టుబడిదారీ విధానం మరింత బలోపేతమై అంతిమంగా పెట్టుబడిని కూడా మింగే కార్పొరేట్ ఆర్థిక వ్యవస్థ దేశంలో పాదుకొల్పబడింది. ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా దేశంలో ఆటవిక నిర్వహణ రాకుండా ఉండేందుకు ఆర్థిక వ్యవస్థను ప్రజాసంక్షేమాన్ని సమన్వయం చేసుకునే అద్భుతమైన కార్మిక చట్టాల రూపకల్పన 1926 నుంచే(ట్రేడ్ యూనియన్‌లో ఏర్పాటు చట్టం) ప్రారంభమైంది. ఇది క్రమక్రమంగా కార్మిక సంక్షేమం విస్తృతి చెందింది. 1200 సెక్షన్లతో 44 కార్మిక చట్టాలతో పెట్టుబడిని ప్రభుత్వాన్ని నియంత్రిస్తూ వచ్చింది. కానీ ఈ చట్టాలు ఆశ్రిత పెట్టుబడి లేదా కార్పొరేట్ ఆర్థిక వ్యవస్థకు ప్రతికూలంగా ఉండడంతో కార్పొరేట్ శక్తులు మతసహచర్యాన్ని ఆశ్రయించాయి. తమకు అనుకూలమైన వ్యక్తిని ప్రధానిగా ప్రతిష్టింప చేసుకున్నాయి.

ఈ చట్టాలే కార్మికులను సంరక్షించుకున్నాయి వీటి రూపకల్పనలో మహనీయుడు అంబేద్కర్ విశేషమైన కృషి చేశారు. నేటి ప్రధాని మోడీ అదే అంబేడ్కర్ కార్మిక ఆలోచనలను వక్రీకరించి తన వారికి దోచిపెట్టడానికి 44 కార్మిక చట్టాలను 29 చట్టాలకు కుదించి 12 చట్టాలను పూర్తిగా రద్దుచేసి నాలుగు కోడ్ లుగా విభజించారు. అంబేద్కర్ కలల సాధన కోసం, నూతన భారతదేశం కోసమని 'రెడ్ టేపిజాన్ని" ఆపుతానని అనడమే కాక శ్రమ యోగి రాష్ట్ర యోగి అనే నూతన పేర్లతో కార్మికులకు పేరు పెట్టి నయవంచనకు గురి చేశాడు. ఇప్పటికే తన విధానాలతో 8 కోట్ల సంఘటిత కార్మిక శక్తిని 5 కోట్లకు కుదించేసినాడు. దీనితో దేశంలో 50 కోట్లకు అసంఘటిత కార్మికులు పెరిగిపోయినారు. భద్రత లేని కనీస బతుకుదెరువు లేని అసంఘటిత కార్మికులకు ఆరోగ్య భీమా లాంటి ఎరలు వేసి మొత్తం ఆర్థిక వ్యవస్థ ఫలాలను తన ఇద్దరు మిత్రులైన ఆదాని అంబానీలకు కట్టబెడుతున్నాడు. ఈ క్రమంలో మారిన కార్మిక చట్టాల నేపథ్యంలో దేశానికి తీవ్రమైన నష్టాన్ని ఈ పాలకులు కల్పించారు. పనిగంటలను పెంచడంతో కార్మికులకు మరింత ఒత్తిడి పెరిగి పెద్ద ఎత్తున మరణాలు సంభవిస్తున్నాయని కొన్ని దేశాల అనుభవాలు సాటి చెబుతున్నాయి. 2016 ఒక్క సంవత్సరంలోనే 7,60,000 మంది పని గంటల పెంపుదల కారణంతో అసహజంగా మరణించారని 'ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ' రిపోర్టులు చెబుతున్నాయి. అంతే మేరకు ఈ పని గంటలు ఉపయోగించుకున్న పారిశ్రామిక సంస్థలు కార్పొరేట్ సంస్థలు గా మారిపోయినాయి.

సమ్మె హక్కును ను జీవించే హక్కులో భాగంగా పొందిన కార్మికులు ఈ కొత్త చట్టాలతో కోల్పోతున్నారు.15 రోజుల ముందు ఇచ్చే సమ్మె నోటీసు కాస్త 60 రోజుల ముందుగా మారింది.ఏడుగురితో కూడా యూనియన్ ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని మార్చివేసి దేశ కార్మిక సంఘాల త్యాగాల చరిత్రను 1926 నాటికి తీసుకుపోయారు. యూనియన్ లో 1/3 బయటివారు ఉండడం వల్ల కార్మికులు యజమానులకు భయపడకుండా అన్యాయం జరిగినప్పుడు నిలదీసే అవకాశం ఉండేది. అది నేడు లేబర్ కోడ్‌ల రూపంలో తొలగించారు., యూనియన్‌కు కంపెనీ ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించుకునే అవకాశం గతంలో ఉండేది. ఆ కంపెనీ అక్రమ లాభాలు ఎక్కడ బయటపడతాయోనని ఈ పర్యవేక్షణ అవకాశాన్ని తొలగించారు. సమస్యను లేవదీసే హక్కును కూడా కోల్పోయారు. ఈ కొత్త చట్టాలతో మహిళా కార్మికులకు 12 నుంచి 26 వారాల ప్రసూతి సెలవు లాంటి ఒక చిన్న ఎరను వేసి రాత్రి వేళలో కూడా 12 గంటల నుంచి 16 గంటలుగా శ్రమ దోపిడిని పెంచుకుంటున్నారు. పని పరిస్థితులు, రుతుస్రావాలు మొదలగునవి కూడా కంపెనీ ఆలోచన చేతుల్లోకి వెళ్లిపోయాయి. లంచ్ రూమ్ క్యాంటీన్,రెస్ట్ రూమ్, డ్రింకింగ్ వాటర్, ఫీడింగ్ రూములు, ఇలాంటి కనీస సౌకర్యాలను ఈ చట్టాలు తీవ్రమైన ప్రభావితం చేయబోతున్నాయి. యజమాన్యాలు కనీసం కార్మికులను మనుషులుగా గుర్తించే పరిస్థితి కూడా లేకుండా పోయింది.

కార్మికుల తొలగింపుకు గతంలోని మార్గదర్శకాలు మారిపోయాయి. అతి చిన్న కారణమైనా,అసలు కారణాలే లేకుండా కూడా కార్మికులను తొలగించే అవకాశాలు నిరంతరంగా యాజమాన్యాలకు కల్పించాయి. తొలగించబడ్డ కార్మికులు న్యాయస్థానాలకు వెళ్లే అవకాశాన్ని కూడా ఈ కొత్త చట్టాలు అడ్డుకుంటున్నాయి. యజమాని ఆధ్వర్యంలో రూపొందించబడ్డ మధ్య దళారీ వ్యవస్థ చేతుల్లోకి కార్మికుల తొలగింపు నిర్ణయం వెళ్ళబోతుంది. ఇలాంటి అత్యంత దారుణమైన, మానవ పరిణామ క్రమాన్ని వెనక్కి తిప్పిన మోడీ చట్టాలు రాజస్థాన్ లో ప్రయోగాత్మకంగా అమలై అభ్యుదయ పాలనలో ఉన్న తమిళనాడు రాష్ట్రం కూడా ఇటీవల కాలంలో అమలుకు సిద్ధపడ్డది. తెలంగాణ ఇంకా వేగంగా యజమానులకు సహకారం అందించే పద్ధతిలో కార్మికులకు వ్యతిరేకంగా అత్యుత్సాహాన్ని ప్రదర్శించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల ప్రయోజనం దృష్ట్యా కార్మిక చట్టాలను నిలిపివేయాలి. పౌర సమాజం కార్మికులు సంఘటితోద్యమం చేయడం ద్వారా సమ్మె హక్కును కోల్పోతే బానిసగా మారుతామనే అంబేద్కర్ అభిప్రాయంతో చికాగో పోరాటస్ఫూర్తిని ఎత్తు పట్టి ప్రతిగాధ శక్తులను అడ్డుకుందాం.



-పందుల సైదులు
9441661192

పగబట్టిన ప్రకృతి..

అకాల వర్షాలకు రైతులు ఆగం..

- అతివృష్టితో అన్నదాతల విలవిల
- పంట చేతికి వచ్చి, ప్రారంభంగాని కొనుగోలు

నవతెలంగాణ-మల్లాపూర్:

అన్నదాతపై ప్రకృతి పగబట్టింది. పంట చేతికి వచ్చి మార్కెట్‌కు తరలించకా ఎడతెరిపి లేని వర్షాలతో రైతులు విలవిల లాడుతున్నారు. జగిత్యాల జిల్లాలో ఈ ఏడాది రికార్డు స్థాయిలో పంటలను సాగు చేశారు. అమ్మకానికి వచ్చిన వరి, మొక్కజొన్న, అకాల వర్షాలకు నేలపాలవు తున్నాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. జగిత్యాల జిల్లా మల్లా్పూర్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో ఆది వారం సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురి సింది. ముత్యంపేట గ్రామంలో వడగళ్లవాన కురిసింది. జిల్లాలో వరి, మొక్కజొన్న, నువ్వు పంట రైతులకు తీరని నష్టం వాటిల్లింది.

జిల్లా వ్యాప్తంగా 4,849 మంది రైతులకు చెందిన వివిధ పంటలు 6,359 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో ప్రధానంగా వరి 7,663 ఎకరాల్లో, మొక్కజొన్న 199 ఎకరాల్లో, 2,190 ఎకరాల్లో నువ్వు పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. దీనికి తోడు మార్కెట్ యార్డుల్లో అమ్మకానికి తెచ్చిన వరి ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు కళ్ల ముందే నేల కొరగడంతో రైతులు ఆవేదన అంతా ఇంతా కాదు. జిల్లాలో కోతకు వచ్చిన పంట ప్రకృతి కన్నెర్ర చేయడం కారణంగా నేల రాలి తీరని నష్టాన్ని కలిగించాయి. జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి డివిజన్‌లో మూడు, నాలుగు రోజులుగా ఈదురు గాలులు ఆకాల



వర్షం, వడగళ్లు కురవడంతో మామిడి, వరి, మొక్కజొన్న, నువ్వు పంటలకు అపార నష్టం వాటిల్లింది. కొద్ది రోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతు అన్న జిల్లా ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనం కలిగించినా యాసంగి పంటలకు మాత్రం తీవ్ర నష్టం కలిగించింది.

మండు వేసవిలో కురిసిన అకాల వర్షాలు, వడగళ్లు, వీచిన ఈదురు గాలులు అన్నదాతలను అతలావతలం చేశాయి. ఈదురు గాలుల దాటికి మామిడి కాయలు నేలరాలి అన్నదాత కంట తడి పెడుతున్నారు. వరి పంట కోతకు వచ్చే సమయంలో రాలి పోయింది. గాలులు దాటికి చద్దు రాలడం, వర్గానికి కొట్టుకు పోవడం, మరికొన్ని ప్రాంతాల్లో కల్లాలకు చేరిన వడ్లు తడిచి ముద్దకావడం, కొట్టుక పోవడం వంటివి చోటుచేసుకున్నాయి. ఎకరానికి రూ.40 నుంచి 50 వేలు పెట్టుబడి పెట్టామని, కోత సమయా నికి గాలి, ఆకాల వర్షాలు, నష్టం కలిగించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాలిన మామిడి రైతుల ఆశలు,

రాయికల్, మల్లాపూర్, కోరుట్ల, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి గొల్లపల్లి, వెల్లటూరు, జగిత్యాల, ధర్మపురి తదితర ప్రాంతాల్లో మామిడి కాయలు నేలరాలి నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా 32,837 ఎకరాల్లో మామిడి పంట నష్టం వాటిల్లినట్లు ఉద్యనవనశాఖ అధికారులు అంచనా వేశారు.

వరి, మొక్కజొన్న రైతులకు తీరని నష్టం...



ఈ ఫోటోలో ఉన్న రైతు పేరు నత్తి లక్ష్మణ్ జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం రాఘవపేట గ్రామానికి చెందిన లక్ష్మణ్ తనకున్న వ్యవసాయ భూమితో పాటు ఆ ఐదు ఎకరాలు భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. పంట పొలాన్ని కోసిన లక్ష్మణ్ 10 ట్రిప్పుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించాడు. అకాల వర్షం దాన్యం మొత్తం కొట్టుకపోయింది. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాడు.

'జిల్లాలో వరి, మొక్కజొన్న, నువ్వు పంట రైతులకు తీరని నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా 4,849 మంది రైతులకు చెందిన వివిధ పంటలు 6350 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో ప్రధా నంగా వరి 7,80600 ఎకరాల్లో, మొక్కజొన్న 1199 ఎకరాల్లో 2,190 ఎకరాల్లో నువ్వు పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. గ్రామాలు, రైతు వారిగా పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేధిక అందజేశారు.

పరిహారానికి ని'బంధనాలు'..

జిల్లాలో మదురు గాలులు, వడగళ్ల వర్షంతో చేతికొచ్చిన పంటకు నష్టం వాటిల్లింది. నిబందనల ప్రకారం 33 శాతం నష్టం జరిగితే పరిగణలోకి తీసుకోవాలనే ఉత్తర్వులు జారీ రావడంతో అధికారులు సర్వే నిర్వహించారు. చాలా చోట్ల కోత దశలో కోత దశలో ఉన్న పంటలను జాబితాలోకి ఎక్కించడం లేదని, నిర్ణీత శాతం లోపు జరిగిన నష్టాన్ని అధికారులు లెక్కించడం లేదని వాపోయారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులర్‌కు మోక్షం ఎప్పుడో.?

- విధులు బహిష్కరించి సమ్మెలో పంచాయతీ కార్యదర్శులు
- పల్లెల్లో నిలిచిపోనున్న రోజు వారి కార్యకలాపాలు
- క్రమబద్ధీకరించే వరకూ పోరాటం : పంచాయతీ కార్యదర్శులు

గ్రామ పంచాయతీలతో పాటుగా గ్రామాలను ప్రగతిబాటలో నడిపించడంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకం. గ్రామాల్లో పల్లె, పట్టణ ప్రగతి, హరితహారం, పారిశుద్ధ్యం, ఉపాధిహామీ పనులు, లబ్ధిదారులకు సర్టిఫికెట్ల జారీ తదితర పనుల నిర్వహణ విజయవంతంగా నిర్వహిస్తున్నారు. నాలుగేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న తమను ప్రభుత్వం ఎప్పుడు రెగ్యులర్ చేస్తుందోనని ఎదురుచూస్తున్నారు. జీవో ప్రకారం త్వరగా రెగ్యులర్ చేయాలని కోరుతున్నారు.

నవతెలంగాణ-పెగడపల్లి

జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 306 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధులు బహిష్కరించి సమ్మె బాట పట్టారు. దీంతో పల్లెల్లో రోజువారి అభివృద్ధి పనులు కార్యకలాపాలకు ఆటంకం కలుగనుంది. వీరు విధుల్లో లేకపోవడంతో గ్రామాల్లో సుమారు 43 రకాల పనులకు అంతరాయం కలుగనుంది. ప్రభుత్వ స్పందించి ఉద్యో గాలను క్రమబద్ధీకరిస్తామని హామీ నివ్వడం కాకుండా అధికా రికంగా జీవో వచ్చేంతవరకు పోరాటం కొనసాగిస్తామని కార్యదర్శులు స్పష్టం చేస్తున్నారు. వీరు సమ్మెకు వెళ్లడంతో మరోవైపు అధికార యంత్రాంగం ప్రత్యామ్నాయ చర్యలు



చేపట్టాలని భావిస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వ 2018లో నూతన తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం తీసుకురావడం జరిగింది. దాని ప్రకారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు మూడేండ్ల ప్రొబహిషన్ పీరియడ్ తర్వాత రెగ్యులర్ అయ్యే విధంగా నియామకాలు చేపట్టారు. తెలంగాణలోని పల్లెల్లో అభివృద్ధి జరగాలంటే ప్రతి ఊరికి ఒక పంచాయతీ కార్యదర్శి ఉండాలనే ఉద్దేశంతో పంచాయతీ కార్యదర్శులను నియమించారు.ఈ క్రమంలో పని ఒత్తిడి తట్టుకోలేక కొంతమంది పంచాయతీ కార్యదర్శులు రాజీనామా చేశారు. మరికొంత మంది ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు.వారి స్థానంలో మెరిట్ లిస్ట్ రోస్టర్ ప్రకారం అవుట్‌సోర్సింగ్ విధాన ంలో పంచాయతీ కార్యదర్శుల నియామకం జరిగింది. పంచా యతీ కార్యదర్శులు విధుల్లో చేరిన నాటి నుంచి, ప్రభుత్వ అభివృద్ధి పథకాలను ప్రజలకు అందేలా చేస్తూ పల్లెల అభివృద్ధిలో భాగస్వాములు అయ్యారు.ప్రతి గ్రామ పంచాయతీలో ప్రతిరోజు గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా తడి, పొడి చెత్త వేరు చేస్తూ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. సీఎం కలల ప్రాజెక్టులైన పల్లె ప్రగతి కార్యక్రమాలు, నర్సరీలు, హరితహారం పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాలు,సెగ్రిగేషన్ షెడ్లు,డంపింగ్ యార్డు లాంటి 50 రకాల పనులను గ్రామస్థాయిలో సర్పంచులతో సమన్వయం చేసుకుంటూ జేపీఎస్‌లు నిర్వహించారు. అదేవిధంగా కరోనా సమయంలో ఉపాధిహామీ పనుల బాధ్యతను కూడా తీసుకొని విజయవంతంగా నిర్వహించడ ంలో జేపీఎస్‌ల పాత్ర కీలకం.ప్రతిరోజు గ్రామాలలో మానసిక ఒత్తిడికి గురవుతూ ప్రభుత్వం అప్ప జెప్పిన బాధ్యతను విజయవంతంగా నిర్వహించారు. ఇటీవల ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమం,ఐకేపీ కేంద్రాల పనులను కూడా పంచాయతీ కార్యదర్శులకు అప్పజెప్పడం జరుగుతుంది.జీఓ నెంబర్ 26 ప్రకారం ప్రొబేషన్ కాలాన్ని మూడు సంవత్సరాల నుండి నాలుగేండ్లకు పెంచారు.ఈ ప్రొబేషన్ కాలం కూడా 11-04-2023తో పూర్తయ్యింది. దీంతో ఇచ్చిన మాట ప్రకారం వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ జీవో ప్రకారం క్రమబద్ధీకరించాలి



రాష్ట్రప్రభుత్వ జీవో నెంబర్ 26 ప్రకారం ప్రొహిబేషన్ పూర్తయిన మరుసటి రోజు నుంచి గ్రేడ్ 4 కార్యదర్శిలుగా ప్రభుత్వం వెంటనే గుర్తించి పరిగణి ంచాలి.

-బతికేపెల్లి పంచాయతీ కార్యదర్శి. ప్రేమలత,

పల్లెల అభివృద్ధికి కృషి చేస్తున్నాం



గ్రామాల్లో ఉన్న సమస్యలు పరిష్కరించడంతోపాటు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్న మమ్మల్ని ప్రభుత్వం రెగ్యులర్ చేసి మా కుటుంబాలను ఆదుకోవాలి.

-నర్సింహుని పేట పంచాయతీ కార్యదర్శి పద్మ,

ప్రభుత్వం దిగివచ్చే వరకూ సమ్మె చేస్తాం



రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశ పెడు తున్న పథకాలను ప్రజలకు చేరే వేయడంలో కీలక పాత్ర పోషి స్తున్నాం. కానీ నాలుగేళ్ల ప్రొహి బేషన్ పీరియడు పూర్తి చేసుకున్న మమ్మల్ని రెగ్యులర్ చేసి సర్వీస్ బుక్‌లో వెంటనే నమోదు చేయాలి. అధి కారికంగా జీవో ఇచ్చేంత వరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు.

-పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు నదీమ్,

'ప్రజావాణి' దరఖాస్తులకు దిక్కేది?

- దరఖాస్తుల పరిష్కారంలో లోపిస్తున్న శ్రద్ధ
- కార్యాలయాల చుట్టూ బాధితుల ప్రదక్షిణలు
- క్షేత్రస్థాయిలో ప్రజావాణి ఇంకా నిద్రావస్థలోనేనా !



నవతెలంగాణ-జగిత్యాలటౌన్:

ప్రజలకు పాలనను దగ్గర చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసినా ప్రజావాణికి వినతుల వెల్లువకొనసాగుతూనే ఉంది. ప్రజాసమస్యలు గ్రామీణ, మండల స్థాయిలో పరిష్కారం కావడం లేదు. కొన్నిచోట్ల అధికారులు అందుబాటులో ఉండకపోగా... మరికొన్నిచోట్ల కిందిస్థాయి సిబ్బంది తీరుతో బాధితులు సమస్యలు తీరక జిల్లాకేంద్రానికి వస్తున్నారు. ప్రజలకు పాలన అందించేందుకు చిన్న జిల్లాలు ఏర్పడిన జిల్లా జనాలకు మాత్రం కష్టాలు తీరడం లేదు.

ప్రజావాణి సమస్యలు పరిష్కారం అవుతున్నాయా !

జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో ప్రజలు వ్యయప్రయాసాల కోర్చి తమ సమస్యలను కలెక్టర్‌కు చెబితే పరిష్కారం అవుతుందని గంపే డాశతో వస్తుంటారు. ప్రజా సమస్యలను పరిష్కరించే ఉద్దేశంతో ప్రారంభించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజాసమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కావడం లేదు. ఒకే సమస్యపై పలుమార్లు ప్రజావాణిలో మొరపెట్టుకుంటున్న క్షేత్రస్థాయి అధికారులు సరైన విధంగా స్పందించకపోవడంతో ఫిర్యాదు దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజావాణిలో ఫిర్యాదును కలెక్టర్ నుండి స్వీకరించిన సంబంధిత జిల్లా శాఖ అధికారులు వాటిని క్షేత్రస్థాయికి బదిలీ చేసి చేతులు దులుపుకుం టున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. తమ శాఖకు సంబం ధించి వస్తున్న ఫిర్యాదులపై శాఖల వద్ద ఖచ్చితమైన సమాచారం కూడా ఉండడం లేదు. అంతేకాకుండా ఆ ఫిర్యా దుపై సంబంధిత ఫిర్యాదుదారుడికి న్యాయం జరిగిందా లేదా అనే అవసరం కూడా ఆ అధికారులకు లేదనే చెప్పాలి.

పోను పోను జిల్లా స్థాయి అధికారుల రోజు వారీ పనులను కూడా కలెక్టర్ దగ్గరుండి చెబితేనే అధికారులు ముందుకు కదులు తారేమో నని సం దేహం కలగక మానదు.

క్షేత్రస్థాయిలో ప్రజావాణి నిద్రావస్థలోనేనా?

గతంలో మండల స్థాయిలోనే ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించేవారు. అక్కడ కూడా పరిష్కారం కానీ సమస్యలను ప్రజలు జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేసేవారు ఇదంతా గతం. ప్రస్తుతం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్ర మంలో మొక్కుబడిగా అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. వాటి పరిష్కారం అవుతాయే లేదో అని ప్రజలు పలు వ్యయ ప్రయా సాలకు ఓర్చి కలెక్టర్ కార్యాల యంలో తమ సమస్య లను విన్నవించుకుంటున్నారు. మరి మండల స్థాయిలో ప్రజల వాణి వినేందుకు, సమ స్యలు పరిష్కరించేందుకు అధికారులకు సమయమే లేకుండా పోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం పూర్తిస్థాయిలో నిర్వహిస్తే పలు సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జిల్లా కలెక్టర్ కార్యాల యంకు రావాల్సిన అవసరం ఉండదని మండల స్థాయి అధికారులకు తెలిసేది ఎప్పుడో. వారికి కూడా కలెక్టర్ దగ్గరుండి చెబితేనే అధికారులు ముందుకు కదులుతారేమో !

ఫిర్యాదుల వివరాలు :

తేదీ 01-01-2023 నుంచి 24-04-2023 వరకు అనగా సుమారు 4 నెలలలో జిల్లాలోని 53 శాఖలకు సంబంధించి 360 ఫిర్యాదులు వచ్చాయి. అందులో 146 మాత్రమే పరిష్కరించారు. 206 ఫిర్యాదులు ఇంకా అధికారుల వద్ద భద్రంగా ఉన్నాయి. ఈ 4 నెలల కాలంలో శాఖల వారీగా చూస్తే అత్యధికంగా జిల్లా పంచాయతీ అధికారికి సంబంధించి 51 ఫిర్యాదులు రాగా 17 పరిష్కరించగా ఇంకా 34 పెండింగ్‌లోనే ఉన్నాయి. ఆ తర్వాత జగిత్యాల మున్సిపాలిటీకి సంబంధించి 30 ఫిర్యాదులు రాగా 9 మాత్రమే పరిష్కరించారు. ఇంకా 21 పెండింగ్లోనే ఉన్నాయి. జిల్లా పోలీస్ కార్యాల యానికి సంబంధించి 11 ఫిర్యాదులు రాగా 11 పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇరిగేషన్ శాఖకు సంబం ధించి 15 ఫిర్యాదులు రాగా రెండు పరిష్కారం కాగా 13 పెండింగ్లోనే ఉన్నాయి. ఇలా అన్ని శాఖలలోని ఫిర్యాదులు పెండింగ్ లోనే ఉండడం కొసమెరుపు.

ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులకు సంబ ంధించి cpgrams.ts.nic.inలో ప్రజలు తమ ఫిర్యాదు తెలుసుకోవచ్చు. ప్రజావాణి ఫిర్యాదులను వెబ్ సైట్‌లో నమోదు చేస్తున్నా అధికారులు పరిష్కారానికి చొరవ చూపక పోవడం గమనార్హం. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా వాణిలో వచ్చిన ఫిర్యాదులే పరిష్కారానికి నోచుకోక పోతే క్షేత్రస్థాయిలో ఏ విధంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని ప్రజా సమస్యలను పరిష్కరించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ రాతపరీక్ష



9 కేంద్రాల్లో 14,020 మంది హాజరు

నవతెలంగాణ - కరీంనగర్ క్రైమ్

పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ కానిస్టేబుల్ (సివిల్/ఎ.ఆర్/ టి.ఎస్.ఎస్.పి/ఎస్.పి.ఎఫ్/ఎస్.ఎ.ఆర్ సిపిఎల్/ ఎస్.ఎఫ్.ఓ) అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కళాశాల, అపూర్వ డిగ్రీ కళాశాల, వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల, ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల, తిమ్మాపూర్ మండలం రామకృష్ణాపూర్ కాలనీలోని వాగేశ్వరి కళాశాల, జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాల, శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాల, కరీంనగర్‌లోని కిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాల, వివేకానంద ఇంజనీరింగ్ కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పరీక్ష ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు కొనసాగింది. 14,188 మంది అభ్యర్థులకు 14,020 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 168 మంది గైర్హాజరు అయ్యారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బరాయుడు ఎస్ఆర్ఆర్ డిగ్రీ, జీపీ కళాశాల, వివేకానంద ఇంజనీరింగ్ కళాశాల, తిమ్మాపూర్ మండలంలోని జ్యోతిష్మతి, శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలల్లో కేంద్రాలను పరిశీలించారు.

పరీక్షల సందర్భంగా ట్రాఫిక్ నకు ఎలాంటి అంతరాయం కలుగకుండా పటిష్ట క్రమబద్ధీకరణ చర్యలు తీసుకున్నారు. పరీక్ష ముగిసేంతవరకు జిరాక్స్ సెంటర్లను మూసిఉంచారు. నగరంలోని లాడ్జిలను తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించిన వివరాలు తీసుకున్నారు. పరీక్షకు హాజరైన అభ్యర్థుల బయోమెట్రిక్ వివరాలు నమోదు చేశారు.

గన్నేరువరంలో ఘనంగా పోచమ్మ బోనాలు

నవతెలంగాణ - గన్నేరువరం



మండల కేంద్రంలోని మాల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ తల్లికి ఘనంగా బోనాలు సమర్పించారు. ప్రతి ఇంటినుంచి మహిళలు బోనాన్ని ఎత్తుకొని ఊరేగింపు నిర్వహించి ఆలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో న్యాత కొమురయ్య నక్క దామోదర్, నక్క అంజయ్య, న్యాత ప్రవీన్, మాందాల సాగర్ పాల్గొన్నారు.

ఐఐటీ జేఈఈ మెయిన్స్ - 2023 ఫలితాలలో శ్రీచైతన్య విద్యాసంస్థల విజయభేరి



నవతెలంగాణ - కరీంనగర్

ఐఐటీ జేఈఈ మెయిన్స్-2023 ఫలితాలలో శ్రీ చైతన్య విద్యార్థులు అద్భుత మార్కులు సాధించి విజయభేరీ మోగించారని విద్యా సంస్థల చైర్మన్ ఎం.రమేష్‌రెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యస్.పవన్ సూర్య 220, బి.భవ్య 748, పల్లె బిందు 1482, యు.మోహన్ సాయి 2347, బి.సాయిచరణ్ 4652, ఆర్.అనన్యరెడ్డి 10299, యం.ఈశ్వర్ నాయక్ 10482, కె.మాధురి 10712 ఆల్ ఇండియా ర్యాంకులు సాధించారని తెలిపారు. యస్.పవన్ సూర్య 99.98, యు.మోహన్ సాయి 99.10. పి.బిందు 99.08, డి.హరిక 98.11, కె.మాధురి 96.60, డి.వంశీకృష్ణ 96.38, ఆర్.అనన్యరెడ్డి 94.44, రామక్రిష్ణరెడ్డి 91.88 పర్సెంటైల్ సాధించారని అభినందించారు. జేఈఈ మెయిన్స్ పరీక్షకు హాజరయిన వారిలో 60శాతం మంది విద్యార్థులు ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించడంలో శ్రీచైతన్య మరో సంచలనం సృష్టించిందని పేర్కొన్నారు. అనునిత్యం పర్యవేక్షణ, విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపడం వలన ఈ రోజు ఇంతటి ఘన విజయం సాధించగలిగారని చెప్పారు. విజయ సాధనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడిన శ్రీచైతన్య ఆధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య కళాశాలల డీన్ జగన్ మోహన్‌రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, డాక్టర్ ఎల్.శ్రీనివాస్, రాధక్రిష్ణ, ఎజియం శ్రీనివాస్ పాల్గొన్నారు.

మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలి

బిఆర్‌టియు నియోజకవర్గ అధ్యక్షుడు మారపల్లి శ్రీనివాస్

నవతెలంగాణ - జమ్మికుంట



భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగే 137వ మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని బిఆర్‌టియు హుజురాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు మారపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. జమ్మికుంట ఆర్టీసీ బస్టాండ్ ముందు జరిగే మేడే జెండా ఆవిష్కరణ ఉదయం 9 గంటలకు జరుగుతున్న కార్యక్రమానికి భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ అనుబంధ సంఘాల వారు హాజరు కావాలని కోరారు.

తడిసిన ధాన్యాన్ని షరతులు లేకుండా కొనుగోలు చేయాలి



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ - జమ్మికుంట

తడిసిన వరి ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు రేణుకశివకుమార్, ఎన్ఎస్‌యుఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఇమ్రాన్ అన్నారు. ఆదివారం జమ్మికుంట పాత మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ నాయకులు సందర్శించి, ఆందోళన చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు పదవులపై ఉన్న శ్రద్ధ రైతన్నలపై ఉంటే బాగుండేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రెండోరోజు జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నిరవధిక సమ్మె దీక్ష



నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి మండల కేంద్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నిరవధిక సమ్మె దీక్ష రెండోరోజు కొనసాగించారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తమను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. వారికి భూపాలపట్నం ఉపసర్పంచ్ బైరగోని కిట్టుగౌడ్ మద్దతు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం




గురువులతో పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ - గన్నేరువరం

మండలం గుండ్లపల్లిలోని శ్రీ సాయి గార్డెన్లో ఆదివారం ఆదిత్య స్కూల్ 1996-97 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. దీనిలో నాటి గురువులతో పాటు పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముఖ్య అతిథిగా ఆదిత్య స్కూల్ మాజీ కరస్పాండెంట్ చాడ రత్నాకర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలుగు టీచర్ రామకృష్ణ, రిటైర్డ్ టీచర్ రాజిరెడ్డి, టీచర్ చంద్రకళ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మేడేను ఘనంగా నిర్వహించుకోవాలి



నవతెలంగాణ - శంకరపట్నం

మేడేను శంకరపట్నం మండల కేంద్రంతో అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి పిట్టల సమ్మయ్య అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో కార్మిక సంఘం నాయకులు ఏఐటియూసి జెండాలు ఆవిష్కరించాలని అన్నారు. ఆయనవెంట ఏఐటీయూసీ మండల సహాయ కార్యదర్శి తాడవేణి రవి, జూల లక్ష్మయ్య, బొజ్జ నరసయ్య పాల్గొన్నారు.

గర్శకుర్తిని మండల కేంద్రంగా ప్రకటించాలి

మండల సాధన సమితి సభ్యులు, ప్రజల రిలే నిరాహార దీక్ష ప్రారంభం

నవతెలంగాణ - గంగాధర



గర్శకుర్తిలో ర్యాలీ తీస్తున్న ప్రజలు

గంగాధర మండలంలోని గర్శకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం మండల సాధన సమితి ఆధ్వర్యంలో స్థానికులతో పాటు వివిధ గ్రామాల ప్రజలు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ప్రజల సౌలభ్యం కోసం గర్శకుర్తి గ్రామాన్ని ప్రభుత్వం వెంటనే మండల కేంద్రంగా ప్రకటించాలని సాధన సమితి సభ్యులు, వివిధ గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. తెలంగాణ ఆవిర్భావానికి ముందు కరీంనగర్ ఎంపీగా పోటీ చేసిన ప్రస్తుత సీఎం కేసీఆర్ ఆనాటి ఎన్నికల బహిరంగ సభలో గర్శకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తామని హామీ నిచ్చారని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు గర్శకుర్తిని తక్షణమే మండల కేంద్రంగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. 1982 నుండి గర్శకుర్తిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలంటూ ఆందోళన కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నామని అన్నారు. గర్శకుర్తిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయడం వల్ల గర్శకుర్తి గ్రామాన్ని ఆనుకుని ఉన్న తాడిజెర్రి, రంగారావుపల్లి, ఉప్పర మల్యాల, వెంకంపల్లి, కాసారం, గట్టుభూత్కూర్, చిన్న ఆచంపల్లి, పెద్ద ఆచంపల్లితో పాటు పలు గ్రామాలకు ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా తక్షణమే మండల కేంద్రంగా గుర్తించాలని, లేదంటే నేడు చేపట్టిన రిలే నిరాహార దీక్ష మండల కేంద్రం ఏర్పాటు చేసే వరకు కొనసాగిస్తామని తెలిపారు. దీక్షకు ముందు స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. దీక్షలో మండల సాధన సమితి సభ్యులు గడ్డం నారాయణ, అలువాల శ్రీనివాస్, పొత్తూరి సురేష్, కల్వకోట శ్రీనివాసరావు, కంటం రాజ మల్లయ్య, రేణిగుంట రమేష్, మల్లయ్య, లింగంపల్లి రవి, నల్ల శ్రీనివాస్, చిందం ఆంజనేయులు, భాస్కర్, చిప్ప శ్రీనివాస్, చిందం భీమయ్యతో పాటు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలో మండల సాధన సమితి సభ్యులు, వివిధ గ్రామాల ప్రజలు

దళిత బంధులో అధికారుల కొర్రీలు మానుకోవాలి..

న్యాయవాది కొత్తూరు రమేష్

నవతెలంగాణ - హుజురాబాద్



దళిత బంధు రానివారితో కొత్తూరు రమేష్

హుజురాబాద్ నియోజకవర్గంలో దళిత బంధు మంజూరు విషయంలో అధికారులు కొర్రీలు పెడుతూ అర్హులను ఇబ్బందుల పాలు చేస్తున్నారని న్యాయవాది, దళిత బంధు సమన్వయ కమిటీ చైర్మన్ కొత్తూరు రమేష్ అన్నారు. ఆదివారం హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత బంధు పథకం పొందని వారితో కలిసి అంబేద్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు అనంతరం ఆయన మాట్లాడారు. రేషన్ కార్డు లేదు అనే నిబంధన, ఇతర కారణాలతో దళిత బంధు పథకం రాని వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఎలాంటి ఆదేశాలు లేనప్పటికీ అధికారులు హుజురాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన వారికి కూడా రేషన్ కార్డు ఉండాలి అని నిబంధనలతో సుమారు 1000 మందికి దళిత బంధును ఇవ్వడం లేదని అన్నారు. విచారణ చేసి రేషన్ కార్డు లేనప్పటికీ హుజురాబాద్ నియోజకవర్గం స్థానికత నిరూపించుకుటకు ఇతరత్రా సర్టిఫికెట్లు చూసి దళిత బంధు అమలు చేయాలని కోరారు. హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తా నుండి వీణవంక మీదుగా కరీంనగర్‌కు దళిత బంధు రాని వారితో పాదయాత్ర చేపడుతామని చెప్పారు. కార్యక్రమంలో దేవనూరు శ్రీనివాస్, ముద్దమల్ల విజయ్, పప్పు బిక్షపతి, లావణ్య, రమా, మహేందర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సొంత ప్రతిష్ట కోసమే కొత్త సచివాలయం : ఎమ్మెల్యే ఈటెల రాజేందర్

నవతెలంగాణ - హుజురాబాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్

రాష్ట్ర ముఖ్యమంత్రి తన సొంత ప్రతిష్ట కోసమే కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నూతన సచివాలయం నిర్మించారని.. దానివల్ల ప్రజలకు ఏమి ఉపయోగం లేదని హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం ఆయన హుజురాబాద్ పట్టణంలోని రైస్ మిల్లులను సందర్శించి దిగుమతి కాకుండా ఆగి ఉన్న వరి ధాన్యం పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొత్త సచివాలయం కట్టుకున్న ముఖ్యమంత్రి కెసిఆర్ ఈ మూడు, నాలుగు నెలలపాటు రోజు ఆఫీస్‌కి వస్తారా ? అని ప్రశ్నించారు. ఇతర నాయకుల ఆనవాళ్లు లేకుండా చేయడానికే కొత్త సచివాలయం అని, సీఎం కేసీఆర్ పరిపాలనా కాలంలో తొమ్మిది సంవత్సరాలుగా పాలన అస్తవ్యస్తం అయ్యి వ్యవస్థలు చట్టుబండలు అయ్యాయని ఆరోపించారు. పంట నష్టాన్ని అధికారులు పరిశీలించి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్లుల వద్ద రోజుల తరబడి ట్రాక్టర్లు నిలబడుతున్నాయని.. వెంటనే దించుకొనెల చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

హైదరాబాద్ రోడ్డు ప్రమాదంలో బిటెక్ విద్యార్థి మృతి

గన్నేరువరం మండలం సాంబయ్యపల్లిలో విషాదం

నవతెలంగాణ - గన్నేరువరం



నివాస్ (ఫైల్)

హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని సాంబయ్యపల్లి గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. సాంబయపల్లి గ్రామానికి చెందిన గడ్డం రాజిరెడ్డి చిన్న కుమారుడు గడ్డం నివాస్ (20) హైదరాబాద్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. శనివారం రాత్రి ఫ్రెండ్ బర్త్ డే పార్టీ ముగించుకొని రూమ్‌కు బైక్‌పై తిరిగి వెళ్తుండగా డీవైడర్‌ను ఢీకొనగా తలకు తీవ్ర గాయాలైన నివాస్, తన మిత్రుడు అక్కడికక్కడే మృతిచెందారు. నివాస్ మృతదేహం ఆదివారం స్వగ్రామానికి చేరుకోగా తల్లి దండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. గ్రామ సర్పంచ్ చింతలపల్లి నరసింహారెడ్డి, పాలకవర్గం సభ్యులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం



నవతెలంగాణ - శంకరపట్నం

శంకరపట్నం మండల కేంద్రంలోని వెంకయ్య గుట్ట వద్ద ఆదివారం విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ మండల కమిటీ ఆధ్వర్యంలో శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవం నిర్వహించారు. సర్పంచ్ కాటం వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంటా మహిపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండలాధ్యక్షుడు తాటికొండ సదానందచారి, ఉపాధ్యక్షులు నర్సింగోజు కృష్ణచారి, మంతెన రవీంద్రాచారి, ప్రధాన కార్యదర్శి కొండపాక ప్రసాద్‌చారి, ప్రచార కార్యదర్శి కస్తూరి రమేష్‌చారి, ఊకంటి మధుకర్, రెడ్డి, ఉమ్మెంతల సతీష్‌రెడ్డి, మోరే శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోడల్ నీట్‌కు విశేష స్పందన

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్



పరీక్ష పేపర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్

నవతెలంగాణ - కరీంనగర్

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోడల్ నీట్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన వస్తుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగారపు రజనీకాంత్ అన్నారు. ఆదివారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అల్పోర్స్ జూనియర్ కాలేజీలో మోడల్ నీట్ పరీక్ష పేపర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడుతూ.. మోడల్ పరీక్ష ఐఐటీ చుక్క రామయ్య ఆధ్వర్యంలో 12 సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 1500మంది విద్యార్థులు మోడల్ నీట్ రాశారని తెలిపారు. పరీక్ష నిర్వాహక సెంటర్లకు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ ఎం.పూజ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు రోహిత్, సహాయ కార్యదర్శులు వినయ్, మనోజ్, కమిటీ సభ్యులు రత్నం సురేష్, సందేశ్, సోషల్ మీడియా కన్వీనర్ నాగుల శివ కుమార్ పాల్గొన్నారు.

ఎస్టీపీఎఫ్ సన్నాహక సమావేశం



సమావేశంలో పాల్గొన్న జిల్లా ప్రతినిధులు

నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రెంట్ ఎస్టీపీఎఫ్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఉమ్మడి జిల్లా ప్రతినిధులు హాజరయ్యారు. భౌగోళిక తెలంగాణలో జరుగుతున్న అన్యాయాలపై సామాజిక న్యాయం కోసం మే 6న ఎస్టీపీఎఫ్ ఆధ్వర్యంలో కరీంనగర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే సమావేశంలో ప్రజాస్వామిక వాదులు పాల్గొని విజయవంతం చేయాలని బీసీ పొలిటికల్ ఫ్రెంట్ స్టేట్ జనరల్ సెక్రెటరీ, ఎస్టీపీఎఫ్ కో ఆర్డినేటర్ దేవల్ల సమ్మయ్య కోరారు. ఈ సమావేశానికి రేవెల్లి శంకర్ అధ్యక్షత వహించగా సభ్యులు కంటే రామచందర్, డాక్టర్ మనోహర్ చారి, ప్రసాద్ రావు, సుదర్శన్, సుతారి లచ్చన్న, మానుపాటి శ్రీనివాస్, భరత్, శ్రీనివాస్, నాయకులు, సామాజిక వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వరద నీటితో ప్రాణాలకు ముప్పు

కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్

నవతెలంగాణ - కరీంనగర్



వరద అనంతరం రోడ్డు

వర్షం పడిన ప్రతిసారి బీట్ మార్కెట్ నుంచి భారీ వరద కిసాన్ నగర్ రోడ్లపై ఉప్పెన లాగా ఇండ్లలోకి వెళ్లి ప్రజల ప్రాణాలకు ప్రమాదంగా తయారైందని కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ అన్నారు. ఇప్పటికైనా మంత్రి గంగుల కమలాకర్, కలెక్టర్ కర్ణన్ స్పందించి బీట్ మార్కెట్లో నుంచి వరద నీరు కిసాన్ నగర్ రాకుండా నీటిని మళ్లించేందుకు ప్రత్యామ్నాయ చర్యలను తీసుకోవాలని కోరారు. వచ్చే వర్షాకాలంతో ఇంకా ప్రమాదాలు పొంచి ఉన్నాయని, వెంటనే స్పందించాలని కోరారు.

మానసాదేవిని దర్శించుకున్న సివిల్ జడ్జి శ్రీనిజ



నవతెలంగాణ - గన్నేరువరం

మండలంలోని కాసింపేట స్వయంభూ మానసా దేవి శక్తిపీఠం ఆలయంలో పంచమ వార్షికోత్సవం సందర్భంగా కరీంనగర్ సివిల్ జడ్జి శ్రీనిజ సందర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు కండువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ భూదాత బద్దం చిన్ననరసింహారెడ్డి, చైర్మన్ ఎలేటి చంద్రారెడ్డి, ప్రధాన అర్చకుడు మామిడాల నాగసాయి శర్మ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్



నవతెలంగాణ-జగిత్యాలటౌన్

పట్టణంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్ పరీక్షను ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షను విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భవిష్యత్‌లో ఇలా పరీక్షలు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించాలని కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌వి, శ్రీ చైతన్య, అల్ఫోర్స్, నవ్య జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ ముసిపట్ల రాజేందర్, గాలిపెల్లి ఈశ్వర్, పల్లేర్ల నరేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అక్రమ్ మాలిక్, ఉపాధ్యక్షులు సంజయ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శివాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఆది శ్రీనివాస్

నవతెలంగాణ-మేడిపల్లి

భీమారం మండలంలోని వెంకట్రావుపేటలో జరిగిన శ్రీ శివాంజనేయస్వామి కళ్యాణ మహోత్సవంలో సిరిసిల్ల డీసీసీ అధ్యక్షుడు, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆది శ్రీనివాస్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువ సత్కరించారు. వారి వెంట మండల అధ్యక్షులు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, గ్రామ అధ్యక్షులు కొత్తపెల్లి అజయ్, ఉప సర్పంచ్ మగ్బుల్ , సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి,సయ్యద్, జీవన్, చాంద్, రాజేశం, మండల కోఆర్డినేటర్ అరుణ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన సచివాలయ ఛాంబర్‌లో కొప్పులను కలిసిన ఎమ్మెల్యే సంజయ్



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నూతన సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఛాంబర్‌లో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. కలిసి వారిలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్ ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు సర్పంచ్‌ల మద్దతు

నవతెలంగాణ-మేడిపల్లి

మేడిపల్లి ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమకు ఉద్యోగ భద్రత కోసం పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షులు వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్నారు. వారికి జిల్లా సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, పసునూరి సర్పంచ్ లచ్చన్న నాయక్, మేడిపల్లి సర్పంచ్ వరలక్ష్మీ మహేందర్‌రెడ్డి, తొందరరావుపేట సర్పంచ్ మామిడి సత్తమ్మ ధర్మారెడ్డి జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు మద్దతుగా నిలిచారు.

మస్జిద్ కమిటీ అధ్యక్షుడిగా మహమ్మద్ హైమద్



వ్యక్తికి స్వీట్ తినిపిస్తున్న సభ్యులు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని తిమ్మాపూర్ జామే మస్జిద్ కమిటీ నూతన అధ్యక్షుడిగా మహమ్మద్ హైమద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ ఖాలిద్, కార్యదర్శిగా సదుల్లా కమిటీ మెంబర్లుగా రాజ్ మహమ్మద్, మూకీమ్, రియాజ్ మౌలానా, ఆసీఫ్ సలహాదారులుగా మహమ్మద్ రసూల్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ యాసీన్ మహమ్మద్ నాసర్ కమిటీ సభ్యులు యువకులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా వెంకన్న కల్యాణం



ప్రత్యేక పూజలో ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ ఇబ్రహీంపట్నం:

ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపూర్ గ్రామంలో ఆదివారం వెంకన్న కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. భాజా భజంత్రీలతో ఘనంగా గ్రామస్తులు కళ్యాణాన్ని జరిపారు. కాగా ఈ కళ్యాణోత్సవానికి కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు తనయుడు కల్వకుంట్ల డాక్టర్ సంజయ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లు ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తలారి మనిషా ఆనంద్, ఎంపీటీసీ వివేకవర్ధిని మహేష్, ఉప సర్పంచ్ సుజాత జనార్ధన్, నాయకులు జగన్‌రావు, రమేష్, ప్రభాకర్ ,వినోద్, పాల్గొన్నారు.

ఎస్సీ సబ్ ప్లాన్ ఫైల్‌పై మొదటి సంతకం చేసిన మంత్రి కొప్పుల



ఫైల్ పై సంతకం చేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

నూతన సచివాలయం ఎస్సీ అభివృద్ది మైనారిటీ సంక్షేమ శాఖ చాంబర్‌లో వేదమంత్రోత్సవాల మధ్య మంత్రి కొప్పుల కుటుంబ సభ్యులతో కలిసి అడుగు పెట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించి బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్సీ సబ్ ప్లాన్ ఫైల్‌పై మంత్రి కొప్పుల ఈశ్వర్ మొదటి సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జగిత్యాల జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్, పెద్దపెల్లి ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్సీ ఎల్. రమణ, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటీ దామోదర్ గుప్తా, ఉమ్మడి కరీంనగర్ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, రామగుండం మేయర్ అనిల్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల గ్రంథాలయ సంస్థల చైర్మన్లు చంద్ర శేఖర్ గౌడ్, పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-మల్లాపూర్

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ సందీ రెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని కొత్త దామరాజు పల్లి, పాత ధామరాజుపల్లి గ్రామాలలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతు నేరుగా ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం అందించి మద్దతు ధరను పొందాలని అన్నారు. తప్ప తాలు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురావాలని కోరారు. వేసవి కాలం దృష్ట్యా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు నిర్వాహకులు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు మైదాసు శ్రీనివాస్, బద్దం సరితా



ప్రారంభిస్తున్న జడ్పీటీసి సందీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

కమలాకర్, సింగిల్ విండో చైర్మన్ వేంపేట నర్సారెడ్డి, ఎంపీటీసీ సుజాత నరేష్, సీఈవో పాదం భూమేష్, డైరెక్టర్లు సుతారి రాజేందర్, కొత్తూరి నారాయణ, బిఆర్ఎస్ నాయకులు బద్దం నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని పరిశీలించిన జువ్వాడి కృష్ణారావు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపూర్ గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాల్లో వర్షంతో తడిసి ముద్దయిన వరి ధాన్యాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జువ్వాడి మాటాడుతూ.. అకాల వర్షాలతో రైతులు పంట నష్టపోతున్నారని అన్నారు. వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి వారం రోజులైనప్పటికీ కూడా తూకం వేయడం లేదన్నారు. అకాల వర్షాల కారణంతో ధాన్యం ఎండకు ఎండి వానకు నానుతుందని అన్నారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం కింద డబ్బులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.



పరిశీలించిన తర్వాత మాట్లాడుతున్న కష్ణారావు

ఇప్పటికైనా ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు చొరవ తీసుకొని ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షాలతో రైతులు ఆందోళనలో ఉంటే ఎమ్మెల్యే ఆత్మీయ సమ్మేళనం పేరుతో సంబరాలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అనంతరం యామాపూరు గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మహోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే యామాపూర్ గ్రామంలోని గీత కార్మికుడు జంబుక పెద్ద గంగారం ఇటీవల కాలంలో తాటి చెట్టు మీద నుండి కింద పడిపోయి గాయాలు కాగా వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. ఈ కార్యక్రమాలలో దామెర శ్రీనివాస్. విగ్నేష్. క్యాతం తిరుపతి, కాసా ప్రశాంత్ కాసా దాశరథం, బుగ్గన, క్యాతం రాజారెడ్డి, విడిసి సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు జెర్సీలు పంపిణీ



జెర్సీలను అందజేస్తున్న సత్యం రెడ్డి

నవతెలంగాణ-మల్లాపూర్:

మండలంలోని కొత్త దామరాజు పల్లి గ్రామానికి చెందిన క్రీడాకారులకు మాజీ ఎంపీపీ బద్దం విజయ నర్సా రెడ్డి జర్సీ లను, క్రికెట్ బ్యాట్ ను ఆదివారం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలని క్రీడారంగంలో రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో బద్దం జగదీశ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గంగా రెడ్డి, సుధాకర్, హరీష్, సురేష్, రఘు, మణికంత వాలీబాల్, క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం



పూజలో పాల్గొన్న జువ్వాడి కృష్ణారావు

నవతెలంగాణ-మెట్‌పల్లిరూరల్

మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామంలో ఆదివారం శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం ఆదివారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కష్ణారావు ప్రత్యేక పూజలు చేశారు. .ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు జువ్వాడికృష్ణారావును మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి,వేంపేట ఉపసర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్ ,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేందర్ రెడ్డి ,తుమ్మల లింగారెడ్డి ,నల్ల శేఖర్ ,ఆలయ కమిటీ మెంబర్లు బండి శంకర్ ,నల్ల జనార్దన్ ,కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి గంగోని క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెంగళాయిపేట చర్చికి సీలింగ్ ఫ్యాన్ల అందజేత



చర్చిలో ఫ్యాన్లు అందిస్తున్న కాంత కుమారి,

నవతెలంగాణ-పెగడపల్లి

పెగడపల్లి మండల పరిధిలోని వెంగళాయిపేటలో నూతనంగా నిర్మించుకున్న చర్చికి జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధర్మపురి నియోజకవర్గం ఇన్‌చార్జి లక్ష్మణ్‌కుమార్ సతీమణి కాంతకుమారి రూ. 7500 విలువగల సీలింగ్ ఫ్యాన్లు పాస్టర్లకు అందజేశారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, శేకర్ రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడి నియామకం

నవతెలంగాణ-మెట్‌పల్లిరూరల్

మెట్‌పల్లి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా వేంపేట్ గ్రామానికి చెందిన అల్లూరి సురేందర్ రెడ్డిని నియమిస్తూ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేనారెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మధు ఆదేశాలతో నియామక పత్రాన్ని రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, కోరుట్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏలేటి మహిపాల్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి మహేందర్‌రెడ్డి, నిజామాబాద్ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ గోరు మంతుల ప్రవీణ్‌కుమార్, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు అందె మారుతి, మెట్‌పల్లి మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, రాష్ట్ర నాయకులు బెజ్జరపు శ్రీనివాస్, ఇల్లెందుల రాజు, వెల్మల రాజరెడ్డి, తుమ్మల లింగారెడ్డి, నల్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలి

• బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క విజయ్‌కుమార్



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న విజయ్ కుమార్

నవతెలంగాణ- పెగడపల్లి

బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క విజయ్‌కుమార్ అన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మే నెల 7 హైదరాబాద్‌లో నిర్వహించే తెలంగాణ భరోసా సభ గోడ పత్రికను విజయ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ భరోసా సభకు ముఖ్య అతిథిగా ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి, బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు పార్వతి హాజరవుతారని, ఈ సభకు బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీలు మేధావులు విద్యార్థులు పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి నియోజకవర్గ మహిళా కన్వీనర్ ముంజ లీలా గౌడ్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నక్క గంగాధర్, వివియఫ్ నియోజకవర్గ కన్వీనర్ రామడుగు వెంకటేష్, ఎస్ఎస్‌యు జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అజయ్, సీనియర్ నాయకులు శంకర్, ధర్మారం మండల అధ్యక్షుడు గొడుగు అనిల్ కుమార్, గొల్లపల్లి మండల అధ్యక్షుడు తిరుపతి, మండల ఉపాధ్యక్షుడు కార్తీక్, గ్రామ శాఖ అధ్యక్షులు మల్యాల రవి , సైదుల విజయ్ జీవన్ ,రాకేష్ ,ప్రశాంత్, మహేష్ ,అజయ్, శేఖర్ ,సాయి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ రాజ్యాంగం దేశానికే దిక్సూచి



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జర్నలిస్టులు

నవతెలంగాణ-కోరుట్ల

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం దేశానికి దిక్సూచిగా ఉందని ఇంటర్నేషనల్ దళిత్ జర్నలిస్ట్ నెట్‌వర్క్ రాష్ట్ర నాయకుడు, సీనియర్ జర్నలిస్ట్ బలిజ రాజారెడ్డి అన్నారు. ఆదివారం కోరుట్ల పట్టణంలోని జాతీయ రహదారి బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే మనమంతా అనేక ఫలాలను పొందుతున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రపంచంలోనే ఎక్కడ లేని విధంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం దేశంలోని దళితులకు గర్వకారణమన్నారు. అలాగే రాష్ట్రంలోని రాజధాని అయిన హైదరాబాదులో దేశంలో ఎక్కడ లేని విధంగా సచివాలయాన్ని నిర్మించి ఆ సచివాలయానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నామకరణం చేయడం మరువలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం కోరుట్ల నియోజకవర్గ అధ్యక్షుడు బలిజ సంతోష్ కుమార్, నాయకులు ఏన్నం రాజ్ కుమార్ , ఉయ్యాల శోభన్, గురు మంతుల నారాయణ, ఇందిరాల హరీష్ , రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు, గొడుగులు పంపిణీ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్, పెన్షనర్స్, టీబీసీ జేఏసీ, వివిధ సంఘాల గౌరవ అధ్యక్షుడు, న్యాయవాది హరి ఆశోక్‌కుమార్ పెళ్లిరోజు వేడుకలు సీనియర్ సిటీజేన్స్,పెన్షనర్స్,టీ బీసీ జెఏసీ,తెలంగాణ మున్నూరు కాపు సంఘం,ఉద్యోగ భారతి,బీసీ ఉద్యోగుల జేఏసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం నేతాజీ కాలేజీ సమావేశ మందిరంలో జరిగిన ఈ వేడుకల్లో హరి ఆశోక్‌కుమార్ 10 మంది పేదలకు నూతన వస్త్రాలు, గొడుగులు, పాదరక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రెసా జిల్లా అధ్యక్షుడు ఎం.డి.వకీల్, కార్యదర్శి నవీన్,టీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు భోగ శశిధర్, కార్యదర్శి నాగేందర్ రెడ్డి, టీబీసీ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారి విజయ్, టీ పెన్షనర్స్ జిల్లా కార్యదర్శి బొల్లం విజయ్, మున్నూరు కాపు సంఘం జిల్లా నేత పుప్పాల గంగాధర్, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సచర్ సిఫార్సులను అమలు చేయాలి

• ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ డిమాండ్



మాట్లాడుతున్న ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బాస్

నవతెలంగాణ-కోరుట్ల

ప్రతి పేద ముస్లిం కుటుంబానికి రూ. 5లక్షల ఆర్థిక సాయం చేయాలని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోరుట్ల పట్టణంలోని సి. ప్రభాకర్ గ్రంథాలయంలో ఆవాజ్ జిల్లా సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహమ్మద్ అబ్బాస్ హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మైనార్టీలకి తీవ్రమైన అన్యాయం చేస్తున్నాయన్నారు. బడ్జెట్ కేటాయింపులలో, అలాగే కేటాయించిన నిధులు వారికి అండడం లేదన్నారు. నిరుద్యోగ సమస్యలు విపరీతంగా ఉందన్నారు. దళితులకు దళితబంధు ఇచ్చినట్టుగా మైనారిటీ వాళ్లకు మైనార్టీబంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకురాలు రజియా సుల్తానా, రెహనా బేగం, రిజియన, మహమ్మద్ షేక్ అలీ, మహమ్మద్ ముస్తాబ్ పాల్గొన్నారు.

టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మామిళ్ల రాజేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మారం జగదీశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాద్ నాంపల్లిలోని టీఎన్జీవో రాష్ట్ర సంఘ కార్యాలయంలో 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులతో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జగిత్యాల జిల్లా తరపున జిల్లా అధ్యక్షుడు భోగ శశిధర్, జిల్లా కార్యదర్శి నాగేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మామిళ్ళ రాజేందర్ రెండవసారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మారం జగదీశ్వర్ నూతనంగా, రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జగిత్యాల జిల్లా ఉద్యోగుల పక్షాన జిల్లా అధ్యక్షులు భోగ శశిధర్, జిల్లా కార్యదర్శి నాగేందర్‌రెడ్డి, నాయకులు అమరేందర్ రెడ్డి, రవీందర్, జిల్లా కార్యవర్గం వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-మెట్‌పల్లిరూరల్

మెట్‌పల్లి మండలం రామరావుపల్లె గ్రామంలో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున త్వరగా కొనుగోళ్లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు బాధ్యత తీసుకుని కొనుగోలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సల్ల నందు, డాక్టర్ పరంధాం, పుప్పాల గంగారెడ్డి, సల్ల గంగారెడ్డి, వల్లెం డ్రైవర్ మల్లయ్య చిలువేరి పెద్ద మల్లయ్య, రంభక్క, లక్ష్మి రాజా, కోడిపల్లి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయి

• కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి



జెర్సీలను అందజేస్తున్న సత్యం రెడ్డి

నవతెలంగాణ-మల్లాపూర్

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని, కిసాన్ కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వేంపల్లి గ్రామంలో క్రీడాకారులకు నూతన జెర్సీలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవికాలంలో యువకులు చెడు వ్యసనాలు బానిస కాకుండా క్రీడల వైపు వెళ్లాలని సూచించారు. క్రీడలను ప్రోత్సహించెందుకు తను ఎప్పుడు ముందు వరుసలో ముందుంటానని అన్నారు. క్రీడల వలన మానసిక ఒత్తిడి తగ్గి ఎల్లప్పుడూ ఉల్లాసంగా ఉండేందుకు క్రీడలు ఎంతో దోహదపడుతయి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పోతు శేఖర్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తోట సంతోష్, మారిశెట్టి మహేష్, మిట్టపల్లి జలపతి రెడ్డి, సత్యానారాయణ, గ్రంథాలయ ఇంచార్జ్ బదీనపల్లి వంశీ, తదితరులు పాల్గొన్నారు.

'మెట్‌పల్లి రహదారిలో' వెబ్ సిరీస్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న భాజపా నాయకుడు సురభి నవీన్

నవతెలంగాణ -మెట్‌పల్లి

మెట్‌పల్లి పట్టణంలోని నరేందర్‌రెడ్డి గార్డెన్‌లో లోకల్ టాలెంట్ దేశిబాయ్స్ యూట్యూబ్ ఛానల్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మెట్‌పల్లి రహదారిలో వెబ్ సిరీస్ పోస్టర్‌ను బీజేపీ కోరుట్ల నియోజకవర్గ నాయకుడు సురభి నవీన్ ఆవిష్కరించారు. మూఢ నమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం పట్టణానికి చెందిన యువకులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషకరమైన విషయమన్నారు. .ఈ వెబ్ సిరీస్‌కి పట్టణానికి చౌదరి శివకుమార్ డైరెక్షన్ వహిస్తుండగా దేవులపల్లి శంకర్ నిర్మిస్తుండడం వల్ల లోకల్ కళాకారులకు యువతి యువకులకు అవకాశాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో హీరో నక్క అజయ్ , బిజెపి పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్, జక్కని రంజిత్, ఉప్పె శ్రీకాంత్, వెంకీ లోగో, కప్ప వేణు, డైరెక్టర్ చౌదరి శివ కుమార్, నిర్మాత దేవులపల్లి శంకర్ ,తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మన్‌కి బాత్

నవతెలంగాణ -మెట్‌పల్లి

మెట్‌పల్లి మండలం జగ్గాసార్ గ్రామంలో ప్రధాని మన్‌కి బాత్ ఆదివారం నిర్వహించారు. ప్రధాని మోడీ ప్రజా సమస్యల పరిష్కారానికి మన్‌కి బాత్ 100వ ఎపిసోడ్‌ను నిర్వహిస్తున్నారని జగిత్యాల జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఇల్లెందుల శ్రీనివాస్, బిజెపి కోరుట్ల నియోజకవర్గం నాయకులు సురభి నవీన్‌కుమార్, బిజెపి మెట్‌పల్లి మండల అధ్యక్షులు కొమ్ముల రాజ్ పాల్‌రెడ్డి, ఎంపీటీసీ భోగ గంగాధర్ , సర్పంచ్ బద్దం సుగుణ రాజేష్ పాల్గొన్నారు.

తెలంగాణ భరోసా సభ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ - బోయినిపల్లి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బోయినిపల్లి మండల కేంద్రంలో ఆదివారం బీఎస్పీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా చొప్పదండి నియోజకవర్గ శేఖర్ హాజరై మాట్లాడారు. మే 7న హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ స్టేడియం గ్రౌండ్‌లో బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో 5 లక్షల మందితో తెలంగాణ భరోసా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మండలంలోని బడుగు బలహీన వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కార్యకర్తలతో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కమిటీ సభ్యుడు అక్కినపెల్లి శేఖర్, మండల అధ్యక్షుడు అలువాల అజయ్, నాయకులు ఉక్లేందుల అరుణ్, కస్నం అనిల్, బొడ్డు రాజలింగం, ఉక్లేందుల మనిదీప్, పొత్తూరి శేఖర్, పెగ్గర్ల మహేందర్, సందరగిరి రమేష్, ఎడపెల్లి ఈశ్వర్ పాల్గొన్నారు.

కామ్రేడ్ వేణుగోపాల్‌రావు ఆశయాలు కొనసాగిద్దాం

సీఐటీయూ ఆధ్వర్యంలో వర్ధంతి


నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-కరీంనగర్

కామ్రేడ్ వేణుగోపాల్‌రావు ఆశయాలు కొనసాగిద్దామని సీఐటీయూ కరీంనగర్ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ అన్నారు. నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకుడు, ఎస్సీజెడ్ఐఈఎఫ్ మాజీ అధ్యక్షుడు, ఏఐఐఈఏ మాజీ ఉపాధ్యక్షుడు కే.వేణుగోపాల్‌రావు రెండో వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్ల రమేష్ మాట్లాడారు. ఆల్ ఇండియా, జోనల్ కాన్ఫరెన్స్‌లలో, సీఐటీయూ సమావేశాలు, శిక్షణా తరగతుల్లో అతని ఆలోచనాత్మక చర్చలు, ప్రసంగాలు, ఇన్సూరెన్స్ వర్కర్‌లో అతని విశ్లేషణాత్మక రచనలు ఎంతో మందిని కార్మిక నాయకులుగా, క్యాడర్లుగా ఎంతో గొప్పగా తీర్చిదిద్దాయని అన్నారు. ఎల్ఐసీ ఉద్యోగ సంఘం ఏఐఐఈఏ తెలుగు మాస పత్రిక కార్మిక వాహిని సంపాదకునిగా కొత్త రచయితలను, కాలమిస్టులను ప్రోత్సహించాడని వివరించారు. ఆయన రచనలు కవిత్వ వ్యక్తీకరణలు, శ్రామిక వర్గ స్పృహతో నిండి ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి, జిల్లా కమిటీ సభ్యులు ముల్కల శ్రీనివాస్, నాయకులు వెంకన్న, రుద్రారపు అజయ్, పల్లె సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి ఆరేండ్ల బాలిక మృతి

తండ్రి ట్రాక్టరే ప్రమాదానికి కారణం..

తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలో విషాదం

నవతెలంగాణ - తంగళ్ళపల్లి




రుత్విక (ఫైల్)

అప్పటి వరకు తండ్రిచెంత ఆడుకొని.. అంతలోని తండ్రి నడుపుతున్న ట్రాక్టర్ కిందపడి కూతురు మృతిచెందిన విషాదకరమైన సంఘటన తంగళ్ళపల్లి మండలంలో ఆదివారం సాయంత్రం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామానికి చెందిన ముద్దం సురేష్, స్వప్న దంపతులు కూలీ పనిచేసుకుంటూ ఆరేండ్ల కూతురు రుత్వికను పోషించుకుంటున్నారు. ఓ పొలంలో ఖనీలు పాతేందుకు తన కూతురును వెంట బెట్టుకుని పోలాని వెళ్ళాడు. అక్కడ పనిచేస్తుండగా ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తున్న తండ్రి తన కూతురు పక్కన కూర్చోబెట్టుకున్నాడు. ఈ తరుణంలో ఒక్కసారిగా రుత్విక కింద పడిపోవడంతో ట్రాక్టర్ టైర్ తలపైనుంచి వెళ్లింది. దీంతో చిన్నారి అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న తల్లి, కుటుంబ సభ్యులు సంఘటన చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ ఘటనను చూసిన గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రపంచానికే దిక్సూచి

- ఉద్యమాల గడ్డ జ్ఞాన గడ్డగా మారలి





నవతెలంగాణ - వీర్నపల్లి

ఉద్యమాల గడ్డ మీద ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జ్ఞాన గడ్డగా మారాలని డాక్టర్ జే ఎస్ పరన్‌జ్యోతి అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా, వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామంలో విశ్వరత్న, భారతరత్న ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ విగ్రహాన్ని సడిమెల ఎల్లయ్య, స్థానిక సర్పంచ్ నందగిరి లింగం, ఎంపీపీ భూలా, జెడ్పీటీసీ కళావతి, ప్రజా ప్రతినిధులతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దళితరత్న డాక్టర్ జేఎస్ పరన్‌జ్యోతి మాట్లాడుతూ ఒక ప్రేరణ మన భావావేశాలకు అడ్డుకట్ట వేసి జ్ఞానదీపం వెలిగించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసే భావాజాలం అంబేద్కరిజం. అన్ని వర్గాలకు సైతం అందరం ఎక్కించే పరమన్నత భావజాలం అంబేద్కరిజం. ఐకమత్యంతో గ్రామీణ ప్రాంతంలో పల్లెల్లో గ్రామస్థులు అందరు కలసి ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించుకోడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో గ్రామాలలో ఉన్న యువకులకు విద్యార్థులకూ అంబేద్కరిజం గూర్చి తెలియజెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత మోహన్ నాయక్, విగ్రహ ప్రతిష్టస్థాపన కమిటీ అధ్యక్షులు మోతిలాల్ నాయక్, విగ్రహ ప్రతిష్ట స్థాపన కమిటి సభ్యులు, ప్రజా ప్రతినిధులు నాయకులు, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేల చిట్టా బహిరంగపరచాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బెజ్జంకి అనిల్ మాదిగ


నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ - కరీంనగర్ : దళితబంధు పథకంలో లబ్దిదారుల వద్ద రూ.3లక్షలు తీసుకున్న ఎమ్మెల్యేల చిట్టాను ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ప్రజల ముందు వెంటనే బహిరంగపరచాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బెజ్జంకి అనిల్ మాదిగ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఎంఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ధర్నా చేసి మాట్లాడారు. దళిత బంధులో ఎమ్మెల్యేలు తీసుకున్న డబ్బులను తిరిగి లబ్ధిదారులకు ఇప్పించాలని డిమాండ్ చేశారు. దళిత బంధులో ఎమ్మెల్యేల జోక్యాన్ని తగ్గించి దళితులకు న్యాయం చేయాలన్నారు. అవినీతి లేకుండా దళిత బంధును అమలు చేయాలని డిమాండ్ చేశారు. అవినీతికి పాల్పడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరిని దళిత ప్రజలు గమనించి రాజకీయంగా తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఎమ్మెల్యే చిట్టా బయటపెట్టేంత వరకూ పోరాటం ఆగదని, మే 2 నుంచి 9 వరకు అన్ని నియోజకవర్గాల్లో నిరాహార దీక్షలు చేపడతామని, మే 10న వేలాదిమందితో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్లను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజం వెంకటస్వామి మాదిగ, నక్క లక్ష్మణ్ మాదిగ, సామర్ల ప్రభాకర్ మాదిగ, నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్, సీఎం కేసీఆర్ చిత్రపటాలకు టీజీప ఆధ్వర్యంలో పాలాభిషేకం


చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న టీజీఏ నాయకులు

నవతెలంగాణ - సిరిసిల్ల

బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావం విలువలతో అనగారిన వర్గాల అభ్యున్నతికి అనునిత్యం శ్రమిస్తున్న దర్శకుడు సీఎం కేసీఆర్ అని తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు చిలుముల జయవర్ధన్ అన్నారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి సీఎం కేసీఆర్ చరిత్ర సృష్టించారని, తెలంగాణ పరిపాలన సౌధానికి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సచివాలయం అని నామకరణం చేసి ఆ మహాశయునికి ఘనమైన నివాళులు అర్పించారన్నారు. సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతూ ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో టీజీఏ ఆధ్వర్యంలో కేసీఆర్, అంబేద్కర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నగునూరి శేఖర్, డివిజన్ అధ్యక్షుడు పొన్నం అఖిల్ గౌడ్, నగునూరి పరశురాములు, అన్నలదాస్ కుమార్, మచ్చ మార్కండేయులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో పారమిత విద్యార్థుల ప్రభంజనం

నవతెలంగాణ - కరీంనగర్


జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన పారమిత విద్యార్థులతో అధ్యాపక బృందం

ఐఐటీ జేఈఈ మెయిన్స్ ఫలితాలలో మొదటి విద్యా సంవత్సరంలోనే 47 శాతం మంది పారమిత విద్యార్థులు ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించి తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశ చరిత్రలో విశేషమైన ఘనత సాధించారని పారమిత పాఠశాల చైర్మెన్ డాక్టర్ ఈ.ప్రసాదరావు తెలిపారు. పారమిత ఐబిస్ పాఠశాల నుంచి మొత్తం 38 మంది విద్యార్థులు మొదటిసారి పరీక్ష రాయగా అందులో ఎం.తేజేశ్వర్ 99.41తో ప్రథమ, కె.హర్షవర్ధన్‌రెడ్డి 98.48తో ద్వితీయ, వేముల అభినయ 96.90 పర్సంటైల్ సాధించి తృతీయ స్థానంలో నిలిచారు. మొత్తం 38 మంది విద్యార్థులు ఐఐటీ జేఈఈ మెయిన్స్ పరీక్ష రాయగా అందులో 18 మంది ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించి రికార్డు సృష్టించారు. అలాగే 10 మంది విద్యార్థులు 90కి పైగా పర్సంటైల్ సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పారమిత పాఠశాల చైర్మెన్ డాక్టర్ ఈ.ప్రసాదరావు మాట్లాడుతూ.. దృఢమైన అభ్యాసం, పర్యవేక్షణ విజయానికి కారణమని అన్నారు. అనంతరం విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాలల డైరెక్టర్ రశ్మిత, అనుకర్‌రావు, ప్రసూన, వీయూఎం ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకర్, సమన్వయ కర్త నాగరాజు తదితరులున్నారు.

వాసవి మాత జయంతి ఉత్సవాలు



నవతెలంగాణ - ముస్తాబాద్ : ఆర్య వైశ్యుల ఆరాధ్య దైవం వాసవి మాత జయంతి ఉత్సవాలు మండల కేంద్రంలో ఆదివారం వైభోగంగా నిర్వహించారు. శివ కేశవ ఆలయాలనుండి మండలంలోని ఆర్యవైశ్య దంపతులు 108 మంది కళశాలను పట్టుకుని పురవీధులలో అమ్మవారి విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. పోతుగల్ రోడ్ కూరగాయల మార్కెట్లో ఉన్న శివాలయంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవికి అభిషేకాలు నిర్వహించారు అనంతరం చందా విజయ్ కుమార్ అన్న దానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కూర బిక్షపతి, నాయకులు గందే చంద్రం, బండారి సత్తయ్య, కూర నగేష్, ఎంకే.రమేష్, అరవైపెల్లి సుదర్శన్, ఉప్పల చంద్రం, పప్పుల శ్రీకాంత్, కూర సంతోష్, మేడిశెట్టి రమేష్ నందకుమార్, నారాయణ, అమర్, అనిల్ కుమార్, చంద్రం, శ్రీనివాస్, బాలరాజు పాల్గొన్నారు.

నవతెలంగాణ - కరీంనగర్

వాసవి మాత జయంతిని పురస్కరించుకొని నగరంలోని కన్యక పరమేశ్వరీ దేవాలయంలో వాసవి వనిత క్లబ్, వాసవి వనిత ఏంజిల్స్ సంయుక్తంగా 102 రకాల హారతులతో అమ్మవారికి పూజలు అందించారు. ఒకే డ్రెస్ కోడ్‌తో 102 మంది, 102 గోత్రాల వారు పాల్గొన్నారు. పూజలు, అభిషేకాలు, పారాయణములు, హారతులతో భక్తి, శ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత ప్రెసిడెంట్ డాక్టర్ సౌమ్య, కృప, అరుణ, శ్రీలత, మంజుల, రజిత, కృష్ణకుమారి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి


సమ్మెలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు

నవతెలంగాణ - వీర్నపల్లి

వీర్నపల్లి మండలం అమరవీరుల స్మారక స్తూపం వద్ద పంచాయతీ కార్యదర్శులు నిరవధిక సమ్మె కొనసాగింది. గ్రామ పంచాయతీ కార్యదర్శుల మండల అధ్యక్షుడు బానోతు రాజు నాయక్ మాట్లాడారు. జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, తమను రెగ్యులరైజ్ చేసి సీనియర్ అసిస్టెంట్ పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్, రాములు, మహేష్, రమేష్, కుమార్, ప్రవీణ్, పురుషోత్తం, రణధీర్, కృష్ణ, రాజు, ఉస్మాన్, జ్యోతి ఉన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

నవతెలంగాణ - సైదాపూర్



మండలం ఎగ్లాస్పూర్ గ్రామంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాస్థానంలో ఆరాధాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్త రాజిరెడ్డి, నర్సింగోజు లక్ష్మీనారాయణ, నర్సింగోజు నర్సయ్య సంపత్, శ్రీనివాస్, తదితరులు పొల్గొన్నారు.

నేడు శ్రీచైతన్య స్కాలర్ షిప్ టెస్ట్-2023

-బహుమతులతో పాటు వంద శాతం ఫీజు రాయితీ

-శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత ముద్దసాని రమేష్ రెడ్డి

నవతెలంగాణ-కరీంనగర్

పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య గ్రూప్ ఆఫ్ జూనియర్ కళాశాల సువర్ణవకాశం అందిస్తున్నట్టు విద్యాసంస్థల అధినేత ముద్దసాని రమేష్‌రెడ్డి తెలిపారు. శ్రీచైతన్య స్కాలర్ షిప్ టెస్ట్-2023 సోమవారం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులకు కార్పోరేట్‌కు విద్యాసంస్థలకు ధీటుగా శ్రీచైతన్య విద్యాసంస్థలు విద్యను అందిస్తున్నాయని అన్నారు. ఈ అవకాశాన్ని పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉత్తర తెలంగాణలో నాణ్యమైన విద్యకు బ్రాండ్‌గా పేరుగాంచిన తమ శ్రీచైతన్య గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో అన్ని వర్గాల ప్రజలకు టెస్ట్ వచ్చిన మార్కులు అధారంగా విద్యార్థులకు బహుమతులతో పాటు వంద శాతం ఫీజు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. పేద, మధ్య తరగతి కుటుంబానికి చెందిన విద్యార్థులు ఆర్థిక సహకారం, ప్రోత్సాహం అందిస్తే చదువులో సత్తా చాటుతాం అనే విద్యార్థుల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దీంతో పేద, మధ్య తరగతి విద్యార్థుల కలలను నెరవేర్చినట్లు అవుతుందన్నారు. నాణ్యమైన విద్యకు, ఉత్తమ ఫలితాల రాష్ట్ర స్థాయి ర్యాంకులతో ఉత్తర తెలంగాణలో బ్రాండ్‌గా, నాణ్యమైన విద్యకు కేరాఫ్‌గా నిలుస్తున్న శ్రీచైతన్య జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ప్రతిభా వంతులైన, అర్హులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందించడం ద్వారా నిరంతరం విద్యలో ముందుకు సాగుతోందన్నారు. అన్ని వర్గాల విద్యార్థుల కోసం వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్నట్లు తెలిపారు. 1న క్రిస్టియన్ కాలనీలోని మిషన్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న వైఎస్‌రావు కాంప్లెక్స్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి 11.30 నిమిషాల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన, ప్రతిభా వంతులైన విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మొదటి బహుమతిగా ల్యాప్‌టాప్, రెండు నుంచి 5 ప్రైజ్‌లకు ట్యాబ్స్, దీంతో పాటు విద్యార్థులకు మెరిట్ ప్రకారం వంద శాతం రాయితీతో పాటు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆయా పాఠశాలల యాజమాన్యాన్ని కూడా సన్మానించనున్నట్లు తెలిపారు.

హక్కుల రక్షణకు అవిశ్రాంతంగా పోరాడుదాం

బీజేపీ దుర్మార్గాన్ని ఎదురిద్దాం

8గంటల పని కార్మికుల జన్మహక్కు



నవతెలంగాణ - సింగరేణి ప్రతినిధి:

ప్రపంచవ్యాప్తంగా దేశం ఏదైనా ..ఏ రంగంలోనైనా శారీరకంగా, మానసికంగా శ్రమించేది కార్మికులే.. వారే సంపద సృష్టికర్తలు. అంతరిక్షానికి రాకెట్లను పంపినా... కృత్రిమ మేధతో సాంకేతిక విప్లవాన్ని సృష్టించినా.. పెట్టుబడిదారుల కనుసన్నులలో పనిచేసే పాలకవర్గాలు తమ ఆధిపత్యాన్ని కొనసాగించటం కోసం శ్రామికుడిని మధ్యయుగాలనాటి బానిసలుగా మార్చాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇందుకు పోలీసు బలగాలను ప్రయోగించి కార్మికులపై ఉక్కు పాదం మోపుతున్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి విశ్వవ్యాప్తంగా అమలులో ఉన్న ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచుతూ భారత ప్రభుత్వం నిర్ణయించింది. కార్మికులు మనుషులేనని, వారి శ్రమకు తగిన ఫలితం... శ్రమించడానికి అవసరమైన విశ్రాంతి కోసం మళ్లీ పోరాటాలకు సిద్ధపడాలి. ఇందుకు ఐక్య పోరాట వేదికలు నిర్మాణం కావాలి. ఎర్రజెండాల నేతత్వంలో, బూర్జువా పార్టీల అండతో నడిచే కార్మిక సంఘాలు భుజం భుజం కలిపి త్యాగాలతో కూడిన పోరుబాటకు పిడికిలెత్తాలి.

దేశంలో అధికారం చెలాయిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరు కార్మికులకు వ్యతిరేకంగా ఉంది. ఉపాధి కల్పనకు గుండెకాయగా నిలిచిన బొగ్గు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం వేలానికి పెట్టింది. పరిశ్రమలో కాంట్రాక్టర్ల పెత్తనం పెరిగింది. బొగ్గు గనులను ప్రైవేటుకరించడం పాత మాట, సిఐఎల్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలోని బొగ్గు గనుల విస్తరణకు అవకాశాలు లేకుండా చేసి వీటిని చంపడానికి మోడీ ప్రభుత్వం కత నిశ్చయంతో పావులు కదుపుతున్నది.

విశ్వకర్మ పేరిట విభజన

విశ్వకర్మ సేవ పేరిట కార్మికుల మధ్య మతం గోడలు నిర్మించి, పోరాటాల నుంచి కార్మికులను దూరం చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్ను తున్నది. కార్మికులు, యజమానులది తండ్రి, కొడుకుల సంబంధంగా పేర్కొంటూ వారిని బుజ్జగించి, బ్రతిమాలి హక్కులు పొందాలి. తప్పించి సమ్మెలు, ఉద్యమాలు చేయరాదని పేర్కొంటున్నది. ఇందుకోసం బలమైన ప్రచారాన్ని అధికారం అండతో చేస్తున్నది. పలు రాష్ట్రాలలో 12 గంటల పని దినాలను ప్రవేశపెట్టి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు వ్యతిరేకంగా ఆయా రాష్ట్రాల్లో కార్మికులు పోరాడుతున్నారు. 137వ మేడే వార్షికోత్సవాలు జరిగే వారం రోజుల ముందు తమిళనాడు ప్రభుత్వం12గంటల పనిని ప్రవేశ పెడుతూ ఉత్తర్వులు ఇచ్చింది. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం తన ఉత్తర్వులను రద్దు చేసుకుంది.

రైతు పోరాటాలే స్ఫూర్తి

దేశానికి అన్నం పెడుతున్న రైతులకు వ్యతిరేకమైన మూడు చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. వీటికి వ్యతిరేకంగా సంవత్సరం పైబడి పోరాడిన దేశ రైతులు ప్రపంచ పోరాటానికి కొత్త శక్తిని ప్రసాదించారు. 720 మంది రైతుల బలిదానంతో సంఘటిత రైతు శక్తికి బిజెపి ప్రభుత్వం తలవంచింది. మూడు రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. రైతులకు క్షమాపణలు చెప్పింది కూడా .ఇదే రీతిన కార్మికులను, కర్షకులను, సబ్బండ వర్గాలను కూడగట్టి పోరాడాల్సిన అవసరం ఉంది. దేశంలోని విలువైన ఖనిజ సంపదను తన కార్పొరేట్ మిత్రులకు దోచి పెట్టడానికి కేంద్రం ప్రయత్నాలు చేస్తున్నది. క్విడ్ ప్రో కో పద్ధతిన పరస్పర అవగాహనతో పెట్టుబడిదారులు, బిజెపి ప్రభుత్వం కలిసి పనిచేస్తున్నది. అక్రమంగా వచ్చిన డబ్బులను ఎన్నికలలో వినియోగించి అధికార పీఠాన్ని దక్కించుకునే పద్ధతి అమలు పరుస్తున్నారు. అసమాన త్యాగాలతో ఎర్రజెండా పార్టీలు అగ్ర భాగాన నిలబడి, ప్రాణ త్యాగాలకు వెరవకుండా పోరాడితేనే దేశాన్ని పెట్టుబడిదారుల నుండి రక్షించుకోవచ్చు. ప్రజలను నయా పాసిజం నుండి కాపాడుకునే అవకాశం ఉంటుంది.

త్యాగాలకు సిద్ధం కండి

సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్



'హే' మార్కెట్లో కార్మికుల ప్రాణ త్యాగాల ద్వారా 8 గంట ల పని చట్టంతో పాటు అనేక హక్కులు సాధించ బడ్డాయి. పెరిగిన పనిగంటల వలన కార్మికుల ఆరోగ్యం చెడిపోతుంది కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం అవుతుంది.

కార్మికులారా ఆలోచించండి

రియాజ్ అహ్మద్, అధ్యక్షుడు

హెచ్ఎంస్ తెలంగాణ రాష్ట్రం



కార్మికుల కష్టాలు తీరడానికి సింగరేణి సంస్థ రక్షణకు నిస్వార్థంగా పోరాడవలసిన అవసరం ఉన్నది హెచ్ఎంఎస్ పోరాటాల వలన సింగరేణి కార్మికులకు న్యాయం జరిగింది యాజమాన్యం దిగివచ్చి సమస్యలను పరిష్కరించింది కార్మికులు ఆలోచించి ప్రభుత్వ అనుకూల సంఘాలను దూరం పెట్టాలని కోరారు

కేంద్రం మెడలు వంచాలి

కెంగర్ల మల్లయ్య, టీబిజికెఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్



భారతదేశ ప్రభు త్వ రంగ సంస్థలలో నూరు శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టు బడులను కేంద్ర ప్రభుత్వం అనుమ తించింది బొగ్గు బ్లాకులను ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వాలని నిర్ణయించింది ఇది దేశంలోని కార్మికుల కు తెలంగాణ ప్రజలకు నష్టదాయ కం సింగరేణి కార్మికులు తమ శక్తిని మరోమారు ప్రదర్శించాలి.

నూతన సచివాలయంలో మంత్రి కొప్పులకు సత్కారం

సత్కరించిన జిల్లా ప్రజా ప్రతినిధులు, కలెక్టర్

నవ తెలంగాణ-పెద్దపల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను పెంచే విధంగా అత్యద్భుతంగా నిర్మించిన నూతన సచివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లు పాల్గొన్నారు. సచివాలయం గ్రౌండ్ ఫ్లోర్‌లోని తన ఛాంబర్‌లో ఆదివారం బాధ్యతలు తీసుకున్న మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, ఎమ్మెల్సీ రమణ, పోలీస్ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ కోలేటి దామోదర్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే కోరుకంటి చందర్

నవతెలంగాణ-గోదావరిఖని: తెలంగాణ రాష్ట్ర నూతన సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌ను రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు పూలబొకే అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.



సీఎంకు బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే

బీఎస్పీలో చేరిన గోలివాడ ప్రసన్నకుమార్

నవతెలంగాణ-గోదావరిఖని: బీఆర్ఎస్ రామగుండం నియోజక వర్గ యువజన విభాగం అధికార ప్రతినిధి గంగపుత్ర బెస్త సంఘం యువజన విభాగం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ప్రసన్న కుమార్ బీఎస్పీలో చేరారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీఎస్పీ కార్యాలయంలో ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ సమక్షంలో పార్టీలో చేరగా, ఆయనకు కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఎస్పీ రామగుండం ఇన్‌ఛార్జి దేవనూరి సంపత్ కుమార్, గడ్డం జీవన్, గుందేటి మహేందర్, అజయ్‌కుమార్, సిలివేరి రవి కుమార్, చౌటి సతీష్ తదితరులున్నారు.



కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్

నేడు శ్రీ భూనీళ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణం

నవతెలంగాణ-గోదావరిఖని: గోదావరిఖని బస్టాండ్ ఏరియాలోని ఆర్టీసీ డిపో వద్ద ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నేడు శ్రీ భూనీళ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు అచ్చ వేణు, గోటిగారి శ్రీనివాస్, సోంగాని వెంకటేశ్వర్లు, రాములు, మిట్ట శంకరయ్య, బీమావరపు కోటేశ్వర్ రావు, దేవీ లచ్చయ్య ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీవారికి శాంతి కల్యాణం నిర్వహించిన అనంతరం అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కల్యాణం తిలకించి, తరించి ముక్తి పొందాలని కోరారు.

మధన్న రుణం తీర్చుకోలేం.

బ్రిడ్జి నిర్మాణానికి నిధుల మంజూరీపై రైతుల హర్షం

నవతెలంగాణ-మంథని: ఏండ్ల తరబడి కష్టాలు పడుతుంటే ఏ నాయకుడు పట్టించు కోలేదని, తమ బాధలు చెప్పుకున్న వెంటనే వంతెన నిర్మానానికి నిధులు మంజూరు చేసిన మధన్న రుణం తీర్చుకోలేనిదని మంథని మండలం ధర్మారం రైతులు అన్నారు. మంథని మండలం ధర్మారం గ్రామ సమీపంలోని పోచమ్మ వాగుపై బ్రిడ్జి నిర్మానంతో పాటు గద్దలపల్లి నుంచి రామకృష్టాపూర్ వరకు రహదారి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడం పట్ల గ్రామ రైతులు ఆనందం వ్యక్తం చేశారు. జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు బ్రిడ్జి నిర్మాణ శంఖుస్థాపన కోసం మండల పార్టీ అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్‌తో పాటు గ్రామ రైతులు స్థల పరిశీలన చేశారు. అనేక ఏండ్లుగా పోచమ్మవాగు మీదు నుంచే పంట పొలాలకు వెళ్తున్నామని, వాగు ఉప్పొంగితే అనేక ఇబ్బందులు ఎదుర్కొనే వారమన్నారు. గత పాలకులు ఏనాడు పోచమ్మవాగుపై వంతెన నిర్మాణం చేయాలని ఆలోచన చేయలేదని తెలిపారు. అలాగే గద్దలపల్లి నుంచి రామకృష్టాపూర్‌కు రహదారి నిర్మాణం జరిగితే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. బ్రిడ్జి నిర్మాణంతో పాటు రహదారి నిర్మాణానికి నిధులు మంజూరీ చేయించిన జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌కు గ్రామస్తులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



బ్రిడ్జి నిర్మాణ శంకుస్థాపన స్థలాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు శంకర్ గౌడ్

కొన్ని సంఘాల కుట్రపూరిత ఆలోచనతో వెజ్‌బోర్డు జాప్యం



బొగ్గు పరిశ్రమల ఇంచార్జ్, జెబిసిసిఐ సభ్యులు కొత్త కాపు లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-గోదావరిఖని:

11వ వేతన సవరణ ఒప్పంద సమావేశాలలో శరవేగంగా ముందుకు సాగిన చర్చలు, పురోగతిని కొన్ని సంఘాలు కుట్రపూరితమైన ఆలోచన విధానంతో చేయడం మూలంగా జాప్యం జరుగుతున్న మాట వాస్తవమని బొగ్గు పరిశ్రమల ఇంచార్జ్, జెబిసిసిఐ సభ్యులు కొత్త కాపు లక్ష్మారెడ్డి అన్నారు. సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ కేంద్ర కార్యవర్గ సమావేశం గోదావరిఖని మార్కండేయ కాలనీలోని విశ్వహిందూ పరిషత్ భవన్‌లో అధ్యక్షులు యాదగిరి సత్తయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాన్ని నిర్భయంగా చెప్పే జాతీయ కార్మిక సంఘం బిఎంఎస్ మెరుగైన వేతన ఒప్పందానికి కృషి చేస్తుందని, తదుపరి సమావేశంలో మెరుగైన అలవెన్సులు, మౌలిక సదుపాయాలు, సామాజిక భద్రత, బొగ్గు గని కార్మికులకు కల్పించడానికి కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు టిఎస్.పవన్ కుమార్, మాధవ నాయక్, మండల రమాకాంత్, పులి రాజారెడ్డి, పేరం రమేష్, పొన్నమనేని వేణుగోపాల్ రావు తదితరులున్నారు.

సొంతగూటికి చిలుముల కుమార్

బీఆర్ఎస్ నుంచి బీఎస్పీ లోకి 100 మంది చేరిక

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్: కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రం అంబేద్కర్ చౌరస్తా వద్ద చిలుముల కుమార్ (పందిల్ల) బీఆర్ఎస్ పార్టీ నుండి 100 మంది కార్యకర్తలతో ఆదివారం బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ ఇంచార్జి దాసరి ఉష వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కేవలం బహుజన్ సమాజ్ పార్టీలోనే గౌరవం దక్కుతుందన్నారు. ఆరు నెలలకు ముందు చిలుముల కుమార్‌ని బీఆర్ఎస్ నాయకులు భయభ్రాంతులకు గురిచేసి పార్టీలోకి తీసుకున్నారని, అందులో గౌరవం దక్కకపోవడంతో వంద మంది కార్యకర్తలతో సొంత గూటికి వచ్చారని తెలిపారు. రానున్న రోజుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలందరూ ఏకమై బహుజన రాజ్యాధికారం వైపు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మే 7న జరిగే తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ పెద్దపల్లి అసెంబ్లీ అధ్యక్షులు బోంకూరి దుర్గయ్య, అసెంబ్లీ కోశాధికారి ఎండీ రియాజ్, కాల్వ శ్రీరాంపూర్ మండల అధ్యక్షులు కుమ్మరికుంట రవికుమార్, మండల కార్యదర్శి కోరే కిరణ్, శ్రీరాంపూర్ గ్రామ మహిళా కన్వీనర్ కుమ్మరికుంట శారద, మెర్గవెన సంపత్, దొడ్డ లావణ్య, నూనె రమ్య, పలకని సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఎస్పీ నియోజకవర్గ ఇంఛార్జి దాసరి ఉష

గ్రూప్స్ అభ్యర్థులకు పుస్తకాలు అందజేత

నవతెలంగాణ-జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్ గ్రామంలో గ్రూప్స్ పరీక్ష రాయడానికి సిద్ధమవుతున్న యువతకు కేసీఆర్ సేవా దళం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జూలపల్లి జడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు లక్ష్మణ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జై తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నల్లల కనకరాజు, కెసిఆర్ సేవా దళం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు దండే వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి చాతళ్ళ కాంతయ్య, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి బొద్దుల సాయినాథ్, సంబోజి శంకరయ్య, నల్లల మల్లయ్య, గొడిశేల శ్రీనివాస్, అమరగాని సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అనాగరిక పెట్టుబడి దారి దోపిడీ నుండి విముక్తి కలగాలి

సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆర్జీ 2 డివిజన్ కార్యదర్శి ఉల్లి మొగిలి

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ:

అనాగరిక పెట్టుబడి దారి దోపిడీ నుండి విముక్తి కోసం సీఐటీయూ పోరాటం చేస్తుందని సీఐటీయూ ఆర్జి.2 డివిజన్ కార్యదర్శి ఉల్లి మొగిలి తెలిపారు. ప్రపంచంలో ఉద్యోగాల కోసం, జీతాల కోసం, పని చేసే చోట భద్రత కోసం వారు గెలుచుకున్న హక్కులను నిలుపుకోవడం కోసం , వ్యక్తిగత దాడులకు సైతం వెరవకుండా పోరాడుతున్న ప్రపంచంలోని అన్ని వర్గాల కార్మికులకు, కష్టజీవులకు ఈ మేడే సందర్భంగా సీఐటీయూ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. సామ్రాజ్యవాదం మీద పెట్టుబడిదారీ దోపిడి మీద సీఐటీయూ ఎప్పటికీ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందన్నారు.



తెలంగాణ భరోసా సభకు వేలాదిగా తరలిరండి

బీఎస్పీ నియోజకవర్గ ఇంఛార్జి దాసరి ఉష

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్: హైదరాబాద్‌లో మే 7న జరుగుతున్న తెలంగాణ భరోసా సభకు వేలాదిగా తరలి రావాలని బీఎస్పి నియోజకవర్గ ఇంచార్జ్ దాసరి ఉష పిలుపునిచ్చారు. ఆదివారం బీఎస్పీ జిల్లా పార్టీ కార్యాలయంలో బహిరంగ సభ గోడ పత్రికలు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ.. అవినీతి, మోసాలతో విసిగివేసారిన తెలంగాణ ప్రజలకు భరోసా కల్పించాలని బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు, ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇంఛార్జి మొలుమురి చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు తోట వెంకటేష్ పటేల్, జిల్లా కోశాధికారి గడ్డం శేషాద్రి, అసెంబ్లీ అధ్యక్షులు బొంకురి దుర్గయ్య, ఉపాధ్యక్షులు నార్ల గోపాల్ యాదవ్, కోశాధికారి ఎండీ రియాజ్, అసెంబ్లీ మహిళా కన్వీనర్ ఆముదాల అరుణ, పెద్దపల్లి పట్టణ అధ్యక్షురాలు రామిల్ల శారద, సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షులు తోట మధు, సుల్తానాబాద్ మండల కోశాధికారి అల్లెపు చంద్రశేఖర్, పెద్దపల్లి మండల కోశాధికారి ప్రశాంత్, సీనియర్ నాయకులు రవీందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

షరతులు విధించకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ పెద్దపల్లి జిల్లా చైర్మన్ సురేందర్ రెడ్డి

నవతెలంగాణ-మంథని: మంథని మున్సిపల్ పరిధిలోని పోచమ్మ వాడ, మంథని మండలం కన్నాల గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా చైర్మన్ ముస్కుల సురేందర్ రెడ్డి సందర్శించి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రం నిర్వాహకులు రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని, కేంద్రంలో అన్ని సదుపాయాలు కల్పించాలని అన్నారు. మంథని మార్కెట్ కమిటీలో నిర్మించిన రైతు భవనం రైతులకు ఉపయోగ పడే విధంగా చూడాలన్నారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని షరతులు విధించకుండా కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మంథని మండల అధికార ప్రతినిధి తోకల మల్లేష్, నాయకులు ఐలి.ప్రసాద్, బండారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేందర్ రెడ్డి

ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన

నవతెలంగాణ-మంథని: మంథని వాసు మతి రెనె హాస్పిటల్ బంగారూ స్వామి నేతృత్వంలో సహాయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మంథని మున్సిపాలిటీ పరిధిలోని గంగాపూరిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది. గంగపూరితో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి సుమారు 250 మంది రోగులకు సేవలు అందించారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం వారికి మందులను పంపిణీ చేసారు. శిబిరంలో వైద్యులు ఎంబీబీస్ డాక్టర్ మునిరుద్దీన్ పాషా వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో సహాయ చారిటబుల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు, మంథని ఆర్డిఓ అడ్మినిస్ట్రేషన్ అధికారి తూము రవీందర్, చైర్మన్ మేడగొని వెంకటేష్ గౌడ్, ఉపాధ్యక్షులు బొడ్డు.సతీష్, కార్యదర్శి బుధ్ధర్తి సతీష్ కుమార్, సభ్యులు ఏగోళపు సంతోష్, హాస్పిటల్ సిబ్బంది శేఖర్, శ్రీధర్ పాల్గొన్నారు.



శిబిరానికి సుదూర ప్రాంతాల నుండి తరలివచ్చిన ప్రజలు

బొక్కల వాగు ఆయకట్టు రైతులను కాపాడండి

కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ పెద్దపల్లి జిల్లా చైర్మన్ ముస్కుల సురేందర్ రెడ్డి

నవతెలంగాణ-మంథని: అడ్యల ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు నుండి వస్తున్న మట్టి, కలుషిత బొగ్గు నీటితో (కన్నాల ప్రాజెక్టు) బొక్కల వాగు రోజురోజుకు కనుమరుగవుతుందని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ పెద్దపల్లి జిల్లా చైర్మన్ ముస్కుల సురేందర్ రెడ్డి (కన్నాల ప్రాజెక్టు) అన్నారు. బొక్కల వాగును రైతులతో కలిసి ఆయన ఆదివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కన్నాల ప్రాజెక్టు కింద సుమారు 3000 ఎకరాల పంట పొలాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఓపెన్ కాస్ట్ నుండి వచ్చే నల్లని బొగ్గు నీరు రావడంతో కన్నాల ప్రాజెక్టు కింద ఉన్న పంట పొలాలు దిగుబడి రాకా రైతులు నష్టపోతున్నారని తెలిపారు. కన్నాల ప్రాజెక్టు నుండి మంథని మండల పరిధిలోని శీల సముద్రం, అయ్యగారి చెరువు, రావుల చెరువు, తమ్మచెరువు, బన్నే చెరువులోకి సింగరేణి ఓపెన్ కాస్ట్ నీరు ప్రవహిస్తుండడంతో కాలువలతో పాటు చెరువులు కూడా బొగ్గు నీటితో నిండిపోయి, పంట పొలాలు పండలేని పరిస్థితులు దాపరించాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత సింగరేణి అధికారులు చర్యలు తీసుకుని, కన్నాల ప్రాజెక్టును కాపాడాలని కోరారు. ఆయన వెంట నాయకులు బండారి ప్రసాద్, తోకల మల్లేష్, ఐలి ప్రసాద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కన్నాల ప్రాజెక్టు, బొక్కల వాగును పరిశీలిస్తున్న కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా చైర్మన్ సురేందర్ రెడ్డి

నూతన సచివాలయం ప్రారంభానికి హాజరైన జడ్పీ చైర్మన్లు

నవతెలంగాణ-మంథని: ఆదివారం హైదరాబాదులో నూతనంగా నిర్మించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయ కార్యాలయ ప్రారంభోత్సవ వేడుకలకు పెద్దపల్లి జడ్పీ చైర్మన్, మంథని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంఛార్జి పుట్ట మధుకర్, భూపాలపల్లి జడ్పీ చైర్మన్ జక్కు శ్రీహరిని హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు హరీష్ రావ్, కొప్పుల ఈశ్వర్, సత్యవతి రాథోడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట మంథని నియోజకవర్గ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

రైతులకు కన్నీరు మిగిల్చిన వడగండ్ల వాన

నవతెలంగాణ-ఓదెల: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం వడగండ్ల వానకు వరి పొలాలు దెబ్బతిన్నాయి. వడ్లు పూర్తిగా రాలడమే కాక వరి నేలమట్టమయింది. దీంతో రైతులు కన్నీరు మున్నీరుగా విలపించారు. హరిపురం, కనగర్తి, కొమిరె గ్రామాల్లో ఈదురుగాలితో కూడిన వర్షం పడడంతో వరి పొలాల్లో వడ్లురాలగా కోసిన ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయింది. అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కొలనూరు వాసి

నవతెలంగాణ-ఓదెల: మండలంలోని కొలనూరు గ్రామానికి చెందిన మాటూరి రత్నంను ఆదివారం తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘాల ఎన్నికల్లో రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన రాష్ట్ర నాయకులు జే.బి రాజు, అయిలయ్యకు రత్నం కృతజ్ఞతలు తెలిపారు. రత్నం నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. మాటూరి రత్నం కొలనూర్ గ్రామంలో సుమారు 30 సంవత్సరాల నుండి అంబేద్కర్ సంఘంలో వివిధ పదవుల్లో పని చేస్తూ... అనేక సేవా కార్యక్రమాలు చేయడంతో పాటు ఎన్నో అవార్డులు సైతం అందుకున్నారు.



కనగర్తి గ్రామంలో బీఎస్పీ బూత్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఓదెల: ఓదెల మండలం కనగర్తి గ్రామానికి చెందిన వివిధ పార్టీల నుండి 70 మంది రాష్ట్ర కార్యదర్శి దాసరి హనుమయ్య ఆధ్వర్యంలో బీఎస్పీ లో చేరారు. వారికి హనుమయ్య కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హనుమయ్య ఆధ్వర్యంలో బూత్ కమిటీ ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షులుగా పిట్టల శివ, ఉపాధ్యక్షులుగా ఎండి రషీద్, ప్రధాన కార్యదర్శిలుగా పెండెం కుమార్, దాసరి తిరుపతి, పట్నం మల్లికార్జున్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం దాసరి హనుమయ్య మాట్లాడుతూ.. పార్టీలో చేరి బాధ్యతలు తీసుకున్న వారికి అభినందనలు తెలిపారు. మే 7న హైదరాబాద్‌లో నిర్వహించే తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సాతురీ అనిల్, ఓదెల మండల అధ్యక్షులు పల్లె ప్రశాంత్, కళ్యాణ మహేష్, కాసర్ల శ్రీనివాస్, ఎండీ వాహీద్, అపరాధి వంశీ తదితరులు పాల్గొన్నారు.



పెద్దపల్లి జిల్లా ఆర్యవైశ్య మహిళా అధ్యక్షురాలిగా పల్లా అపర్ణ సురేష్

నవ తెలంగాణ-పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు కోలేటి రమేష్, సుల్తానాబాద్ మున్సిపాలిటీకి చెందిన పల్లా అపర్ణ సురేష్‌ను జిల్లా ఆర్యవైశ్య సంఘం మహిళ అధ్యక్షురాలుగా నియమించారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన వోజ్జల పద్మ సదానందం ను జిల్లా కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా తమ ఎన్నికకు సహకరించిన ఆర్యవైశ్య సంఘం నాయకులకు కోలేటి రమేష్, పద్మ సదానందం కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వంగల వెంకట్ నారాయణ, సెక్రటరీ లింగమూర్తి, కోశాధికారి సదానందం, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఈసీ మెంబర్ మొగిల్లపల్లి కష్ణమూర్తి, పెద్దపల్లి ఆర్యవైశ్య సంఘం ఎన్నికల కన్వీనర్ కొమురవెల్లి రాజేందర్, పెద్దపల్లి జిల్లా యువజన సంఘం అధ్యక్షులు పెద్ది వెంకటేష్, కార్యదర్శి బజ్జురి హరీష్, కోశాధికారి గుండ సాయి కృష్ణ, జిల్లాకు చెందిన పలువురు ఆర్యవైశ్య సంఘం నేతలు, పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు. ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మే డే శుభాకాంక్షలు

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ: దేశ వ్యాప్తంగా ఉన్న కార్మిక వర్గానికంతటికి కొండగట్టు దేవస్థానం మాజీ డైరెక్టర్, సౌత్ జోన్ సెస్టోబాల్ చైర్మన్ జక్కుల దామోదర్ రావ్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారీ వ్యవస్థ కార్మిక లోకాన్ని చిన్నాభిన్నం చేస్తోందని, స్థానిక మద్దతుతో సంఘటితంగా పోరాటాలు చేయడం ద్వారానే పెట్టుబడిదారీ ఎత్తుగడలను తిప్పి కొట్టవచ్చని అన్నారు.



మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ వీక్షించిన గొట్టిముక్కుల సురేష్ రెడ్డి

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్: పెద్దపల్లి పట్టణంలోని 55వ బూత్ పరిధిలో గల తన నివాసంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని పెద్దపల్లి నియోజకవర్గ బీజేపీ నాయకులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి బీజేపీ నాయకులతో కలిసి వీక్షించారు. అనంతరం మన్ కి బాత్ కార్యక్రమం గురించి వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో వునుకొండ తిరుపతి, ప్రమోద్ రావు, మొలుగురి రాజవీరు, మోర మనోహర్, నాయిని శ్రీనివాస్ రెడ్డి, మోసంపల్లి శ్రీధర్, లింగంపల్లి కరుణాకర్, కల్వల శ్రీనివాస్ రెడ్డి, ఐద తిరుపతి, తూముల రవితేజ, ఇగురం రామస్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సచివాలయంలో సంక్షేమ శాఖ కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-ధర్మారం: హైదరాబాద్‌లో నూతనంగా నిర్మించిన బీఆర్ అంబేద్కర్ నూతన సచివాలయంలో సంక్షేమ శాఖ కార్యాలయాన్ని ఆదివారం సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, మంత్రి ఈశ్వర్ సతీమణి కొప్పుల స్నేహలత ఈశ్వర్, పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్, పెద్దపల్లి జిల్లా సహకార సంఘాల ఫోరం చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి, ప్రజా ప్రతినిధులు, సంక్షేమ శాఖ అధికారులు. మంత్రి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-గోదావరిఖని: ఎన్టీపీసీ క్రిష్ణానగర్‌కు చెందిన జగదీష్ మనియర్ తండ్రి శివ ప్రసాద్ ఆదివారం మృతి చెందగా, మృతుని కుటుంబాన్ని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆదివారం పరామర్శించారు. శివ్ ప్రసాద్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట కార్పొరేటర్ మహంకాళి స్వామి తదితరులున్నారు.



నివాళి అర్పిస్తున్న మక్కాన్‌సింగ్

ఛండీ యాగంలో పాల్గొన్న కార్పొరేటర్ పాతపల్లి లక్ష్మి ఎల్లయ్య యాదవ్

నవతెలంగాణ-గోదావరిఖని: గోదావరిఖని జవహర్‌నగర్‌లోని జయదుర్గా దేవి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన ఛండీ యాగంలో 46వ డివిజన్ కార్పొరేటర్ పాతపల్లి లక్ష్మి ఎల్లయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాగం నిర్వహించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. రామగుండం ప్రజలను చల్లంగా చూడాలని ఈ సందర్భంగా వారు వేడుకున్నారు.



యాగంలో పాల్గొన్న కార్పొరేటర్ దంపతులు

మేడే వేడుకలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-గోదావరిఖని: తెలంగాణ లేబర్ పార్టీ ఆధ్వర్యంలో గోదావరిఖనిలోని మేదర్ బస్తీలోని పార్టీ ఉత్తర తెలంగాణ కేంద్ర కార్యాలయంలో నిర్వహించే మేడే వేడుకలను జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గొర్రె రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్మికుల హక్కుల కోసం తెలంగాణ లేబర్ పార్టీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. సమావేశంలో నాయకులు గాజుల రమేష్‌తో పాటు తదితరులున్నారు.



మాట్లాడుతున్న గొర్రె రమేష్

వన్‌టౌన్ సీఐని కలిసిన హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నవతెలంగాణ-గోదావరిఖని క్రైం: గోదావరిఖని వన్‌టౌన్ నేర పరిశోధన సీఐ ఎస్.ప్రసాద్ రావును హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలిత ఆదివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఫ్యామిలీ కౌన్సెలింగ్‌కు సంబంధించి హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ పరంగా తాను సహాయ, సహకారాలు అందిస్తానని ఆమె సీఐకి విజ్ఞప్తి చేశారు.



మానవ హక్కుల పరిరక్షణపై అవగాహన

నవతెలంగాణ- గోదావరిఖని క్రైం: గోదావరిఖని పవర్ హౌస్ కాలనీలోని ప్రభుత్వ శాఖ గ్రంథాలయంలో ఆదివారం మానవ హక్కుల పరిరక్షణ అనే అంశంపై తెలంగాణ హ్యూమన్ రైట్స్ కౌన్సెల్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ ఈదునూరి శంకర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్ఎస్ యువజన నాయకులు ఉప్పల శ్రీధర్, హ్యూమన్ రైట్స్ కౌన్సెల్ జిల్లా నాయకులు దేశబోయిన శ్రీనివాస్, శాఖ గ్రంథాలయ లైబ్రేరియన్ ఎం.భారతి, టీయూడబ్ల్యూజే జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కెఎస్.వాను, నాయకులు దబ్బెట శంకర్, ఊట్ల సురేష్, అనురాగ్, ప్రీతం, ఎల్మపల్లి అనిల్ సంపత్, శ్రీలక్ష్మి, అనిల్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఈదునూరి శంకర్

మే డే కార్మిక ఐక్యతకు చిహ్నం

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి సావనపెల్లి వెంకట స్వామి

నవ తెలంగాణ- పెద్దపల్లి: మే డే అంతర్జాతీయ కార్మిక ఐక్యతకు చిహ్నమని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి సావనపెల్లి వెంకట స్వామి అన్నారు. శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా వేలాది గొంతుకలు ఒకటైన కాలానికి నిలువెత్తు సాక్ష్యం. 8 గంటల పని విధానమని.. కార్మికుల హక్కుల సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన మహోజ్జల ఘట్టమని అన్నారు. ఇంతటి మహత్తర పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను ఈరోజు ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మే డే స్ఫూర్తితో కార్మికుల్లో చైతన్యాన్ని రగిలించి హక్కులను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందన్నారు.

